www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

ఆదివారం | 20-4-2025 | పేజీలు: 18+10+28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 4 | శ్రీ విశ్వావసు నామసంవత్సరం, ఉత్తరాయణం, వసంతఋతువు, చైత్రమాసం, బహుళ పక్షం తిథి: సప్తమి రా.7.01 తదుపరి అష్టమి, నక్షత్రం: పూర్వాషాఢ ఉ.11.48 తదుపరి ఉత్తరాషాఢ, వర్జ్యం: రా.8.04-9.43, దుర్ముహూర్తం: సా.4.49-5.38, అమృతఘడియలు: ఉ.6.42-8.24, రాహుకాలం: సా.4.30-6.00, సూర్యోదయం: 5.59, సూర్యాస్తమయం: 6.28 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

ఆదివారం | 20-4-2025 | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | విజయవాడ సిటీ**



www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



ఆదివారం | 20-4-2025 | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | విజయవాడ సిటీ



బాబు @75



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేడు 75వ పుట్టినరోజు జరుపుకొంటున్నారు. తెలుగునాట ఇంత సుదీర్ఘ కాలం రాజకీయాలలో కీలక పాత్ర పోషిస్తూ వచ్చిన నాయకుడు మరొకరు లేరంటే అతిశయోక్తి కాదు.

తన రాజకీయ పోకడలు, నిర్ణయాలపై చంద్రబాబు ఎన్నో విమర్శలు ఎదుర్కొన్నారు. సందర్భాన్ని, పరిస్థితిని బట్టి నిర్ణయాలు తీసుకొని ఉండకపోతే ఇతరుల వలె తాను కూడా రాజకీయాల నుంచి ఎప్పుడో కనుమరుగయ్యే వాడినని విమర్శకులకు సమాధానంగా ఆయన చెబుతుంటారు. ఒక దశలో ప్రధాని పదవి చేపట్టే అవకాశం వచ్చినా కాదనుకున్నారు.

చంద్రబాబుకు తెలుగు భాష, ఇంగ్లిషుపై అంతగా పట్టు లేదు. అయినా అంతర్జాతీయ ప్రముఖుల మన్ననలను ఆయన చూరగొనగలిగారు. అభివృద్ధి విషయంలో ఆయనకు ఉన్న అంకితభావమే ఇందుకు కారణం.

భూదేవికి ఉన్నంత సహనం, ఓర్పు ఆయన సొంతం. అవమానాలను దిగమింగుకుంటూ ఆయన పార్టీని కాపాడుకున్నారు. సంక్షోభాలను అవకాశాలుగా మలుచుకుంటూ ఎదిగారు. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చంద్రబాబుకు ఎదురైన అవమానాలు అన్నీ ఇన్నీ కావు.

అధికారాన్ని అభివృద్ధి కోసం ఉపయోగించి రాష్ట్ర చరిత్రలో తన పేరు చిరస్థాయిగా ఉండిపోవాలన్న కీర్తి కాంక్ష చంద్రబాబుకు మెండుగా ఉంది. అందుకే రాజధాని అమరావతిని అద్భుతంగా నిర్మించి ప్రజల గుండెల్లో నిలిచిపోవాలని ఆయన కలలుగంటున్నారు.

కొత్త పలుకు -ఆర్కే విశ్లేషణ ఎడిట్ పేజీలో


మీడియాతో మాట్లాడుతున్న మిథున్‌రెడ్డి, వైసీపీ నేతలు

తెలియదు.. చెప్పలేను!

'సిట్' విచారణలో మిథున్ రెడ్డి తీరిదీ

- నేను ఎంపీని.. ఏపీ వ్యవహారాలు తెలియవని దాటవేత
- కుట్రతోనే మద్యం ఆరోపణలు.. ఏ సంబంధమూ లేదని వాదన
- కసిరెడ్డితో ఉన్నది పార్టీ సంబంధమేనని వెల్లడి
- కానీ, ఆయనతో పీఎల్ఆర్ లావాదేవీలపై ప్రశ్నలకు తడబాటు
- ముందు తెలియదని.. ఆనక డబ్బు ఇచ్చేశాడని జవాబు
- 'అరబిందో' నుంచి అప్పు తీసుకోలేదని వాదన
- 7 గంటలపాటు విచారణ.. 100 ప్రశ్నలు
- జవాబుల తీరుపై సిట్ అసంతృప్తి.. మళ్లీ విచారణకు పిలుపు?

4

జిల్లాకో సైబర్ పోలీస్ స్టేషన్

రాష్ట్రంలో కొత్తగా మరో 10 పీఎస్‌లు 5

మహిళలు, చిన్నారుల భద్రతే ప్రభుత్వ ధ్యేయం: అనిత



మరమనుషుల హాఫ్ మారథాన్



» ప్రపంచంలోనే తొలిసారిగా చైనాలో రోబోల పరుగు పందెం

బీజింగ్, ఏప్రిల్ 19 : రోబోటిక్స్‌లో అమెరికాతో పోటీపడుతున్న చైనా.. కృత్రిమ మేధ రంగంలో తన ఆధిపత్యాన్ని ప్రపంచానికి చాటేలా ఓ అద్భుతాన్ని ప్రదర్శించింది. ప్రపంచంలోనే తొలిసారిగా హ్యూమనాయిడ్ రోబోలకు పరుగు పందెం.. అది కూడా హాఫ్ మారథాన్‌ను శనివారం విజయవంతంగా నిర్వహించి.. ఔరా అనిపించింది. బీజింగ్ ఈ-టౌన్‌గా పిలువబడే బీజింగ్ ఎకనమిక్ - టెక్నలాజికల్ డెవలప్‌మెంట్ ఏరియా ఈ అద్భుతానికి వేదికైంది. 21 కిలోమీటర్ల పరుగు పందెం(హాఫ్ మారథాన్)లో 21 హ్యూమనాయిడ్ రోబోలు పోటీ పడి పరుగు తీశాయి. వేర్వేరు విశ్వవిద్యాలయాలు, సంస్థలు అభివృద్ధి చేసిన, దేనికదే ఆకారంలో ప్రత్యేకంగా ఉండే రోబోలు పోటీలో పాల్గొన్నాయి. రోబోలను అభివృద్ధి చేసిన సాంకేతిక బృందాల సభ్యులు కూడా తమతమ రోబోలతో కలిసి పరుగుడెతూ అవి గమ్యస్థానాన్ని చేరుకునేలా చేశారు. ఈ హాఫ్ మారథాన్‌లో తియంగాంగ్ జట్టుకు చెందిన తియంగాంగ్ అల్ట్రా రోబో 2 గంటల 40 నిమిషాల్లో రేసును పూర్తి చేసి విజేతగా నిలిచింది.

చూసేకి అగ్గిరవ్వ మాదిరి..

» కూతురు నిశ్చితార్థ వేడుకలో పుష్ప సినిమా పాటకు కేజ్రీవాల్ దంపతుల డ్యాన్స్



న్యూఢిల్లీ, ఏప్రిల్ 19 : ఆప్ అధినేత అర్వింద్ కేజ్రీవాల్, ఆయన సతీమణి సునీత కేజ్రీవాల్ పుష్ప సినిమా పాటపై హుషారుగా నృత్యం చేశారు! ఇటీవల.. అంటే ఈనెల 18న ఢిల్లీలోని ఓ విలాసవంతమైన ఐదు నక్షత్రాల హోటల్లో కేజ్రీవాల్ దంపతుల కూతురు హర్షిత కేజ్రీవాల్ వివాహ నిశ్చితార్థం ఆమె కాలేజీ స్నేహితుడు సంభవ్ జైన్‌తో జరిగింది. ఈ కార్యక్రమంలో వేదికపై 'అంగారోంకా అంబర్ సా..' (తెలుగులో.. 'చూసేకి అగ్గిరవ్వ మాదిరి) పాట వస్తోంటే కేజ్రీవాల్ దంపతులు లయబద్ధంగా పదం పదం కలపడంతో ఆహూతులు చప్పట్లతో అభినందించారు. ఈ వీడియోను ఎక్స్‌లో పోస్ట్ చేయడంతో ఇప్పుడు వైరల్ అవుతోంది. ఈ వేడుకలో పంజాబ్ సీఎం భగవంత్ మన్ యమా జోష్‌గా భాంగ్రా నృత్యంతో అలరించారు. కాగా, శుక్రవారం హర్షిత, సంభవ్‌ల వివాహం ఘనంగా జరిగింది.

లోకం తీరు



ఈ ఏడాది చివర్లో భారత్‌లో మస్క్ పర్యటన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 19: ఈ ఏడాది చివరిలో తాను భారత్‌లో పర్యటించనున్నట్లు ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ శనివారం వెల్లడించారు. ప్రధాని మోదీతో శుక్రవారం ఫోన్‌లో సంభాషించిన తర్వాత మస్క్ నుంచి ఈ ప్రకటన రావడం గమనార్హం. మస్క్ సంస్థ టెస్లా భారత్‌లో విద్యుత్ వాహనాలను విడుదల చేయడానికి సిద్ధం అవుతున్న వేళ ఆయన ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. ప్రధాని మోదీతో సంభాషించడాన్ని గౌరవంగా భావిస్తున్నట్లు మస్క్ శనివారం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. అమెరికా డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియన్సీ(డోజ్)లో ఆయన కీలక పాత్ర వహిస్తోన్న విషయం తెలిసిందే. కాగా సుదీర్ఘ కాలంగా భారత మార్కెట్లో ప్రవేశించేందుకు ఎదురుచూస్తోన్న మస్క్ సంస్థ టెస్లా అందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. ముంబయికి దగ్గరలోని ఒక ఓడరేవుకు టెస్లా కొన్ని వేల విద్యుత్ వాహనాలను మరి కొద్ది నెలల్లో రవాణా చేయనుందని బ్లూమ్‌బర్గ్ ఒక కథనంలో పేర్కొంది. టెస్లా ఈ ఏడాది మూడో త్రైమాసికంలో ముంబయి, ఢిల్లీ, బెంగళూరు వంటి ముఖ్య నగరాల్లో విక్రయాలు కూడా ప్రారంభించనున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ టారిఫ్‌ల మోత, ఎగుమతులు, దిగుమతుల్లో కల్లోలం నేపథ్యంలో.. భారత్, అమెరికా మధ్య వాణిజ్య చర్చలు జరగనున్నాయి. అమెరికాలోని వాషింగ్టన్‌లో ఈ నెల 23 నుంచి మూడు రోజుల పాటు జరిగే ఈ చర్చల్లో సుంకాలు, ఇతర సమస్యలు, కస్టమ్స్ ఏర్పాట్లు సహా 19 అంశాలపై ఇరు దేశాల ఉన్నతాధికారులు చర్చించనున్నారు. ఈ చర్చల్లో భారత బృందానికి కేంద్ర వాణిజ్య శాఖ అదనపు కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ నేతృత్వం వహిస్తారు.

'జంధ్యం వివాదం'లో ఇద్దరు హోంగార్డుల సస్పెన్షన్

బెంగళూరు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): వృత్తివిద్యా కోర్సులలో ప్రవేశానికి నిర్వహించిన సీఈటీ పరీక్షలు రాసేందుకు వెళ్లిన విద్యార్థుల జంధ్యం తొలగించాలని ఆంక్షలు విధించిన వ్యవహారంపై జిల్లా అధికారి గురుదత్త హెగ్డే స్పందించారు. శివమొగ్గలోని ఆదిచుంచనగిరి పీయూ కళాశాల పరీక్షా కేంద్రం వద్ద విధులు నిర్వహిస్తూ, జంధ్యాన్ని తొలగించాలని సూచించిన ఇద్దరు హోంగార్డులను సస్పెండ్ చేశారు. ఈ వివాదంపై కర్ణాటక బ్రాహ్మణ సభ ప్రతినిధి నటరాజ్ భాగవత్ ఫిర్యాదు మేరకు పోలీసులు శుక్రవారం ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఇద్దరు విద్యార్థులకు జంధ్యం తొలగించాలని సూచించగా, ఒక విద్యార్థి తొలగించుకుని పరీక్ష రాశారు. మరో విద్యార్థి కాసేపు వేచి ఉండి, ప్రిన్సిపాల్ అనుమతితో పరీక్ష రాశారు. బీదర్‌లో విద్యార్థి సుచివ్రత్ జంధ్యం తొలగించడం ఇష్టంలేక పరీక్ష రాయకుండా వెనుదిరిగారు. విషయం తెలుసుకున్న బ్రాహ్మణ మహాసభ శనివారం ఆందోళనకు దిగింది.

బంగ్లాదేశ్‌లో హిందూనేత భబేశ్ చంద్ర హత్య

న్యూఢిల్లీ, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌లో ప్రముఖ హిందూ మైనారిటీ నాయకుడు భబేశ్ చంద్ర రాయ్(58) హత్యకు గురయ్యారు. దీంతో ఆ దేశంలోని యూనుస్ పాలనపై భారత్ తీవ్రంగా ధ్వజమెత్తింది. మైనారిటీ ప్రజలకు రక్షణ కల్పించడంలో బంగ్లాదేశ్‌లోని తాత్కాలిక ప్రభుత్వం విఫలమైందని విమర్శించింది. 'ఈ ఘటనను మేం ఖండిస్తున్నాం. సాకులు చెప్పకుండా, భేదభావం లేకుండా హిందువులు సహా మైనారిటీలందరినీ రక్షించే బాధ్యతను తాత్కాలిక ప్రభుత్వానికి మరోసారి గుర్తుచేస్తున్నాం' అంటూ కఠిన పదాలతో విదేశాంగశాఖ ప్రకటన విడుదల చేసింది. దినాజ్‌పూర్ జిల్లాకు చెందిన చంద్ర రాయ్‌కు బుధవారం సాయంత్రం 4.30గంటలకు తెలిసిన వ్యక్తుల నుంచి ఫోన్ కాల్ వచ్చింది. అనంతరం నలుగురు వ్యక్తులు రెండు బైక్‌లపై ఆయన ఇంటికి వచ్చారు. వారు ఆయనను కిడ్నాప్ చేసి సమీపంలోని నరబరి గ్రామానికి తీసుకెళ్లి దాడికి పాల్పడ్డారు. అనంతరం ఇంటికి చేరుకున్న చంద్రరాయ్ అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు. కుటుంబసభ్యులు హుటాహుటిన ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మరణించినట్టు వైద్యులు తెలిపారు.

వూహాన్ ల్యాబ్ నుంచే కరోనా: వైట్‌హౌస్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 19: కరోనా వైరస్ ఎక్కడి నుంచి వచ్చిందన్న చర్చకు అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్ మళ్లీ ఆజ్యం పోసింది. దాని వెబ్‌సైట్‌లో కొత్త పేజీని ప్రారంభించడం ద్వారా.. కొవిడ్-19 వైరస్ వ్యాప్తికి చైనాలోని వూహాన్ ల్యాబ్‌నే మూలమని అభివర్ణించింది. అమెరికా మాజీ అధ్యక్షుడు జో బైడెన్, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అలెర్జీ, ఇన్ఫెక్షియస్ డిసీజెస్ (ఎన్ఐఏఐడీ) డైరెక్టర్ డాక్టర్ ఆంటోనీ ఫౌసీ ఈ నిజాన్ని దాచేందుకు ప్రయత్నించారని ఆరోపించింది. ట్రంప్ సర్కారు కొవిడ్.జీవోవీ వెబ్‌సైట్‌లో "ల్యాబ్ లీక్: ద ట్రు ఆరిజన్స్ ఆఫ్ కొవిడ్-19" అనే శీర్షికతో కొత్త పేజీని జోడించింది. డాక్టర్ ఫౌసీ, బైడెన్ నేతృత్వంలోని గత ప్రభుత్వం కరోనా వైరస్ మూలానికి సంబంధించిన సమాచారాన్ని దాచడానికి ప్రయత్నించిందని, దీనివల్ల గందరగోళం నెలకొందని ఆ పేజీలో పేర్కొంది.

దేశంలో అంతర్యుద్ధాలకు చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నాదే బాధ్యత

మత యుద్ధాలు రేగితే సుప్రీంకోర్టు బాధ్యత వహించాల్సి ఉంటుంది

» సుప్రీంకోర్టు పరిధి దాటుతోంది

» కోర్టే చట్టాలు చేసేట్టు అయితే పార్లమెంట్ ఎందుకు, మూసేద్దాం

» బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, ఏప్రిల్ 19: రాష్ట్రపతికి బిల్లుల ఆమోదంపై గడువు విధించడం, వక్ఫ్ సవరణ చట్టంపై విచారణ నేపథ్యంలో సుప్రీంకోర్టుపై బీజేపీ జార్ఖండ్ ఎంపీ నిశికాంత్ దూబే తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దేశంలో మత యుద్ధాలు రేగితే అందుకు సుప్రీంకోర్టు బాధ్యత వహించాల్సి ఉంటుందని.. దేశంలో అన్ని అంతర్యుద్ధాలకు సుప్రీం చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా బాధ్యుడని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు తన పరిధి దాటి వ్యవహరిస్తోందని వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆయన శనివారం ఎక్స్‌లో పోస్టు చేయడంతోపాటు మీడియాతో మాట్లాడారు. "ఎవరైనా ప్రతిదానికి సుప్రీంకోర్టుకు వెళ్లాల్సి వస్తే, సుప్రీంకోర్టే చట్టాలు చేసేట్టు అయితే ఇక పార్లమెంటు ఎందుకు? అలాంటప్పుడు పార్లమెంటు, రాష్ట్ర అసెంబ్లీను మూసేయాలి" అని నిశికాంత్ దూబే పేర్కొన్నారు. సుప్రీం చీఫ్ జస్టిస్‌ను రాష్ట్రపతి నియమిస్తారని, అలాంటి రాష్ట్రపతికి ఎలా ఆదేశాలు ఇస్తారని ప్రశ్నించారు. దేశానికి సంబంధించిన అన్ని చట్టాలను చేసే పార్లమెంటును కోర్టు ఎలా నిర్దేశిస్తుందని నిలదీశారు. రాష్ట్రపతికి మూడు నెలల గడువు విధించాలని ఏ చట్టంలో ఉందని నిశికాంత్ దూబే ప్రశ్నించారు. సుప్రీంకోర్టు దేశాన్ని అరాచకత్వం వైపు నడిపించాలని చూస్తోందని మండిపడ్డారు. పార్లమెంటు సమావేశాలు జరిగినప్పుడు ఈ అంశంపై విస్తృతంగా చర్చిస్తామని చెప్పారు.

చట్టాలు చేసే అధికారం పార్లమెంటుదే..

"స్వలింగ సంపర్కం పెద్ద నేరమని ఐపీసీ సెక్షన్ 377 చెబుతుంది. హిందూ, ముస్లిం, బౌద్ధులు, జైనులు, సిక్కులు ఏ మతం వారైనా సరే అది నేరమనే నమ్ముతారు. కానీ సుప్రీంకోర్టు మాత్రం అది నేరం కాదంటుంది. ఇక రాజ్యాంగంలోని ఆర్టికల్ 141 ప్రకారం పార్లమెంటు చేసే చట్టాలు, ఇచ్చే ఆదేశాలను కింది కోర్టు నుంచి సుప్రీంకోర్టు దాకా పాటించాలి. ఆర్టికల్ 368 ప్రకారం.. దేశంలో చట్టాలు చేసే అధికారం పార్లమెంటుది అయితే సుప్రీంకోర్టుకు దానిపై వ్యాఖ్యానించే హక్కు మాత్రమే ఉంది" అని నిశికాంత్ దూబే పేర్కొన్నారు. దేశంలో మత యుద్ధాలు రేగితే అందుకు సుప్రీంకోర్టు బాధ్యత వహించాల్సి ఉంటుందని వ్యాఖ్యానించారు.

వంట నూనె వాడకాన్ని 10% తగ్గిద్దాం: మోదీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యాన్ని పెంపొందించుకోవడంలో భాగంగా వంట నూనె వాడకాన్ని పది శాతం తగ్గించుకోవడం అనే చిన్న చర్యతో పెద్ద మార్పును చూస్తామని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఊబకాయంపై మరింత అవగాహన పెంపొందించడం ద్వారా ఆరోగ్యవంతమైన భారతదేశాన్ని నిర్మించుకుందామని దేశ ప్రజలకు ఎక్స్ వేదికగా పిలుపునిచ్చారు. ప్రపంచ కాలేయ దినోత్సవం సందర్భంగా కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా ఎక్స్‌లో శుక్రవారం చేసిన పోస్టుకు మోదీ ఈ మేరకు స్పందించారు. కాగా, ఆరోగ్యవంతమైన జీవన విధానాన్ని అలవాటు చేసుకోవడంలో భాగంగా రోజు తీసుకునే ఆహారం తయారీలో వాడే వంట నూనె వినియోగాన్ని పది శాతం తగ్గిస్తామని కాలేయ దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేద్దామని ప్రజలకు పిలుపునిస్తూ నడ్డా ఎక్స్‌లో ఓ పోస్టు చేశారు.

2026 సెప్టెంబరు నాటికి పీఎఫ్‌బీఆర్ ప్లాంట్ రెడీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 19: తమిళనాడులోని కల్పాక్కంలో సిద్ధమవుతున్న భారతదేశపు మొట్టమొదటి ప్రోటోటైప్ ఫాస్ట్-బ్రీడర్ రియాక్టర్ (పీఎఫ్‌బీఆర్) వచ్చే ఏడాది సెప్టెంబరు నాటికి అందుబాటులోకి రానుంది. అణుశక్తి నియంత్రణ మండలి (ఏఈఆర్‌బీ) నుంచి అనుమతి లభించిన దాదాపు రెండేళ్ల తర్వాత.. దీన్ని వచ్చే ఏడాది ప్రారంభించనున్నట్టు అధికారులు తెలిపారు. భారత అణుశక్తి లక్ష్యానికి ప్రోటోటైప్ ఫాస్ట్-బ్రీడర్ రియాక్టర్ చాలా ముఖ్యం. ఇది అందుబాటులోకి వస్తే ఇంధన వనరులను సమర్థవంతంగా వాడుకోవచ్చు. అణు వ్యర్థాలను తగ్గించవచ్చు. కల్పాక్కంలో ఏర్పాటుచేస్తున్న పీఎఫ్‌బీఆర్.. ప్లూటోనియం ఆధారిత మిశ్రమ ఆక్సైడ్‌ను ఇంధనంగా, ద్రవ సోడియంను శీతలకారిగా ఉపయోగించే మొట్టమొదటి అణు రియాక్టర్.

మహారాష్ట్రలోనూ హిందీ చిచ్చు

ముంబై, ఏప్రిల్ 19: ఇప్పటివరకు దక్షిణాది రాష్ట్రాలకే పరిమితమైందని అనుకుంటున్న హిందీ చిచ్చు ఇప్పుడు మహారాష్ట్రనూ చుట్టుముడుతోంది. ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకూ హిందీ, మరాఠీ మీడియం బడి పిల్లలందరికీ హిందీ విధిగా బోధించాలని మహారాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయాన్ని ఆ రాష్ట్ర ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. మరాఠీ భాషను చంపేయాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం భావిస్తోందని, దానికి రాష్ట్ర ప్రభుత్వం వంత పాడుతోందని ఆరోపిస్తున్నాయి. తాజాగా ఓ సమావేశంలో మాట్లాడుతూ, హిందీని తప్పనిసరి చేయడాన్ని తాము ఎట్టిపరిస్థితులలోనూ ఒప్పుకోబోమని శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే రూఢీ చేశారు. మహారాష్ట్రలో ఉండే వారెవరైనా జై మహారాష్ట్ర అనేల్సిందేనని స్పష్టం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశంలోని ప్రజలను భాషా ప్రాతిపదికన విభజించాలని చూస్తోందని ఉద్ధవ్ ఆరోపించారు. అదేవిధంగా మహారాష్ట్రలో త్రిభాషా సూత్రాన్ని తాము ఒప్పుకోబోమని మహారాష్ట్ర నవ నిర్మాణ్ సేన (ఎమ్ఎన్ఎస్) అధినేత రాజ్‌ఠాక్రే పేర్కొన్నారు. మహారాష్ట్రలో మరాఠీ మాట్లాడే ప్రజల మధ్య ఇతర భాషల వారి మధ్య బీజేపీ చిచ్చు పెట్టాలని చూస్తోందని ఆయన ఆరోపించారు.

నేషనల్ హెరాల్డ్ కేసుపై ప్రజల్లోకి వెళ్తాం

» అక్రమ కేసులకు భయపడం..రేపటి నుంచి పలు రూపాల్లో ఉద్యమాలు

» మే 31నాటికి డీసీసీల నియామకం పూర్తి: ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే



న్యూఢిల్లీ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అధినాయకత్వంపై పెద్ద కుట్ర జరుగుతోందని, బీజేపీ అక్రమంగా కేసులు పెడుతోందని ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే ఆరోపించారు. నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా, రాహుల్ గాంధీల పేర్లను అక్రమంగా చార్జిషీట్‌లో చేర్చడమే ఇందుకు ఉదాహరణ అని తెలిపారు. ఈ కేసుపై ప్రజల్లోకి వెళ్దామని, అన్ని విషయాలను వారికి వివరిద్దామని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం ఢిల్లీలోని కాంగ్రెస్ జాతీయ కార్యాలయంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులు, అనుబంధ సంస్థ ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఖర్గే మాట్లాడారు. ఈడీని బీజేపీ దుర్వినియోగం చేస్తోందని విమర్శించారు. మోదీ, అమిత్ షాలు క్రిమినల్ బుద్ధితో కాంగ్రెస్ అగ్రనాయకులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు. అయినా భయపడే ప్రసక్తే లేదన్నారు. కాంగ్రెస్ చేపట్టనున్న ఉద్యమాల వివరాలను ఖర్గే ప్రకటించారు. సోనియా, రాహుల్‌లపై ఈడీ పెట్టిన కేసుల గురించి ఈ నెల 21 నుంచి 24 వరకు మీడియా సమావేశాల ద్వారా ప్రజలకు వివరిస్తామని తెలిపారు. ఏప్రిల్ 25 నుంచి మే 30 వరకు రాజ్యాంగాన్ని కాపాడడం గురించి ప్రత్యేక కార్యాచరణను రూపొందించామని తెలిపారు. ఏప్రిల్ 25 నుంచి 30 వరకు ర్యాలీలు నిర్వహిస్తామని, మే 3 నుంచి మే 10 వరకు జిల్లా స్థాయిల్లో, మే 11 నుంచి మే17 వరకు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో కార్యక్రమాలు చేపడతామని వివరించారు. మే 20 నుంచి 30 వరకు ఇంటింటికీ వెళ్లి బీజేపీ అరాచకాలను వివరిస్తామని తెలిపారు. మరోవైపు, అహ్మదాబాద్‌లో జరిగిన ఏఐసీసీ సమావేశంలో జిల్లా కమిటీలను బలోపేతం చేయాలని నిర్ణయించామని ఖర్గే గుర్తు చేశారు. మే 31నాటికి దేశంలోని అన్ని జిల్లాల కాంగ్రెస్ అధ్యక్షుల నియామకాన్ని పూర్తి చేస్తామన్నారు.

ఢిల్లీలో కుప్పకూలిన 4 అంతస్తుల భవనం

» 11 మంది దుర్మరణం, 11 మందికి గాయాలు

» తెల్లవారుజామున ముస్తఫాబాద్‌లో ఘటన



న్యూఢిల్లీ, ఏప్రిల్ 19: దేశ రాజధాని ఢిల్లీలో ఘోర విషాద ఘటన చోటుచేసుకుంది. ఈశాన్య ఢిల్లీలో తెల్లవారుజామున ఓ బహుళ అంతస్తుల నివాస భవనం కుప్పకూలింది. ఈ ఘటనలో ముగ్గురు చిన్నారులు సహా 11 మంది దుర్మరణం చెందారు. మరో 11 మంది గాయాలపాలయ్యారు. సమాచారం అందుకున్న జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్‌డీఆర్ఎఫ్), అగ్ని మాపక సిబ్బంది, ఢిల్లీ పోలీసులు, వాలంటీర్లు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. శిథిలాల కింద చిక్కుకుపోయిన వారిని బయటకు తీసేందుకు 12 గంటలకుపైగా శ్రమించారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో ముస్తఫాబాద్ ఏరియాలో ఉన్న 20 ఏళ్ల నాటి నాలుగంతస్తుల భవనం కుప్పకూలింది. ఘటన జరిగినప్పుడు భవనంలో 22 మంది ఉన్నారు. ఇందులోనే భవన యజమాని తెహసీన్‌తోపాటు ఆయన కుటుంబసభ్యులు నివసిస్తున్నారు. భవనం కూలిపోవడంతో తెహసీన్, మరో ఆరుగురు కుటుంబసభ్యులు ప్రాణాలు కోల్పోయారు. భవనం గ్రౌండ్ ఫ్లోర్‌లో రెండు మూడు దుకాణాలకు సంబంధించిన నిర్మాణ పనుల కారణంగా భవనం కూలిపోయి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. కొత్త దుకాణంలో నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, ఇవే భవనం కూలిపోవడానికి దారితీసి ఉండవచ్చని స్థానికులు కూడా వాపోతున్నారు. భవనం కూలిపోవడంతో పొరుగున ఉన్న ఇళ్ల వారు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈ దుర్ఘటన పట్ల ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్త తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఘటనపై విచారణకు ఆదేశించారు. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రధాని నరేంద్ర మోదీ సంతాపం ప్రకటించారు. మృతుల కుటుంబాలకు ప్రధానమంత్రి సహాయ నిధి నుంచి రూ.2 లక్షల చొప్పున, క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు.

రీఫ్రెష్‌మెంట్!

రిటైర్మెంట్ కూడా ఇప్పుడో వేడుక.. కొత్త జీవితంలోకి హుషారుగా అడుగులు

» ప్రీ వెడ్డింగ్ షూట్ మాదిరిగానే రిటైర్మెంట్ డే షూట్ ఇప్పుడు నయా ట్రెండ్



హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): 'ఉద్యోగ విరమణ' అంటే.. ఆ రోజు ఆఫీసుకెళ్లినా సహచర ఉద్యోగుల మధ్య ప్రత్యేకంగా గడపడం.. వారు శాలువా కప్పి.. పుష్పగుచ్ఛం ఇవ్వడం ద్వారా చిరు సన్మానం పొందడం మామూలే! తదనంతర రోజుల్లో ఆ తాలూకు ఫొటోలు, వీడియోలు చూసుకుంటే విశ్రాంత ఉద్యోగులకు అదో తృప్తి! ఇదంతా గతం. ఈ రోజుల్లో రిటైర్ అయ్యేవారి ధోరణి కాస్త భిన్నం! ఉద్యోగ ప్రస్థానంలో 'చివరి రోజు' పూర్తిగా ఓ మధుర జ్ఞాపకంగా ఉండిపోవాలనేది వారి ఆలోచన! ఇందుకు.. తెల్లవారుజామున పడక మీద నుంచి ఆవులిస్తూ నిద్రలేచింది మొదలు.. ఫ్రెష్ అప్ అయి.. టిఫిన్ ముగించుకొని.. లంచ్ బాక్స్ సిద్ధం చేసుకొని.. ఆఫీసుకు బయలుదేరడం.. అక్కడ రోజువారీ విధులు.. లంచ్‌లో సహచరులతో కలిసి భోజనం చేయడం.. మళ్లీ సాయంత్రం దాకా విధుల్లో బిజీ అవడం.. పూర్తిగాకానే ఇంటికి తిరిగిరావడం.. ఇల్లాలు, పిల్లలు కలిసి చప్పట్లతో ఇంట్లోకి ఆహ్వానం పలకడం ఇలా అంతా దృశ్య రూపంలో చిత్రీకరించాల్సిందే! ఇదే రిటైర్‌మెంట్ డే షూట్!! ప్రీ వెడ్డింగ్ షూట్ మాదిరిగానే ఇప్పుడిదో ట్రెండ్! ఆలుమగలు కలసి సినిమా డ్యూయెట్ స్థాయిలో ఆల్బమ్ తీయించుకుంటారు. అలా అని.. ఉద్యోగ విరమణ అంటే, పూర్తిగా విశ్రాంత సమయం అనో.. వయసైపోయిందనో.. జీవిత చరమాంకంలోకి అడుగు పెడుతున్నామనో లాంటి ముతక మాటలు, ఆ దిశగా మేసేజ్‌లు ఇవ్వడాలు ఉండవు. కొత్త జీవితాన్ని ప్రారంభించబోతున్నామన్న సంకేతాన్ని హుషారైన రీతిలో ఆ దంపతులు ఇస్తున్నారు. ఇప్పటిదాకా కుటుంబ బాధ్యతల్లో తలమునకలైన తమకు ఇకమీదట పరస్పరం మరింత సమయం గడపడానికి అవకాశం దొరికిందన్న పాయింట్‌ను సంబురంగా ప్రకటిస్తున్నారు. ఆ వీడియోలు కొన్ని సామాజిక మాధ్యమాల్లోనూ వైరల్ అవుతున్నాయి.

రిటైర్మెంట్ షూట్‌లో భాగంగా... ప్రకృతి రమణీయతకు అద్దంపట్టే ఒక డెస్టినేషన్‌ను ఎంచుకుంటున్నారు. పూల వనాలు, సెలయేటి గలగలు, పొలాల గట్ల మధ్య చేతిలో చేయివేసి నృత్యం చేస్తూ సినిమా పాట తరహాలో వీడియోను తీయించుకుంటున్నారు. ఇందుకు ఖర్చు బాగానే అవుతుందని సమాచారం. ఈ ప్రక్రియలో కేవలం వీడియో గ్రాఫర్లే కాకుండా ఈవెంట్ మేనేజర్లు సృజనాత్మకతను జోడిస్తున్నారు. ఈ రకమైన రిటైర్మెంట్ వీడియో షూట్‌లు ఎక్కువగా వారి పిల్లల చొరవతోనే జరుగుతున్నాయని సీనియర్ ఫొటోగ్రాఫర్ విల్లార్డ్ రమణ చెప్పారు. వయసు మీద పడుతోందన్న నిరాశానిస్పృహలను మనసులోకి రానివ్వకుండా విశ్రాంత జీవితాన్ని ఆస్వాదించడానికి అవసరమైన స్ఫూర్తిని ఇలాంటి వేడుకలు, వీడియో షూట్‌లు ఇస్తాయని యాత్రా రచయిత్రి నర్మదా రెడ్డి చెప్పారు..



రిటైర్మెంట్ వీడియో షూట్‌లో నర్మద, ఇంద్రారెడ్డి దంపతులు

జీవితంలో కొత్త మార్పును స్వాగతించడమే

రిటైర్మెంట్ లైఫ్ అంటే జీవితంలో వచ్చిన ఒక కొత్త మార్పును స్వాగతించడం. ఇల్లు, పిల్లలు, ఉద్యోగమంటూ అప్పటిదాకా తలమునకలైన భార్యాభర్తలు కలసి ఇదివరకటి కన్నా మరింత ఎక్కువ సమయం సంతోషంగా గడపడానికి దొరికే అరుదైన అవకాశం. నేను, నా భర్త ఇంద్రారెడ్డి ఇదే నమ్ముతాం. మా షష్టిపూర్తి వేడుకను పెళ్లి కన్నా ఘనంగా చేసుకున్నాం. మేమిద్దం కలసి పాటలు పాడుతూ, డ్యాన్స్‌చేస్తూ వీడియోలు తీయించుకున్నాం. అదొక సరదా మాత్రమే కాదు, జీవితకాల మధుర జ్ఞాపకంగా మిగిలిపోతుంది కదా.! ఇద్దరం తరచుగా విదేశాల్లో పర్యటిస్తుంటాం. ఇది మా జీవన ప్రమాణాలను పెంచడమే కాదు, మమ్మల్ని మరింత ఉత్సాహవంతులను చేస్తుంది. ఒంటరితనం, నిరాశ వంటివి దరి చేరవు. అందుకే అవకాశం ఉన్న ప్రతి ఒక్క జంట రిటైర్మెంట్ వీడియో షూట్ చేయించుకోండి. అది మిమ్మల్నిమరింత ఉత్తేజితులను చేస్తుంది.

- నర్మదా రెడ్డి, యాత్రా రచయిత్రి

పిల్లల ప్రోద్బలంతో ఇలాంటి వీడియో షూట్‌లు

రిటైర్మెంట్ వీడియో షూట్ సంస్కృతి ఇప్పుడిప్పుడే మొదలైంది. దీన్ని ఒక్కొక్కరూ ఒక్కో విధంగా వారి అభిరుచి మేరకు తీయించుకుంటున్నారు. రిటైర్మెంట్ వీడియో షూట్ కోసం ఎగువ మధ్యతరగతి కుటుంబాల్లో తక్కువ మంది ఆసక్తిచూపుతున్నారు. ఈ షూట్‌ల వెనుక పిల్లల ప్రోద్బలమే ఎక్కువగా ఉంటోంది. జీవితంలోని ప్రతి అరుదైన సందర్భాన్ని వీడియోగ్రఫీ ద్వారా ఒక తీపి గుర్తుగా పదిలం చేసుకోవడం మంచిదే.

- రమణ, విల్లార్డ్ ఫొటోగ్రఫీ డైరెక్టర్

సాయిరెడ్డి బట్టేబాజ్

ఆయన చరిత్ర త్వరలో బయట పెడతా: కసిరెడ్డి

అమరావతి, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): 'విజయసాయిరెడ్డి ఒక బట్టేబాజ్(మోసగాడు). అతని చరిత్ర త్వరలో బయట పెడతా. నేను ఇంట్లో లేనప్పుడు సిట్ నోటీసులిచ్చింది. న్యాయ పోరాటం చేస్తున్నా' అని మద్యం కుంభకోణంలో కీలక సూత్రధారిగా భావిస్తోన్న కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి(రాజ్ కసిరెడ్డి) అన్నారు. లిక్కర్ స్కామ్ దర్యాప్తు చేస్తోన్న సిట్ అధికారులు ఆయనకు ఇప్పటికే నోటీసులిచ్చారు. ఆయన నివాసాలు, కార్యాలయాలు సోదాలు చేశారు. రాజ్ కసిరెడ్డి కోసం తీవ్రంగా వెతుకుతున్నారు. ఈ తరుణంలో ఆయన తన ఉనికిని బహిర్గతం చేయకుండా మీడియాకు శనివారం ఓ ఆడియో ఫైలు విడుదల చేశారు. "మార్చి చివరి వారంలో నేను ఇంట్లో లేని సమయంలో సిట్ అధికారులు మా ఇంటికి వచ్చారు. సాక్ష్యం చెప్పేందుకు నన్ను రమ్మని మా అమ్మకు నోటీసు ఇచ్చారు. దానికి స్పందిస్తూ... 'నేను వస్తాను, దర్యాప్తునకు సహకరిస్తాను. అయితే ఎందుకు రమ్మంటున్నారో కనీస సమాచారం ఇవ్వండి' అని 24 గంటల్లోనే మెయిల్ ద్వారా అడిగా. ఒక రోజు గడువిచ్చి సాక్షిగా రమ్మంటూ మరో నోటీసు జారీ చేశారు. నేను న్యాయవాదిని కలిసి చర్చించా. సిట్ నోటీసు ఇచ్చి అరెస్టు చేయబోతోందని చెప్పడంతో హై కోర్టును ఆశ్రయించా. తగిన సమయం ఇవ్వమని కోర్టు చెప్పడంతో సిట్ నుంచి మరో నోటీసు వచ్చింది. దీంతో ముందస్తు బెయిల్ కోసం సుప్రీం కోర్టులో పిటిషన్ వేసి నిరీక్షిస్తున్నా. విజయసాయిరెడ్డి శుక్రవారం నాపై మాట్లాడిన వాటికి బదులివ్వాలని అనుకున్నా. అతనొక బట్టేబాజ్ మనిషి. నా న్యాయ పోరాటం పూర్తి అయ్యాక మీడియా ముందుకు వచ్చి ఆ బట్టేబాజ్ చరిత్ర మొత్తం వివరిస్తా. అప్పటి వరకూ ఒక వైపు వాదనలు విని వార్తలు రాయవద్దని కోరుతున్నా' అని రాజ్ కసిరెడ్డి కోరారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

పాఠశాల విద్యాశాఖ - మెగా డీఎస్సీ-2025

నోటిఫికేషన్

రాష్ట్రంలో 16,347 ఉపాధ్యాయ ఉద్యోగాలను మెగా డీఎస్సీ ద్వారా భర్తీ చేసేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం G.O.Ms.NO.15, School Education (Services-I) Dept., తేది:19.04.2025 & G.O Ms.No.16, School Education (Services-I) Dept., తేది:19.04.2025 ద్వారా అనుమతించడం జరిగింది. ఉపాధ్యాయ అభ్యర్థులు ఏప్రిల్ 20వ తేది నుండి మే 15వ తేది వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. జూన్ **6**వ తేది నుండి జులై 6వ తేదీ వరకు కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (CBT) విధానంలో పరీక్షలు నిర్వహించడం జరుగుతుంది. పరీక్షకు సంబంధించిన పూర్తి సమాచారం అనగా సంబంధిత జీవోలు, ఉపాధ్యాయ పోస్టుల పూర్తి వివరాలు, పరీక్షా షెడ్యూలు, సిలబస్, నోటిఫికేషన్, హెల్ప్ డెస్క్ మొదలైన వివరాలు 20.04.2025 ఉదయం 10 గంటల నుండి **పాఠశాల విద్యాశాఖ** వెబ్‌సైట్ **(https://cse.ap.gov.in/** https://apdsc.apcfss.in)నందు అందుబాటులో ఉంచడం జరుగుతుంది.

మెగా డీఎస్సీ - 2025 పరీక్షా షెడ్యూల్

క్ర.సం	విషయం	తేదీ
1	నోటిఫికేషన్ జారీ & సమాచార బులెటిన్ ప్రచురణ	20.04.2025
2	ఆన్‌లైన్ ద్వారా ఫీజులు చెల్లింపు & అప్లికేషన్ గడువు	20.04.2025 - 15.05.2025
3	మాక్ టెస్ట్ (నమూనా పరీక్ష)	20.05.2025 నుండి
4	హాల్ టికెట్లు డౌన్‌లోడ్	30.05.2025 నుండి
5	**పరీక్ష తేదీలు**	**06.06.2025 నుండి 06.07.2025**
6	ప్రాథమిక కీ విడుదల	అన్ని పరీక్షలు పూర్తయిన రెండో రోజున ప్రాథమిక కీ విడుదల చేస్తారు
7	అభ్యంతరాల స్వీకరణ	ప్రాథమిక కీ విడుదల తదుపరి 7 రోజులు పాటు అభ్యంతరాలు స్వీకరిస్తారు
8	తుది కీ విడుదల	అభ్యంతరాలు స్వీకరణ గడువు ముగిసిన 7 రోజుల తర్వాత తుది కీ విడుదల చేస్తారు
9	మెరిట్ జాబితా విడుదల	తుది కీ విడుదల చేసిన 7 రోజుల తర్వాత మెరిట్ జాబితా ప్రకటిస్తారు.

- సంచాలకులు, పాఠశాల విద్య
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

పిడుగులు.. వడగాల్పులు!

- నేడు ఉత్తరాంధ్రలో భిన్న వాతావరణం
- రేణిగుంటలో 42.8 ఉష్ణోగ్రత నమోదు
- కోస్తా, సీమల్లో చెదురుమదురుగా వర్షాలు

అమరావతి, విశాఖపట్నం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో శనివారం ఎండ తీవ్రంగా కాసింది. మరోవైపు ఉపరితలద్రోణి ప్రభావంతో కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడ ఈదురుగాలులతో వర్షాలు కురిశాయి. ఈ క్రమంలో ఆదివారం కోస్తా, రాయలసీమలో పిడుగులతో కూడిన తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. ఉత్తరాంధ్రలో ఓ వైపు వడగాడ్పులు, మరోవైపు పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. శనివారం తిరుపతి జిల్లా రేణిగుంటలో 42.8, ప్రకాశం జిల్లా గొల్లవిడిపిలో 42.6, కడప జిల్లా అట్లూరులో 42.3, పల్నాడు జిల్లా కాకానిలో 41.6, అన్నమయ్య జిల్లా కంభాలకుంటలో 41.5, చిత్తూరు జిల్లా నగరిలో 41.4, నెల్లూరు జిల్లా జలదంకిలో 41.3, నంద్యాల జిల్లా పాములపాడులో 41.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.


రాజమహేంద్రవరం రూరల్ మండలం కొంతమూరు గ్రామంలో పాస్టర్ ప్రవీణ్ మృతిచెందిన ప్రాంతంలో ప్రవీణ్ ఫ్లెక్సీకి కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న క్రైస్తవ సంఘాల ప్రతినిధులు

పాస్టర్ ప్రవీణ్ పగడాలది హత్యే

- ఏపీ, తెలంగాణ క్రైస్తవ సంఘాల ప్రతినిధుల ఆరోపణ
- ఆయన మృతిచెందిన ప్రదేశానికి 2 వేల మందితో ర్యాలీ
- ప్రవీణ్ ఫ్లెక్సీ వద్ద ప్రార్థనలు... కొవ్వొత్తులు వెలిగించి నివాళి
- హర్షకుమార్, మరికొందరిని స్టేషన్‌కు తరలించిన పోలీసులు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ పగడాల రోడ్డు ప్రమాదంలో మరణించలేదని, అది హత్యేనని పలువురు క్రైస్తవ సంఘాల ప్రతినిధులు ఆరోపించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ మండలం కొంతమూరు-దివాన్ చెరువు రోడ్డులో పెద్దఎత్తున కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ ఇచ్చిన పిలుపు మేరకు శనివారం సాయంత్రం వేలాది మంది క్రైస్తవులు ప్రవీణ్ మరణించిన స్థలానికి ర్యాలీగా చేరుకున్నారు. హర్షకుమార్, జీవీ శ్రీరాజ్, ఏపీ, తెలంగాణకు చెందిన పలు క్రైస్తవ సంఘాల ప్రతినిధులు కొవ్వొత్తులతో ర్యాలీ చేస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. హర్షకుమార్‌తో పాటు ఇసుకపట్ల రాంబాబు, నక్కా వెంకటరత్నం, జంగా బాబురావు, పాలకొల్లుకు చెందిన రమేష్‌ను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అయితే పెద్దఎత్తున క్రైస్తవులు అక్కడకు చేరుకోవడంతో వారిని అడ్డుకోవడం సాధ్యపడలేదు. వారంతా నేరుగా ప్రవీణ్ మరణించిన స్థలంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ వద్ద కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేసి, నివాళులర్పించారు. ప్రవీణ్‌ది హత్యేనని, రోడ్డు ప్రమాదం కాదని, క్రైస్తవులకు పాలకులు అన్యాయం చేస్తున్నారని నినదిస్తూ నిరసన తెలిపారు. ముగ్గురు డీఎస్పీలు, ముగ్గురు సీఐలు వందమందికి పైగా పోలీసు సిబ్బంది అక్కడకు చేరుకుని పరిస్థితిని పర్యవేక్షించారు. కొంతమందిని రాజానగరం పోలీస్‌స్టేషన్‌కు, హర్షకుమార్‌ను అనపర్తి స్టేషన్‌కు తరలించారు.

'అమరావతి' కోసం అధ్యయనం!

- నేడు, రేపు మంత్రి నారాయణ బృందం గుజరాత్ పర్యటన

అమరావతి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): అమరావతి నిర్మాణంలో భాగంగా గుజరాత్‌లోని పలు ప్రాంతాల్లో అధ్యయనానికి మంత్రి నారాయణ బృందం సిద్ధమైంది. సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు, ఏడీసీ ఛైర్‌పర్సన్ లక్ష్మీపార్థసారథి, గ్రీనింగ్ కార్పొరేషన్ ఎండీ శ్రీనివాసులుతో కూడిన ఈ బృందం ఆది, సోమవారాలు గుజరాత్‌లోని ఏక్తానగర్‌లో గల సర్దార్ వల్లభాయ్‌పటేల్ విగ్రహాన్ని పరిశీలించనుంది. ఆదివారం మధ్యాహ్నం అహ్మదాబాద్ శివారులోని గుజరాత్ ఇంటర్నేషనల్ ఫైనాన్స్ టెక్‌సిటీ(గిఫ్ట్‌సిటీ)ని మంత్రి పరిశీలిస్తారు. అహ్మదాబాద్‌లోని సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంటల్ ప్లానింగ్ టెక్నాలజీ యూనివర్సిటీని సందర్శిస్తారు. రాత్రికి అహ్మదాబాద్‌లోని స్పోర్ట్స్‌సిటీ పరిశీలిస్తారు. సోమవారం ఉదయం సబర్మతి రివర్‌ఫ్రంట్‌ను మంత్రి బృందం పరిశీలించనుంది.



విద్యార్థులను అభినందిస్తున్న నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్లు

నారాయణ విద్యార్థుల జయకేతనం

» జేఈఈ మెయిన్‌లో 10లోపు 2 ర్యాంకులు

హైదరాబాద్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్ ఫలితాల్లో టాప్ ర్యాంకులతో తమ విద్యార్థులు సత్తా చాటారని నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్లు డాక్టర్ పి.సింధూర నారాయణ పి.శరణి నారాయణ తెలిపారు. ఆలిండియా ఓపెన్ క్యాటగిరీలో బణిబ్రత మాజీ 1వ ర్యాంకు, టి.శివేన్ వికాస్ 9వ ర్యాంకు, సౌరవ్ 12వ ర్యాంకు, అర్పిస్మాన్ నంది 13, సన్నధ్య షరాఫ్ 19, ఆయుష్ సింఘాల్ 20వ ర్యాంకులు సాధించారని పేర్కొన్నారు. ఆలిండియా ఓపెన్ క్యాటగిరీలో తమ విద్యార్థులు 100లోపు 25 టాప్ ర్యాంకులు, వెయ్యిలోపు 165 ర్యాంకులు సాధించారని వెల్లడించారు. గత ఆరేళ్లలో ఓపెన్ క్యాటగిరిలో మూడుసార్లు ఆలిండియా ఫస్ట్ ర్యాంకులు సాధించామని వివరించారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులను వారు ప్రత్యేకంగా అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న శ్రీ చైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మశ్రీ

శ్రీచైతన్య విద్యార్థుల ప్రభంజనం

» జేఈఈ మెయిన్‌లో 10లోపు 4 ర్యాంకులు

హైదరాబాద్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్ ఫలితాల్లో ఓపెన్ క్యాటగిరీలో తమ విద్యార్థి వంగాల అజయ్ రెడ్డి ఫస్ట్ ర్యాంకు సాధించి చరిత్ర సృష్టించాడని శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మశ్రీ శనివారం తెలిపారు. ఆలిండియా ఓపెన్ క్యాటగిరిలో దేవదత్త మాజీ మొదటి ర్యాంకు, తోష్నివాల్ శివేన్ 9వ ర్యాంకు, సక్షం జిందాల్ 10వ ర్యాంకు సాధించారని పేర్కొన్నారు. ఓపెన్ క్యాటగిరీలో 10లోపు 4, వంద లోపు 27, వెయ్యి లోపు 150కి పైగా ర్యాంకులు సాధించడం ద్వారా తమ విద్యార్థులు రికార్డు బద్దలు కొట్టారని వివరించారు. తెలుగు రాష్ట్రాల నుంచి గత మూడేళ్లుగా 300కి 300 మార్కులు సాధిస్తూ తమ విద్యార్థులు హ్యాట్రిక్ సాధించారన్నారు. ఒకే సంవత్సరం మూడు జాతీయస్థాయి పరీక్షల్లోనూ తమ విద్యార్థులు టాపర్లుగా నిలిచారని డైరెక్టర్ సుష్మశ్రీ హర్షం వ్యక్తం చేశారు.

ఎస్ఆర్ విద్యార్థులకు అత్యుత్తమ ర్యాంకులు


నాగసిద్ధార్థ


పాటిల్ సాక్షి


ఎం.అరుణ్


రవి చంద్రారెడ్డి


బాదావత్ సురేష్


యాదా భరణి శంకర్

హనుమకొండ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్ ఫలితాల్లో ఎస్ఆర్ విద్యాసంస్థల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఓపెన్, ఇతర కేటగిరీలు కలిపి జాతీయ స్థాయిలో ఎస్ఆర్ విద్యా సంస్థలకు చెందిన వి.నాగ సిద్ధార్థ 5వ ర్యాంకు, పాటిల్ సాక్షి 48వ ర్యాంకు, ఎం.అరుణ్ 60వ ర్యాంకు, వై.భరణి శంకర్ 88వ ర్యాంకు, బి.సురేష్ 98వ ర్యాంకుతో సత్తా చాటారు. వీరితో పాటు దాసరి ఫణీంద్ర 116, మోదెల వెంకట కౌషిక్ 141, ఈర్ల బిందుశ్రీ 142, గుట్ట దిలీప్ రెడ్డి 190, భూక్య వినోద్ 246, సీహెచ్ శణ్ముఖ సాయి 274, బి.ధనశణ్ముఖ శ్రీ 410, కాగితపు దీపక్ 491, పుత్తూరు ఉజ్వల్ 509 ర్యాంకులు సాధించారని ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ ఎ.వరదారెడ్డి తెలిపారు. విద్యార్థుల విజయాల పట్ల ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ వరదారెడ్డి, డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

భాష్యం విద్యార్థుల సత్తా



విద్యార్థులను అభినందిస్తున్న భాష్యం రామకృష్ణ

గుంటూరు(విద్య), ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్-2025 ఫలితాలలో భాష్యం ఐఐటీ జేఈఈ అకాడమీ విద్యార్థులు జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ తెలిపారు. శనివారం గుంటూరులోని భాష్యం మెయిన్ క్యాంపస్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జి.సాయిమనోజ్ఞ ఏపీ నుంచి 100 పర్సంటైల్ సాధించిన ఏకైక విద్యార్థిగా చరిత్ర సృష్టించినట్లు, ఫిమేల్ కేటగిరీలో ఆలిండియా టాపర్‌గా నిలిచి ఓపెన్ కేటగిరీలో ఆలిండియా 18వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. అలాగే, కె.సాయి షణ్ముఖ రెడ్డి ఓపెన్ కేటగిరీలో ఆలిండియా 52వ ర్యాంకు, ఈడబ్ల్యూఎస్ విభాగంలో ఆలిండియా 2వ ర్యాంకు, 100లోపు 16 అత్యుత్తమ ర్యాంకులతోపాటు ఆల్ ఇండియా 200లోపు 28 ర్యాంకులు, 500లోపు 60 ర్యాంకులు, 1000లోపు 82 ర్యాంకులు కైవసం చేసుకొని 73.24 శాతం సక్సెస్ రేట్‌తో సత్తా చాటినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులకు అభినందనలు తెలిపారు. సంస్థ వైస్ చైర్మన్ హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్, భాష్యం ఐఐటీ జేఈఈ కోఆర్డినేటర్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వశాంతి విద్యార్థి ప్రతిభ



హారికను సత్కరిస్తున్న విశ్వశాంతి యాజమాన్యం ప్రతినిధులు

విజయవాడ, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్‌లో ఉయ్యూరు విశ్వశాంతి విద్యా సంస్థలో చదివిన తుమ్మలచర్ల హారిక 99.97 పర్సంటైల్‌తో అద్భుత విజయం సాధించినట్లు విశ్వశాంతి విద్యా సంస్థల చైర్మన్ మాదాల సుబ్రహ్మణ్యేశ్వరరావు, అకడమిక్ డైరెక్టర్ మాదాల సూర్యశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లోనూ ఎంపీసీ గ్రూప్‌లో వెయ్యికి 989 మార్కుల సాధించి రాష్ట్రస్థాయిలో ఉత్తమంగా నిలిచినట్టు పేర్కొన్నారు. హారతితోపాటు ఉత్తమంగా నిలిచిన విద్యార్థులు, పాఠాలు బోధించిన అధ్యాపకులను ఘనంగా సత్కరించారు. ఇది విశ్వశాంతి విద్యాసంస్థల విజయోత్సవమని మాదాల సుబ్రహ్మణ్యేశ్వరరావు పేర్కొన్నారు.

తెలియదు.. చెప్పలేను!

లిక్కర్ స్కాంపై 'సిట్' విచారణలో మిథున్ రెడ్డి తీరు ఇదీ

అమరావతి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): "నాకు తెలీదు.. నాకు సంబంధం లేదు.. లిక్కర్ బిజినెస్ నేను చెయ్యలేదు.." అంటూ సిట్ ఏ ప్రశ్న వేసినా వైసీపీ కీలక నేత, రాజంపేట ఎంపీ పీవీ మిథున్ రెడ్డి జవాబులో మాత్రం మార్పు లేదు. వైసీపీ ప్రభుత్వం హయాంలో జరిగిన వేల కోట్ల రూపాయల మద్యం కుంభకోణం గురించి ఏడుగంటల పాటు వంద ప్రశ్నలు వేసినా దాటవేత ధోరణిలోనే ఆయన వ్యవహరించారు. లిక్కర్ స్కామ్‌లోని పాత్రధారులు, సూత్రధారులను సిట్ అధికారులు పిలిచి విచారిస్తున్నారు. ఇప్పటికే అధికారులు, వ్యాపారులు, మధ్యవర్తులతోపాటు వైసీపీ మాజీ ఎంపీ విజయసాయి రెడ్డిని ప్రశ్నించారు. ఈ క్రమంలో మిథున్ రెడ్డిని శనివారం విజయవాడలో సుదీర్ఘంగా సిట్ ప్రశ్నించింది. ఉదయం పది గంటలకు న్యాయవాదితో కలిసి విచారణకు హాజరైన ఆయన సాయంత్రం ఆరు గంటలకు బయటికి వచ్చారు. లిక్కర్ స్కామ్‌లో పరారీలో ఉన్న రాజ్ కసిరెడ్డి గురించి అడిగినప్పుడు, ఆయనతో తనకు ఉన్నది పార్టీ సంబంధమేనని ముందు సిట్ విచారణలో మిథున్‌రెడ్డి చెప్పారు. అయితే, తన కుటుంబానికి చెందిన పీఎల్ఆర్ కంపెనీతో రాజ్ కసిరెడ్డి జరిపిన రెండు ఆర్థిక లావాదేవీల గురించి అడిగినప్పుడు ఆయన తడబడ్డారు. ఆనక.. రాజ్ తమకు ఇవ్వాల్సిన డబ్బులన్నీ ఇచ్చేశాడని సిట్ అధికారులకు తెలిపారు. మిథున్‌రెడ్డిని అప్పటి బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీ వాసుదేవరెడ్డి స్టేట్‌మెంట్ ఆధారంగా ప్రశ్నించారు. విజయసాయిరెడ్డి, సత్యప్రసాద్‌ల వాంగ్మూలాలను కూడా మధ్యమధ్య ప్రస్తావించారు. అయితే ముందుగానే సిద్ధమై వచ్చినట్టు మిథున్ రెడ్డి దాదాపు అన్నింటికీ.. ఒకే ధోరణిలో సమాధానాలు చెప్పినట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు సిట్ అధికారులు, మిథున్ రెడ్డి మధ్య జరిగిన సంభాషణ.....

సిట్: రాష్ట్రంలో 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక లిక్కర్ పాలసీపై హైదరాబాద్, తాడేపల్లిలో విజయసాయిరెడ్డి ఇంట్లో జరిగిన సమావేశంలోనే ప్రభుత్వ మద్యం షాపులు పెట్టాలనే నిర్ణయం చేశారా?

మిథున్: అది ప్రభుత్వం తీసుకునే నిర్ణయం. నేను ఏపీ ప్రభుత్వంలో లేను. వైసీపీ ఎంపీగా పార్లమెంటులో ప్రశ్నలు, నియోజవర్గంలో ప్రజా సమస్యలపైనే నేను దృష్టి పెడతా.

సిట్: మీరు మంత్రి కాదని మాకూ తెలుసు. మరి లిక్కర్ పాలసీ గురించి విజయసాయిరెడ్డి ఇంట్లో ప్రైవేటు వ్యాపారులతో కూర్చుని మీరు ఎలా చర్చించారు?

మిథున్: ఆయన, నేను ఒకే పార్టీలో ఎంపీలు. పార్టీలో క్రియాశీలకంగా పని చేస్తున్నాం. వందల సార్లు సమావేశమయ్యాం. అంత మాత్రాన అది లిక్కర్ పాలసీ అంటే ఎలా.?

సిట్: ఆదాన్ డిస్టిలరీస్ ద్వారా మీరు చేసిన వ్యాపారం ఎంత? అందులో పారదర్శకత ఉందా?

మిథున్: నాకు లిక్కర్ బిజినెస్‌తో సంబంధం లేదు. మాకున్నవి నిర్మాణ కాంట్రాక్ట్ వ్యాపారాలే.

సిట్: నంద్యాలలో ఎస్పీవై డిస్టిలరీస్‌ను మీరు స్వాధీనం చేసుకోలేదా? రాజ్ కసిరెడ్డి, సజ్జల శ్రీధర్‌రెడ్డితో కలిసి వ్యాపారం కోసం అరబిందో యాజమాన్యం నుంచి 100కోట్ల రూపాయల అప్పు ఇప్పించాలని సాయి రెడ్డిని అడగలేదా.?

మిథున్: ఎస్పీవై డిస్టిలరీస్ ఎవరి పేరుతో ఉందో, అందులో వ్యాపారాలు ఎవరు చేశారో నాకు తెలీదు. రాజ్ కసిరెడ్డి అప్పు ఇప్పించమంటే సాయి రెడ్డి ఇప్పించి ఉండొచ్చు. వందల కోట్ల రూపాయల కాంట్రాక్టులు చేసే కంపెనీ ఉన్న నాకు ప్రైవేటు వ్యక్తుల దగ్గర రూ.100కోట్లు అప్పు చేయాల్సిన అవసరం ఎందుకు ఉంటుంది.?

సిట్: లిక్కర్ పాలసీ రూపకల్పన నుంచి మద్యం తయారీ, సరఫరా, విక్రయాల వరకూ 2019-24 మధ్యలో మీ పాత్ర ఏంటి.?

మిథున్: నా పాత్ర అందులో లేదు. నాపై కుట్ర జరుగుతోంది. కూటమి ప్రభుత్వ వేధింపుల్లో భాగమే ఈ కేసులు, విచారణలు..

సిట్: మద్యం కుంభకోణంలో ఎవరి పాత్ర ఏమిటో మాకు తెలుసు. ఆధారాలతోనే ప్రశ్నిస్తున్నాం.

మిథున్: నాకు తెలిసినంతవరకూ అసలు కుంభకోణమే జరగలేదు. ప్రభుత్వమే నేరుగా విక్రయాలు చేపడితే ఇక అక్రమాలు ఎలా ఉంటాయి.?

సిట్: ప్రైవేటు మద్యం షాపుల స్థానంలో ప్రభుత్వమే లిక్కర్ విక్రయించాలన్న ఆలోచన ఎలా వచ్చింది.?

మిథున్: నా దగ్గర ఆ ప్రశ్నకు సమాధానం లేదు. దాంతో నాకెలాంటి సంబంధం లేదు.

సిట్: జనం కోరుకున్న బ్రాండ్లు కాకుండా ప్రభుత్వ మద్యం దుకాణాల్లో అమ్మే బ్రాండ్లను కొనాల్సిన పరిస్థితికి ఎవరు కారణం.?

మిథున్: నాకు సంబంధంలేని ప్రశ్నలు మీరు అడిగితే నేను సమాధానం ఎలా చెప్పగలను.?

సిట్: పొరుగు రాష్ట్రాల్లో ఎక్కడా లేని విధంగా మద్యం ధరలు ఎందుకు పెంచారు? వ్యాపారుల ఒత్తిడే కారణమా?

మిథున్: ప్రజలను మద్యం నుంచి దూరం చేసేందుకే మద్యం ధరలు పెంచినట్లు అప్పటి ప్రభుత్వం స్పష్టంగా చెప్పింది. ఆ తర్వాత పొరుగు మద్యం అక్రమ రవాణా కట్టడి చేసే క్రమంలో ధరలు తగ్గించింది. కొందరు ముడుపుల వ్యాపారుల ఒత్తిడి ఉందా లేదా అనేది నాకు తెలీదు.

సిట్: రాష్ట్రంలో 28 డిస్టిలరీలు మీ కనుసన్నల్లోనే వ్యాపారాలు చేశాయని మాకు సమాచారం ఉంది.

మిథున్: నాకు ప్రత్యక్షంగా, పరోక్షంగా లిక్కర్ వ్యాపారాలతో సంబంధం లేదని మరోసారి చెబుతున్నా..

సిట్: మద్యం కుంభకోణంలోని ముడుపుల డబ్బులు ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులకు మీ ద్వారా వెళ్లినట్లు తెలిసింది.

మిథున్: అటువంటిది లేనే లేదు.

సిట్: హవాలా ఏమైనా జరిగినట్లు మీకు తెలిసిందా.?

మిథున్: నాకు సంబంధం లేని వాటి గురించి మీరు నన్నెందుకు అడుగుతున్నారు.?

సిట్: లిక్కర్ కుంభకోణంలో కీలక వ్యక్తులు ఇచ్చిన వాంగ్మూలంలో మీ పాత్రపై స్పష్టంగా ఆధారాలు ఉన్నాయి. మద్యం కంపెనీల నుంచి ముడుపుల వసూళ్ల వ్యవహారం మీరు, రాజ్ కసిరెడ్డి కలిసి నిర్ణయించారా.?

మిథున్: ఆధారాలుంటే కోర్టులో చూపించుకోండి. నేను ఎలాంటి ముడుపులు తీసుకోలేదు. ఎవరికీ ఇవ్వలేదు. అసలు ఏమీ లేని దాంట్లో రూ.వేల కోట్ల కుంభకోణం ఉందనడమే నాకు వింతగా అనిపిస్తోంది.

సిట్: మద్యం ముడుపులన్నీ చివరికి ఎక్కడికి చేరాయో మీకు నిజంగా తెలియదా.?

మిథున్: నాకు తెలిసినంతవరకూ ముడుపులే లేవు. లేనివి ఎక్కడికి చేరాయంటే చెప్పడం ఎవరికీ సాధ్యం కాదు.

సిట్: రాజ్ కసిరెడ్డితో మీకున్న సంబంధం ఏమిటి.? అతనితో మీకు ఆర్థిక లావాదేవీలు ఉన్నాయా.?

మిథున్: ఒకే పార్టీలో ఉన్నాం. నేను ఎంపీ, రాజ్ అప్పటి ప్రభుత్వ సలహాదారు. ఆర్థికపరమైన వ్యవహారాలేమీ లేవు.

సిట్: లిక్కర్ పాలసీ ఖరారు, లిక్కర్ తయారీ డిస్టిలరీల స్వాధీనం, వ్యాపారానికి అప్పులు, కొత్త బ్రాండ్లతో మద్యం ఉత్పత్తి, సరఫరా, విక్రయాలు.. ఇలా అన్నింట్లోనూ మీ పేరు వినిపిస్తోంది. ఏమీ సంబంధం లేదని ఎలా చెబుతున్నారు.?

మిథున్: చెప్పే వాళ్లుంటే చాలా వినిపిస్తాయి. అవన్నీ నిజాలా.? ఆధారాలు ఉండాలికదా. అవి ఉంటే కోర్టులో సమర్పించుకోండి..

సిట్: సరే..మీరు వెళ్లండి. అవసరమైతే మళ్లీ పిలుస్తాం.

> **సిట్:** రోడ్డు పక్కన టీ తాగితే ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. కానీ 95 శాతానికి పైగా మద్యం వ్యాపార లావాదేవీలు నగదు రూపంలో జరగడం ఏమిటి? మద్యం స్కామ్‌లో ముట్టిన ముడుపుల గుట్టు బయటపడకూడదనే ఉద్దేశం ఏదైనా దీనివెనుక ఉందా?
>
> **మిథున్‌రెడ్డి:** కుంభకోణం, ముడుపులూ ఏమీ లేవనుకొంటున్నా.. నగదు చెల్లింపులకు కారణం ఏవిఎటో నాకు తెలియదు. మద్యం కొనుగోలు చేసే ప్రతి ఒక్కరి దగ్గరా ఫోన్ పే ఉండాలని లేదుగా.?
>
> **సిట్:** మీ కుటుంబానికి చెందిన పీఎల్ఆర్ ఇన్‌ఫ్రా నుంచి రాజ్ కసిరెడ్డితో ఎలాంటి లావాదేవీలు జరగలేదా.?
>
> **మిథున్‌రెడ్డి:** నాకు తెలిసినంతవరకూ ఏమీలేవు. చిన్నచిన్నవి ఏవైనా ఉన్నట్లయితే మా ఆడిటర్లు చెబుతారు. నాకు అన్నీ గుర్తుండవు కదా! (కానీ, మధ్యాహ్నం సెషన్‌లో) రాజ్ కసిరెడ్డి మా కంపెనీకి చెల్లించాల్సిన డబ్బులు ఇచ్చేశాడు.




ఇదొక రాజకీయ వేధింపుల కేసు: మిథున్

విజయవాడ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : మద్యం స్కామ్ అనేది జరగేలేదని, రాజకీయ వేధింపుల్లో భాగంగానే ప్రభుత్వం తప్పుడు ఆరోపణలు చేస్తోందని ఎంపీ మిథున్‌రెడ్డి ఆరోపించారు. తనపై మాదకద్రవ్యాలు, మనుషుల అక్రమ రవాణాతప్ప మిగిలిన అన్ని కేసులూ పెట్టారన్నారు.సిట్ విచారణ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మదనపల్లెలో ఏదో జరిగిపోయిందని కథ నడిపారని, ఈ ఘటనలో అనుమానితుడికి పోలీగ్రాఫ్ పరీక్షలు చేస్తే అంతా కట్టుకథని తేలిందన్నారు. "మైనింగ్, ఇసుకలో వేల కోట్ల అవినీతి జరిగిందన్నారు. చివరకి అది తప్పుడు కేసు అని తేలింది. అటవీ భూములను ఆక్రమించుకున్నామని ఆరోపణలు చేశారు. ఆ భూమి తమ సొంతమని పత్రాలు చూపించినా అటవీ భూమి అని వాదించారు. మేం కోర్టుకు వెళ్లిన తర్వాత అంతా సరిగా ఉందని తేలింది. ఈ కేసుల్లో ఏ ఒక్కదాన్నీ నిరూపించలేకపోయారు. ఎర్రచందనం స్మగ్లింగ్ జరుగుతుందని ఆరోపిస్తే, దాన్ని నిరూపించాలని బహిరంగ సవాల్ చేశాను. ఈ ఆరోపణలన్నీ అయిపోయిన తర్వాత లిక్కర్ స్కాం ఆరోపణ చేస్తున్నారు." అని విమర్శించారు. కాగా, మిథున్‌రెడ్డిని విచారిస్తున్న పోలీసు కమిషనర్ కార్యాలయానికి వైసీపీ ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, మొండితోక అరుణ్‌కుమార్, మాజీ మంత్రి పేర్ని నాని, దేవినేని అవినాశ్, అడపా శేషు తదితరులు వచ్చారు. మీడియాతో మిథున్ రెడ్డి మాట్లాడిన తర్వాత ఆయన వెంట వాహనాల్లో వెళ్లిపోయారు.

నేడు బాబు 75వ జన్మదిన వేడుకలు

ఎన్టీఆర్ భవన్‌లో ఘనంగా ఏర్పాట్లు

అమరావతి, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు 75వ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదివారం ఉదయం 8.30 గంటలకు పార్టీ నాయకులు కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ప్రారంభిస్తారు. అనంతరం చంద్రబాబుపై ఇటీవల రూపొందించిన ఓ పాటను విడుదల చేస్తారు. పలు సేవా కార్యక్రమాలను నిర్వహించనున్నారు. మరోవైపు.. అసెంబ్లీ కమిటీ హాలులో చంద్రబాబు అసెంబ్లీ ప్రసంగాలపై టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు టీడీ జనార్దన్, విక్రమ్ పూల రూపొందించిన రెండు పుస్తకాలను ఆవిష్కరించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఉప సభాపతి రఘురామకృష్ణరాజు తదితరులు హాజరుకానున్నారు.



నెలరోజులపాటు కాల్పులు విరమిద్దాం

ఆ తర్వాత శాంతి చర్చలకు సిద్ధమవుదాం

» సంప్రదింపుల నిర్వహణకు ఉమ్మడి కమిటీ

» ఆ కమిటీలో మా నాయకులు,అధికారులూ..

» మరో లేఖ విడుదలచేసిన మావోయిస్టులు

రాయ్‌పూర్, ఏప్రిల్ 19 : ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు మరోసారి చర్చల ప్రస్తావన తెచ్చారు. నెలరోజులపాటు పరస్పరం కాల్పుల విరమణ జరిపి, ఆ తర్వాత శాంతిచర్చలకు సిద్ధం అవుదామని ప్రతిపాదించారు. తిరుగుబాటుదారులతో సంప్రదింపులు మొదలుపెట్టాలంటూ ఛత్తీస్‌గఢ్ ఉప ముఖ్యమంత్రి విజయ్ శర్మ తాజాగా చేసిన ప్రతిపాదనకు స్పందిస్తూ మావోయిస్టు పార్టీ వాయవ్య సబ్ జోనల్ బ్యూరో గత గురువారం లేఖ విడుదల చేసింది. విజయ్ శర్మ ప్రతిపాదనను ఆ లేఖలో మావోయిస్టులు స్వాగతించారు. "చర్చల వాతావరణం నెలకొనాలంటే ముందుగా నెలరోజుల పాటు కాల్పుల విరమణ పాటించాలి. హింస ఏ సమస్యనూ పరిష్కరించలేదు. పరస్పర అవగాహన, చర్చల ప్రక్రియ ద్వారానే శాశ్వత శాంతి సాధ్యం. దీనికోసం ఉమ్మడి కమిటీని ఏర్పాటుచేయాలి. ఈ కమిటీలో ప్రభుత్వ అధికారులు, మా నాయకులు.. ఇద్దరూ ఉంటారు. చర్చల పరిధిలోకి వచ్చే ప్రాంతాల్లోకి భద్రతాబలగాలు రాకుండా ప్రభుత్వం కట్టడి విధించాలి. అయితే, శాంతి ప్రయత్నాల స్ఫూర్తికి విరుద్ధంగా భద్రతా బలగాలు ఇప్పటికీ కాంకేర్, బీజాపూర్, సుక్మాలో కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. చర్చల పట్ల ప్రాథమికంగా మా సమ్మతిని తెలిపిన తర్వాత కూడా ఆపరేషన్లు జరుపుతున్నాయి. ఈ నెల 12, 16 తేదీల్లో గిరిజనులను హతమార్చాయి. ఇలాంటివి పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. శాంతి పునరుద్ధరణకు మా పార్టీ ఇచ్చిన పిలుపును ముందుకువెళ్లేందుకు, అర్థవంతమైన చర్చలు జరిగేందుకు హక్కుల సంఘాలు, ప్రజాస్వామిక సంస్థల సహకారం కోరుతున్నాం" అని ఆ లేఖలో మావోయిస్టులు కోరారు. కాగా, ఇదే కమిటీ శాంతి చర్చల ప్రతిపాదన చేస్తూ ఈ నెల ఎనిమిదో తేదీన తొలి లేఖను విడుదల చేసింది. ఆ తర్వాత మూడు రోజులకు దండేవాడ వచ్చిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా.. తుపాకులు విడిచిపెట్టి జనజీవన స్రవంతిలో కలవాలని మావోయిస్టులకు విజ్ఞప్తి చేశారు. అమిత్‌షా ప్రకటనను మావోయిస్టుల లేఖ పట్ల సానుకూల స్పందనగా భావించారు. తాజాగా ఛత్తీస్‌గఢ్ డిప్యూటీ సీఎం విజయ్‌శర్మ ఆ లేఖపై నేరుగా స్పందిస్తూ.. తిరుగుబాటుదారులతో చర్చలు జరపాలని ప్రతిపాదించారు. ఈ నేపథ్యంలో ఈ కమిటీ రెండో లేఖను విడుదల చేసింది. వచ్చే ఏడాది మార్చి 31 నాటికి నక్సల్ సమస్యను పూర్తిగా తుడిచిపెట్టేస్తామని ప్రకటించిన కేంద్రం, ఏడాదిన్నర కాలంగా కూంబింగ్ దాడులను తీవ్రతరం చేసిన విషయం తెలిసిందే.

బడేసెట్టి పంచాయతీకి రూ.కోటి సాయం

ఛత్తీస్‌గఢ్‌లో నక్సల్ విముక్త తొలి పంచాయతీగా సుక్మా జిల్లాలోని బడేసెట్టి రికార్డు సృష్టించింది. ఆ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.కోటి నజరానాకు ఎంపిక అయింది. సుక్మాలో శుక్రవారం 22 మంది మావోయిస్టు సానుభూతిపరులు లొంగిపోగా, వారిలో 11మంది బడేసెట్టి నుంచే ఉన్నారు. దీంతో ఈ పంచాయతీని నక్సల్ విముక్త పంచాయతీగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. మావోయిస్టుల కారణంగా ఆగిపోయిన అభివృద్ధి పనులను తిరిగి చేపట్టేందుకు ఇలాంటి పంచాయతీలకు రూ. కోటి సాయం చేస్తామని ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. దీనికోసం ఒక పథకం కూడా తెచ్చింది. స్థానికులు ముందుకొచ్చి తమ పంచాయతీలో స్వయంగా పనులు చేసుకునేందుకుగాను ఈ సాయం అందిస్తారు. కాగా, మావోయిస్టుల కారణంగా తమ పంచాయతీ అభివృద్ధికి దూరమైందని బడేసెట్టి సర్పంచ్ కాల్మా జోగా తెలిపారు. బడేసెట్టిలో 2021లో సెక్యూరిటీ క్యాంపు ఏర్పాటు చేసినప్పటినుంచే తాము శాంతిగా జీవిస్తున్నామని జోగా చెప్పారు. "భద్రతా బలగాల వల్ల మాకు రోడ్లు వచ్చాయి. అభివృద్ధి పనులు మొదలయ్యాయి. అప్పటినుంచి మావోయిస్టులు మా దగ్గరకు రావడం తగ్గింది. మా పంచాయతీ పరిధిలోని ఎనిమిది గూడేల్లో ఇప్పుడు ఆరు చోట్ల కరెంటు వచ్చింది. మిగతా రెండు గూడేల్లో విద్యుత్ సరఫరా పనులు సాగుతున్నాయి." అని వివరించారు. ఈ పంచాయతీలో 1700 మంది జీవిస్తుండగా, వారిలో 1400 మందికి ఓటుహక్కు ఉందని కాఫ్ మొదటి బెటాలియన్ కంపెనీ కమాండర్ జమూనా కుమార్ రజాక్ తెలిపారు.

> **12 డంప్‌లు స్వాధీనం**
>
> ఛత్తీస్‌గఢ్ జిల్లా బీజాపూర్‌లో మావోయిస్టులకు చెందిన 12 డంపులను భద్రతాబలగాలు వెలికితీశాయి. బంకర్‌ని పోలిన గది ఇందులో ఒకటి. ఈ బంకర్ 160 చదరపు అడుగులు ఉంది. దాని పైభాగానికి కాంక్రీట్‌తో శ్లాబ్ వేశారు. అక్కడా, మిగతా డంపుల్లో ఆరు సోలార్ పలకలు, రెండు యూనిఫామ్‌లు, రెండు సీలింగ్ ఫ్యాన్లు, ఇతర సామగ్రిని బలగాలు గుర్తించి.. ధ్వంసం చేశాయి.

విజ్ఞాన్ విజయపరంపర



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో డాక్టర్ లావు రత్తయ్య తదితరులు

గుంటూరు(విద్య), ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ పరీక్షా ఫలితాల్లో అఖిల భారతస్థాయిలో విజ్ఞాన్ విద్యార్థులు విజయపరంపర మోగించారని విజ్ఞాన్ విద్యాసంస్థల సమన్వయకర్త గుదిమెళ్ల శ్రీకూర్మనాథ్ తెలిపారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్ జూనియర్ కళాశాల ప్రాంగణంలో విద్యార్థులకు అభినందన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జేఈఈ మెయిన్స్ కోచింగ్ తీసుకున్న విద్యార్థులలో 50 శాతం మంది విద్యార్థులు 90 శాతం పర్సంటైల్ సాధించారని తెలిపారు. వై.విష్ణుకార్తీక్(99.45), ఆర్.శ్రీకాంత్(98.38), కె.విష్ణు వర్ధన్(98.05) తదితరులు ఉత్తమ పర్సంటైల్‌తో రాణించారని వెల్లడించారు. అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను విజ్ఞాన్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లావు రత్తయ్య, వడ్లమూడి, గుంటూరు మహిళా జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్ జె.మోహన్ రావు, వై.వెంకటేశ్వరరావు, అధ్యాపకులు అభినందించారు.

'ఆదిత్య' ప్రభంజనం



ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులతో ఆదిత్య విద్యా సంస్థల కార్యదర్శి కృష్ణదీపక్‌రెడ్డి

కాకినాడ రూరల్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్-2025 ఫలితాల్లో జాతీయ స్థాయి ఉత్తమ ర్యాంకులతో తమ విద్యార్థులు ప్రభంజనం సృష్టించినట్టు ఆదిత్య విద్యా సంస్థల కార్యదర్శి ఎస్.కృష్ణదీపక్ రెడ్డి తెలిపారు. అఖిల భారత స్థాయిలో కె.రుత్విక్ 23, పి.ఆదిత్య అభిషేక్ 46, వైపీ వీరసూర్యచక్రపవన్ 109 ర్యాంకులను వివిధ కేటగిరీల్లో సాధించినట్టు పేర్కొన్నారు. అఖిల భారత స్థాయిలో అన్ని కేటగిరీల నుంచి 100లోపు ఇద్దరు, 500లోపు 17 మంది, 1000లోపు 27 మంది, 2000లోపు 44 మంది, 5000 లోపు 102 మంది ర్యాంకులు సాధించినట్టు తెలిపారు. విద్యార్థులను, అధ్యాపకులను ఆయనతోపాటు సంస్థ చైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, డైరెక్టర్లు సుగుణ, శృతి, ప్రిన్సిపాల్ మొయినా, సమన్వయకర్త లక్ష్మీకుమార్, అకడమిక్ డైరెక్టర్ రాఘవరెడ్డి, గంగిరెడ్డి, సత్యానారాయణరెడ్డి, ఐఐటీ క్యాంపస్ ప్రిన్సిపాల్ ఫణీంద్ర అభినందించారు.

డాక్టర్ కేకేఆర్ గౌతమ్ పూర్వ విద్యార్థుల విజయం

హైదరాబాద్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్ ఫలితాల్లో డాక్టర్ కేకేఆర్ గౌతమ్ హైస్కూల్ పూర్వ విద్యార్థులు సత్తా చాటారని స్కూల్ ప్రిన్సిపాల్ తెలిపారు. గతంలో తమ పాఠశాలలో చదివిన ఎన్.హేమంత్ అభిరామ్ ఆలిండియా 18వ ర్యాంకు, వై.జశ్వంత్ చౌదరి 22, ఎల్.చెర్విత 22వ ర్యాంకు సాధించారని పేర్కొన్నారు. వివిధ కేటగిరీల్లో 100లోపు 9 మంది ర్యాంకులు సాధించారని వివరించారు. ఘన విజయం సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు హైస్కూల్ తరఫున అభినందనలు తెలిపారు.



తిరుమల కిటకిట

వారాంతం, పరీక్ష ఫలితాల నేపథ్యంలో పెరిగిన రద్దీ

తిరుమల, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): తిరుమలలో శనివారం భక్తుల రద్దీ పెరిగింది. వేసవి సెలవులు, వివిధ పరీక్షల ఫలితాల వెల్లడితో పాటు వారాంతం కావడంతో ఉదయం నుంచి భక్తుల రాక పెరిగింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని 31 కంపార్టుమెంట్లతో పాటు నారాయణగిరిలోని నాలుగు షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయారు. వీరికి దాదాపు 18 గంటల దర్శన సమయం పడుతోంది. ఇక స్లాటెడ్ టోకెన్లు, టికెట్లు కలిగిన భక్తులకు కూడా మూడు నుంచి నాలుగు గంటల దర్శన సమయం పడుతోంది. రద్దీ పెరిగిన క్రమంలో గదులకు డిమాండ్ పెరిగింది. గదుల కోసం భక్తులు రెండుమూడు గంటల క్యూలైన్లలో నిరీక్షించాల్సి వస్తోంది. తలనీలాలు సమర్పించే కల్యాణకట్టలు కూడా రద్దీగా మారాయి. భక్తుల రాక పెరిగిన క్రమంలో శ్రీవారి ఆలయ ప్రాంతంతో పాటు మాడవీధులు, అఖిలాండం, లడ్డూ కేంద్రం, అన్నప్రసాద భవనం కిటకిటలాడుతున్నాయి. ఆదివారం కూడా రద్దీ కొనసాగే అవకాశముంది.

హజ్ యాత్రకు పకడ్బందీగా ఏర్పాట్లు

- తెలుగు రాష్ట్రాల సమన్వయ సమావేశంలో పలు నిర్ణయాలు
- ఏపీ నుంచి మంత్రి ఫరూక్, తెలంగాణ నుంచి షబ్బీర్ అలీ హాజరు
- ప్రభుత్వ ఏర్పాట్లను సద్వినియోగం చేసుకోవాలి: ఫరూక్

అమరావతి, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): హజ్ యాత్ర-2025 ఏర్పాట్లపై ఏపీ, తెలంగాణ ప్రభుత్వాల సమన్వయ కమిటీ సమావేశాన్ని శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ సచివాలయంలో నిర్వహించారు. ఏపీ మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, తెలంగాణ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. హజ్ యాత్రను విజయవంతంగా నిర్వహించేందుకు ఈ సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. హైదరాబాద్ ఎంబార్కేషన్ కేంద్రాన్ని ఉపయోగించుకునే ఏపీ యాత్రికుల కోసం అవసరమైన ఏర్పాట్లపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. నోడల్ అధికారులను నియమించడం, స్పష్టమైన పికప్, డ్రాప్-ఆఫ్ పాయింట్లను ఏర్పాటు చేయడం, వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులైన యాత్రికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక సహాయ సేవలు ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఎంబార్కేషన్ కేంద్రం సమీపంలో ఏపీ యాత్రికులకు భద్రమైన, పరిశుభ్రమైన వసతి ఏర్పాట్లను తెలంగాణ హజ్ కమిటీతో సమన్వయం ద్వారా చేయాలని, తగిన ప్రాంగణాలను కేటాయించేందుకు నిర్ణయం తీసుకున్నారు. పురుషులు, మహిళల కోసం వేర్వేరు వసతి కేంద్రాలు, నాణ్యమైన-ఆరోగ్యకరమైన భోజన వసతి, శుద్ధ తాగునీటి సదుపాయాలు, సేవలందించే సంస్థలను ఎంపిక చేయడం, వాటిపై పర్యవేక్షణ విధానం అమలు చేయడం, విమానాశ్రయ ప్రాంతాల్లో ప్రథమ చికిత్స, అత్యవసర వైద్య సదుపాయాలు కల్పించడానికి తెలుగు రాష్ట్రాల పర్యవేక్షణ బృందాలు సమన్వయంతో పని చేయాలని నిర్ణయించారు. ఏపీ నుంచి 1630 మంది హజ్ యాత్రకు ఈ ఏడాది వివిధ దశల్లో హైదరాబాద్, బెంగళూరు ఎంబార్కేషన్ కేంద్రాల నుంచి బయలుదేరుతున్నారని, వారందరికీ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా చర్యలు చేపట్టి వసతులు ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు.

ఎన్ఆర్ఐ వైద్య కళాశాలలో విద్యార్థి ఆత్మహత్య

- డీన్ వేధింపులే కారణమని కుటుంబ సభ్యులు, విద్యార్థుల ఆరోపణ


రామదత్త ప్రవీణ్

తగరపువలస/భీమునిపట్నం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం జిల్లా సంగివలస ఎన్ఆర్ఐ వైద్య కళాశాలలో శనివారం ఒక విద్యార్థి భవనం పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. అతని మృతికి కళాశాల వైస్ ప్రిన్సిపాల్, డీన్ వేధింపులే కారణమని కుటుంబ సభ్యులు, విద్యార్థులు ఆరోపిస్తున్నారు. భీమిలి ఇన్‌చార్జి సీఐ శ్రీధర్ కథనం మేరకు.. విజయవాడ వన్‌టౌన్ ప్రాంతానికి చెందిన పుస్తకాల వ్యాపారి రామదత్త రాజేశ్వరరావు, ఉమాదేవి దంపతుల కుమారుడు ప్రవీణ్ (24) ఎన్ఆర్ఐ కళాశాలలో ఎంబీబీఎస్ నాలుగో సంవత్సరం చదువుతున్నాడు. ప్రస్తుతం అతను సప్లిమెంటరీ పరీక్షలు రాస్తున్నాడు. శనివారం పరీక్ష ప్రారంభమైన కొద్ది నిమిషాలకు మాల్ ప్రాక్టీస్ చేస్తుండగా వైస్ ప్రిన్సిపాల్ శ్రీధర్‌రెడ్డి ప్రవీణ్‌ను పట్టుకున్నారు. ఆన్సర్ షీటు తీసుకుని, కళాశాల డీన్ సుధాకర్ వద్దకు తీసుకువెళ్లారు. ఆన్సర్ షీటు ఇవ్వాల్సిందిగా ప్రవీణ్ కోరినా, వారు అంగీకరించపోవడంతో అందరూ చూస్తుండగానే భవనం పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయం తెలిసిన వెంటనే స్థానిక శాసనసభ్యుడు గంటా శ్రీనివాసరావు కళాశాలను సందర్శించి విద్యార్థి మృతిపై ఆరా తీశారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. కాగా.. ప్రవీణ్ ఆత్మహత్యకు కళాశాల డీన్ సుధాకర్ వేధింపులే కారణమని అతని కుటుంబ సభ్యులు, విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ఆత్మహత్య విషయం తెలిసి ప్రవీణ్ తల్లిదండ్రులు శనివారం రాత్రి ఇక్కడకు చేరుకున్నారు. విద్యార్థులతో కలిసి వారు భీమిలి ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీ వద్ద ఆందోళన చేపట్టారు.

జిల్లాకో సైబర్ పోలీస్ స్టేషన్

రాష్ట్రంలో కొత్తగా మరో 10 పీఎస్‌లు.., మహిళలు, చిన్నారుల భద్రతే ప్రభుత్వ ధ్యేయం

- గోరంట్ల మాధవ్ విషయంలో పొరపాటు వల్లే 11 మంది సస్పెన్షన్
- పల్నాడులోని 40 గ్రామాల్లో ఇంకా ఫ్యాక్షన్ మూలాలు: హోం మంత్రి అనిత


గుంటూరులోని పోలీస్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న హోం మంత్రి అనిత, పక్కన ఐజీ త్రిపాఠి, ఎస్పీలు

గుంటూరు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జనాభా ప్రాతిపదికన అదనంగా మరో 10 పోలీస్ స్టేషన్‌లు ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. ఇటీవల గుంటూరులో జరిగిన గోరంట్ల మాధవ్ ఘటన నేపథ్యంలో శనివారం ఆమె గుంటూరు రేంజ్ పరిధిలోని ఆయా జిల్లాల ఎస్పీలు ఏఆర్ దామోదర్(ప్రకాశం), తుషార్ డూడీ(బాపట్ల), సతీశ్ కుమార్ (గుంటూరు), కె శ్రీనివాసరావు (పల్నాడు), డీఎస్పీలతో గుంటూరు ఐజీ సర్వ శ్రేష్ఠ త్రిపాఠి ఆధ్వర్యంలో ఆమె నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. అనారోగ్య కారణాలతో నెల్లూరు ఎస్పీ కృష్ణకాంత్ సమావేశానికి రాలేదు. సమీక్ష అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. 'పెరుగుతున్న జనాభా ఆధారంగా సిబ్బంది సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉంది. పోలీస్ స్టేషన్ల ఆధునికీకరణపై ప్రత్యేకంగా దృష్టి పెడతాం. డ్యూటీ చేసే పోలీసులకు వసతులు కల్పిస్తాం. దీనిలో భాగంగా సిబ్బంది నివాసాలను దృష్టిలో పెంచుకుని ఇప్పటికే 8 ఎకరాలు కావాలని సీఆర్‌డీఏ అధికారులను కోరాం. మహిళలు, చిన్నారులు, ప్రజల భద్రతే కూటమి ప్రభుత్వ ధ్యేయం. ప్రకాశంలో సైబర్ క్రైం జీరో. సైబర్ క్రైంపై ఎస్పీ దామోదర్ ఆధ్వర్యంలో పోలీస్ అధికారులు ప్రజల్లో విస్తృతంగా ప్రచారం కల్పించడం వల్లే ఇది సాధ్యమైంది. అదేవిధంగా బాపట్ల ఎస్పీ తుషార్ డూడీ సైబర్ క్రైంపై ప్రత్యేక దృష్టి సారించి ఆయా కేసుల్లో పెద్ద మొత్తంలో సొత్తు రికవరీ చేసి బాధితులకు అందించారు. పోక్సో కేసులను వేగంగా దర్యాప్తు చేసి శిక్షపడేలా చేస్తున్నామన్నారు. పోలీసులు, ప్రాసిక్యూషన్ అధికారులు సమ న్వయంతో పని చేయడం వల్లే ఇది సాధ్యమైంది. పోలీసులు ఛేదిస్తున్న కేసుల్లో 70 శాతం సీసీ కెమెరాల ద్వారానే సాధ్యమవుతున్నట్లు పోలీస్ అధికారులు చెప్పారు. ప్రతి జిల్లా ఎస్పీ పరిధిలో 5-10 వేల సీసీ కెమెరాలను ఏర్పాటు చేయవలసిందిగా లక్ష్యం నిర్దేశించాం. ఇళ్లు, దుకాణాలు, ప్రైవేట్ పాఠశాలల వద్ద కూడా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ప్రజలను కోరుతున్నాం. కోటప్పకొండలో డ్రోన్ వల్లే ఎక్కడా చిన్న ఇబ్బంది రాకుండా నిఘా సాధ్యమైంది. బాపట్ల సూర్యలంకకు ప్రతి శని, ఆదివారాల్లో పర్యాటకుల తాకిడి ఎక్కువైయింది. వారికి ఇబ్బంది కలగకుండా వీకెండ్‌లో పటిష్ఠ నిఘా ఏర్పాటు చేస్తున్నాం. అక్కడ కూడా డ్రోన్‌లతో నిఘా పెంచాం. అంతేగాక ఐజీ, ఎస్పీ సూచనల మేరకు గజ ఈతగాళ్లను గుర్తించి ఎన్డీఆర్ఎఫ్ ద్వారా ప్రత్యేక శిక్షణ ఇప్పించి రెస్క్యూలో మరిన్ని మెళకువలు నేర్పిస్తాం. మాజీ మంత్రి రోజా వంటి వైసీపీ నాయకుల అసభ్యకర వ్యాఖ్యలు, విమర్శల తీరు వారి సంస్కారానికి నిదర్శనం. పోలీస్ విభాగంలోని సాంకేతిక బృందాలకు మరింత నైపుణ్యమందించి పటిష్ఠంగా మారుస్తాం. ప్రైవేట్ బృందాల సహకారం తీసుకుని సైబర్ నేరాలను నియంత్రిస్తాం. కానిస్టేబుల్ నుంచి అధికారుల వరకు ఎవరికీ పదోన్నతుల విషయంలో అన్యాయం జరగకుండా చర్యలు తీసుకుంటాం. కానిస్టేబుళ్ల ప్రమోషన్‌ల విషయంలో నెలకున్న సందిగ్ధతకు కూడా త్వరలోనే తెరదించుతాం. సూపర్ న్యూమరీ పోస్టులపైన కూడా దృష్టి పెడతాం. గత ఐదేళ్లలో పోలీసు రిక్రూట్‌మెంట్ జరగలేదన్నారు. కానిస్టేబుల్ పోస్టులకు సంబంధించి సమస్యలను అధిగమించి 6 వేల మంది నియామకం చేపడుతున్నామన్నారు. ఏ శాఖకు చెందిన వారో కూడా చెప్పకుండా గత ఐదేళ్ల మహిళా పోలీసుల సేవలు వినియోగించుకున్నారు. వాటిని సరిచేస్తాం. గోరంట్ల మాధవ్ విషయంలో పోలీసుల పొరపాటు ఉండటం వల్లే 11 మందిని సస్పెండ్ చేశాం. భవిష్యత్తులో అటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండటానికే సమీక్షా సమావేశం నిర్వహించాం. వైసీపీ నాయకులు పోలీసులను కూడా బెదిరించి అప్పర్ హ్యాండ్ తీసుకోవాలనుకుంటున్నారు. ఏ ఆడపిల్లను వేధించినా, దూషించినా కూటమి ప్రభుత్వం ఒకేలా స్పందిస్తుంది. పల్నాడు ప్రాంతంలో ఇంకా ఫ్యాక్షన్ మూలాలు ఉన్నాయి. మూలాలు ఉన్న 40 గ్రామాలను గుర్తించి ఆయా గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచాం' అని అనిత తెలిపారు.

దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎస్పీడీసీఎల్) సీఎండీగా కె.సంతోషరావును కొనసాగిస్తూ ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ శనివారం ఉత్తర్వు జారీ చేశారు. ఆయన పదవీ కాలం ఆదివారంతో ముగుస్తున్న నేపథ్యంలో తదుపరి ఉత్తర్వులు వచ్చేంత వరకూ సంతోషరావును కొనసాగిస్తూ ఆదేశాలు జారీ చేశారు.



'ఉపాధి' బకాయిలు 961 కోట్లు విడుదల

అమరావతి, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కూలీలకు కేంద్ర ప్రభుత్వం ఊరట కలిగించింది. కూలీలకు చెల్లించాల్సిన సుమారు రూ.961.46 కోట్ల ఉపాధి వేతన బకాయిలను విడుదల చేసింది. శనివారం కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఫిబ్రవరి నుంచి కూలీలకు రావాల్సిన బకాయిలు సోమ, మంగళవారాల్లో వారి ఖాతాల్లో జమ అవుతాయి. కూలీలకు వేతన బకాయిలు చెల్లించాలంటూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజ ఇటీవల పలుమార్లు ఢిల్లీకి వెళ్లి కేంద్ర అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలో లేబర్‌కు సంబంధించిన వేతనాలు విడుదల కావడంతో మెటీరియల్ నిధులు కూడా త్వరలో విడుదల అవుతాయని అధికారులు పేర్కొంటున్నారు. మరో వారంలో రాష్ట్రానికి రావాల్సిన మెటీరియల్ నిధులు విడుదల అవుతాయని, వెంటనే సిమెంట్ రోడ్లు, మినీ గోకులాల బిల్లులు చెల్లించనున్నట్లు గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు తెలిపారు.

104, 108 టెండర్లలో జోక్యానికి హైకోర్టు నో

- ఇందులో విద్యార్థికి సంబంధం ఏమిటని ప్రశ్న.. వ్యాజ్యం కొట్టివేత

అమరావతి, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 104, 108 వైద్యసేవల టెండర్ నిబంధనలు సవాల్ చేస్తూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని హైకోర్టు ధర్మాసనం కొట్టివేసింది. వీటిని ఓ విద్యార్థి సవాల్ చేయడం పై అనుమానం వ్యక్తం చేసింది. ఎవరో వెనుక ఉండి పిల్ దాఖలు చేయించారని అభిప్రాయపడింది. టెండర్ నిబంధనలపై అభ్యంతరం ఉంటే బిడ్‌లో పాల్గొనాలనుకునేవారు, అనర్హులైనవారు కోర్టును ఆశ్రయిస్తారని, ఇందులో విద్యార్థికి సంబంధం ఏమిటని ప్రశ్నించింది. టెండర్ నిబంధనల్లో జోక్యం చేసుకోవద్దని సుప్రీంకోర్టు స్పష్టమైన తీర్పు ఇచ్చిందని, ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోలేమని ప్రకటించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం ఇటీవల తీర్పు ఇచ్చింది. రాష్ట్రంలో 104, 108 వైద్యసేవల అప్పగింతకు జనవరి 31న జారీ చేసిన టెండర్ నిబంధనలను సవాల్ చేస్తూ విజయవాడకు చెందిన యు.రవితేజ ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది గంటా రామారావు, ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) ఎస్.ప్రణతి వాదనలు వినిపించారు.

సీనియర్ న్యాయవాదిపై దాడి ఆందోళనకరం

- బెంగళూరులో సదాశివరెడ్డిపై దాడి.. ఖండించిన ఏపీ బార్ కౌన్సిల్

బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కో చైర్మన్, కర్ణాటక బార్ కౌన్సిల్ సభ్యుడు, సీనియర్ న్యాయవాది వైఆర్ సదాశివరెడ్డిపై దాడిని ఏపీ బార్ కౌన్సిల్ తీవ్రంగా ఖండించింది. బెంగళూరులోని కార్యాలయ ఆవరణలోనే సీనియర్ న్యాయవాదిపై కక్షిదారుడు ఇనుప రాడ్డుతో దాడి చేయడం న్యాయవాద సమాజాన్ని తీవ్రంగా కలచివేసిందని పేర్కొంది. ఈ ఘటన న్యాయవాదుల భద్రతపై ప్రశ్నలు లేవనెత్తుతోందని ఆందోళన వ్యక్తం చేసింది. న్యాయవాదుల రక్షణ కోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని కోరింది. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రూపొందించిన ముసాయిదా అడ్వొకేట్ ప్రొటెక్షన్ బిల్‌ను తక్షణం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి చట్టం చేయాలని కేంద్రాన్ని కోరింది. సదాశివరెడ్డి, ఆయన కుటుంబానికి అండగా ఉంటామని ప్రకటించింది. దాడికి బాధ్యులైనవారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని బెంగళూరు పోలీసులను కోరింది.

అభ్యర్థుల వయోపరిమితి పెంచాలని ఆదేశించలేం

- అది పూర్తిగా అధికారుల పరిధిలోని వ్యవహారం: హైకోర్టు

అమరావతి, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ఉద్యోగాల భర్తీ విషయంలో అభ్యర్థుల వయోపరిమితి పెంచాలని న్యాయస్థానాలు ఆదేశించలేవని హైకోర్టు తేల్చిచెప్పింది. నిబంధనల రూపకల్పన, వయోపరిమితి పెంపు పూర్తిగా నియామక అథారిటీ పరిధిలోని వ్యవహారమని పేర్కొంది. ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఆర్ట్ ఎడ్యుకేషన్ పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్ పోస్టుల భర్తీ విషయంలో గరిష్ఠ వయోపరిమితి పెంచేలా ఆదేశాలు ఇవ్వాలంటూ దాఖలైన వ్యాజ్యాన్ని కొట్టివేసింది. ఈ మేరకు హైకోర్టు సింగిల్ జడ్జి ఇటీవల తీర్పు ఇచ్చారు. వైఎస్సార్ కడప జిల్లాలోని ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఆర్ట్ ఎడ్యుకేషన్ పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్ పోస్టుల భర్తీ విషయంలో గరిష్ఠ వయోపరిమితి పెంచేలా ఆదేశాలు ఇవ్వాలంటూ ఎంజేహెచ్ వినయ్‌బాబు, మరో ముగ్గురు 2012లో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై ఇటీవల తుదివిచారణ జరిపిన సింగిల్ జడ్జి.. పిటిషన్‌ను కొట్టివేశారు.


అనకాపల్లి స్టేషన్‌లో సంతకం చేస్తున్న శ్రీరెడ్డి

వైసీపీపై అభిమానంతోనే పోస్టులు పెట్టా

- పూసపాటిరేగ, అనకాపల్లి పోలీస్ స్టేషన్లలో హాజరైన నటి శ్రీరెడ్డి

పూసపాటిరేగ, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): అనుచిత వ్యాఖ్యల కేసులో నటి శ్రీరెడ్డి శనివారం విజయనగరం జిల్లా పూసపాటిరేగ, అనకాపల్లి పట్టణ పోలీస్ స్టేషన్లలో విచారణకు హాజరయ్యారు. పూసపాటిరేగలో సీఐ జి.రామకృష్ణ, అనకాపల్లిలో సీఐ టీవీ విజయ్ కుమార్ విచారణ అధికారులుగా వ్యవహరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై సోషల్ మీడియా వేదికగా శ్రీరెడ్డి చేసిన వాఖ్యలపై నెల్లిమర్ల నగర పంచాయతీ కౌన్సిలర్ కింతాడ కళావతి 2024, డిసెంబరు 13న నెల్లిమర్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నవంబరు 13న తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కొణతాల రత్నకుమారి అనకాపల్లి టౌన్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసులు నమోదు చేసిన పోలీసులు... ఈ ఏడాది ఫిబ్రవరి 2న చెన్నైలో ఉంటున్న శ్రీరెడ్డికి నోటీసులు అందజేశారు. దీనిపై కోర్టును ఆశ్రయించిన ఆమె... శనివారం మధ్యాహ్నం పూసపాటిరేగ, రాత్రి అనకాపల్లి పట్టణ పోలీస్ స్టేషన్లలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ల వద్ద తన న్యాయవాదులతో కలసి విచారణకు హాజరయ్యారు. విచారణకు పిలిచినప్పుడు హాజరు కావాల్సి ఉంటుందని శ్రీరెడ్డికి పోలీసులు స్పష్టం చేశారు.

వైసీపీ నేత ఫ్యాక్టరీలో భారీగా పేలుడు పదార్థాలు

- డిటోనేటర్లు, జిలెటిన్ స్టిక్స్ స్వాధీనం.. ఇద్దరిపై కేసు

మార్టూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లాకు చెందిన వైసీపీ నేత దాసం హనుమంతరావుకు చెందిన గ్రానైట్ ఫ్యాక్టరీతో పాటు అతనికి చెందిన గోడౌన్‌లో భారీగా పేలుడు పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శనివారం చేపట్టిన తనిఖీల్లో మార్టూరు మండలం నాగరాజుపల్లి పంచాయతీ పరిధిలో గోడౌన్‌లో మూడు రకాలైన జిలెటిన్ స్టిక్స్, డీఎఫ్, ఓడీలు, ఇతర మందుగుండు సామగ్రి దాదాపుగా 10 టన్నులు, బల్లికురవ మండలం కొణిదెనలోని గ్రానైట్ ఫ్యాక్టరీలో 2,300 ఎలక్ట్రానిక్ డిటోనేటర్స్ (ఈడీ)లు పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. దాసం హనుమంతరావుతో పాటు మరొకరిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆమెకు 22.. అతనికి 42!

- వధువు కన్నీరు పెట్టడంతో భక్తుల ఫిర్యాదు

అన్నవరం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): తన కంటే వయసులో 20 ఏళ్లు పెద్దవాడైన వ్యక్తిని పెళ్లి చేసుకున్న యువతి కన్నీటి పర్యంతమైంది. అన్నవరం దేవస్థానంలో జరిగిన ఈ పెళ్లిలో వధువు కన్నీటి పర్యంతమవడంతో భక్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వివరాలిలా.. ప్రకాశం జిల్లాకు చెందిన యువతి తండ్రి నిరుపేద కావడంతో కట్నకానుకలు లేకుండా, పెళ్లి ఖర్చులు మగపెళ్లి వారే భరించేలా వివాహం నిశ్చయించుకున్నారు. కాకినాడ జిల్లా అన్నవరంలోని సత్యనారాయణస్వామి దేవస్థానంలో శనివారం ఈ వివాహం జరిగింది. అయితే పెళ్లి ఇష్టంలేని అమ్మాయి తాళికట్టిన అనంతరం కన్నీరు పెట్టడం చూసిన పలువురు భక్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అన్నవరం ఎస్ఐ హరిబాబు.. ఇరు కుటుంబాలూ పెద్దల్లో పెట్టి సమస్య పరిష్కరించుకోవాలని సూచించారు.



www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHI

ఆదివారం | 20-4-2025 | పేజీలు: 16+10+28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 4 | శ్రీ విశ్వావసు నామసంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, బహుళ పక్షం తిథి: సప్తమి రా.7.01 తదుపరి అష్టమి, నక్షత్రం: పూర్వాషాఢ ఉ.11.48 తదుపరి ఉత్తరాషాఢ, వర్జ్యం: రా.8.04-9.43, దుర్ముహూర్తం: సా.4.49-5.38, అమృతఘడియలు: ఉ.6.42-8.24, రాహుకాలం: సా.4.30-6.00, సూర్యోదయం: 5.59, సూర్యాస్తమయం: 6.28 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
ఆదివారం | 20-4-2025
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | విజయవాడ సిటీ





ప్రత్యేక కథనాలు 14, 15లో

ఒక సంకల్పానికి వజ్రోత్సవం!

నేడు చంద్రబాబు 75వ పుట్టిన రోజు

నారావారిపల్లె నుంచి నాయకుడై ఎదిగి..

తండ్రి మొండితనం.. తల్లి శ్రమతత్వం..
రెండూ కలిపితే నారా చంద్రబాబు నాయుడు

విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు

పీజీలో ఉండగానే రాజకీయ అరంగేట్రం

చంద్రబాబు నాయుడు... ఆ పేరే ఒక బ్రాండ్! ఆయనది అసాధారణ ప్రస్థానం! అలుపెరుగని ప్రయాణం! నారావారిపల్లె నుంచి నాలుగుసార్లు ముఖ్యమంత్రి అయ్యేదాకా... ఆయన సాధించిన విజయాలు అనితర సాధ్యం! అభివృద్ధిపైనే ఆయన ధ్యాస... రాజకీయం ఆయన శ్వాస! చంద్రబాబు 75వ పుట్టిన రోజు సందర్భంగా ప్రత్యేక కథనాలు..

మెగా డీఎస్సీ వచ్చేసింది



16,347 పోస్టులకు షెడ్యూలు విడుదల

3 నెలల్లో ప్రక్రియ పూర్తయ్యేలా షెడ్యూల్

మెగా డీఎస్సీ ఫైలుపైనే నాడు బాబు తొలి సంతకం

టెట్, ఎస్సీ వర్గీకరణ కోసం రెండుసార్లు వాయిదా

జూన్ 6 నుంచి జూలై 6 వరకు నియామక పరీక్షలు

అమరావతి, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం వేయి కళ్లతో ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఎన్నికల హామీని నిలబెట్టుకుంటూ 16,347 పోస్టులతో మెగా డీఎస్సీకి షెడ్యూల్ విడుదల చేసింది. టీచర్ పోస్టుల భర్తీకి పాఠశాల విద్యాశాఖ ఆదివారం నోటిఫికేషన్ జారీ చేయనుంది. 3 నెలల్లో డీఎస్సీ ప్రక్రియను పూర్తిచేసేలా షెడ్యూలు రూపొందించింది. సీఎం చంద్రబాబు పుట్టినరోజు నాడే ఈ మేరకు

మిగతా 13వ పేజీలో...

నిరుద్యోగులకు శుభవార్త

ఉద్యోగాల్లో క్రీడాకారులకు 3% రిజర్వేషన్



ఏపీపీఎస్సీతో సహా ఇతర నియామకాలకు వర్తింపు.. వివిధ పరిశీలనల తర్వాతే ఎంపిక

మార్గదర్శకాలు విడుదల చేసిన ప్రభుత్వం.. స్పోర్ట్స్ పాలసీలో భాగంగా అమలు 13



బానిబ్రత | అజయ్‌రెడ్డి | హర్ష్‌గుప్తా

వంద శాతం పర్సంటైల్ సాధించి జాతీయ స్థాయి ఓపెన్ కేటగిరీలో 18వ ర్యాంకు దక్కించుకున్న గుంటూరుకు చెందిన గుత్తికొండ సాయిమనోజ్ఞ

జేఈఈ టాపర్లలో మనోళ్లు నలుగురు

ఆంధ్రప్రదేశ్ నుంచి ఒకరికి, తెలంగాణ నుంచి ముగ్గురు విద్యార్థులకు 100 పర్సంటైల్

రాజస్థాన్ టాప్.. 2వ స్థానంలో తెలంగాణ

జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు 2,50,236 మంది అర్హత

ఓపెన్ క్యాటగిరీలో 93.10 పర్సంటైల్ వరకు..

ఓబీసీ కటాఫ్ 79.43, ఎస్సీలకు 61.15 పర్సంటైల్

ఎస్టీ క్యాటగిరీలో 47.90 పర్సంటైల్ వరకు చాన్స్

హైదరాబాద్/గుంటూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మక ఐఐటీలు, ఎన్ఐటీల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) మెయిన్ సెషన్-2 ఫలితాల్లో తెలుగు రాష్ట్రాల నుంచి నలుగురు విద్యార్థులు 100 పర్సంటైల్ సాధించారు. సెషన్-1లో కేవలం ఒక్కరే ఈ ఘనత

మిగతా 13వ పేజీలో...


జన్మదిన శుభాకాంక్షలు
75th BIRTH DAY
నవ్యాంధ్ర సృష్టికర్త, అలుపెరుగని పోరాటయోధుడు, రాజకీయాల్లో విలువలు పాటిస్తూ...
సమకాలిన సమర్థుడిగా పార్టీని సిద్ధాంతాలను గౌరవించి, భవిష్యత్ తరాలకు భరోసానిచ్చే గొప్ప నాయకుడు,
తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు
శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి
మా హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ....
గొట్టిపాటి రవికుమార్ (బుజ్జి)
రాష్ట్ర విద్యుత్ శాఖామాత్యులు
అనగాని సత్యప్రసాద్
రాష్ట్ర రెవెన్యూ, స్టాంప్స్ & రిజిస్ట్రేషన్ శాఖ మంత్రివర్యులు
ఏలూరి సాంబశివరావు
పర్చూరు నియోజకవర్గ శాసనసభ్యులు
బాపట్ల జిల్లా తెలుగుదేశం పార్టీ



విశాఖ జిల్లా తర్లువాడలో
గూగుల్ కోసం గుర్తించిన భూమి

విశాఖలో గూగుల్ డేటా సెంటర్

- తర్లువాడలో 250 ఎకరాలు గుర్తింపు
- ఇక..బిగ్ డేటా సెంటర్‌గా విశాఖ : గంటా హర్షం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ప్రపంచ ఐటీ దిగ్గజం గూగుల్ సంస్థ విశాఖపట్నం రావడానికి మార్గం సుగమమైంది. దీనికి అవసరమైన భూమిని జిల్లా అధికార యంత్రాంగం సిద్ధం చేసింది. జిల్లా కేంద్రం నుంచి 26 కిలోమీటర్ల దూరంలోని ఆనందపురం మండలం తర్లువాడలో గూగుల్ డేటా సెంటర్ కోసం 250 ఎకరాలు గుర్తించారు. ఇది ఆనందపురం మండల కేంద్రానికి మూడు కిలోమీటర్లు, జాతీయ రహదారి-16కు 1.5 కిలోమీటర్ల దూరంలో ఉంది. రాష్ట్ర ప్రభుత్వ ఆహ్వానాన్ని అందిపుచ్చుకొని విశాఖలో డేటా సెంటర్ ఏర్పాటు చేస్తామని 2024 డిసెంబరులోనే గూగుల్ అవగాహన ఒప్పందం చేసుకుంది. ఆ సంస్థ గ్లోబల్ నెట్‌వర్కింగ్ వైస్ ప్రెసిడెంట్ బికాశ్ కోలే విశాఖపట్నం వచ్చి అనువైన భూముల కోసం పలు ప్రాంతాలను పరిశీలించారు. సుమారుగా 80 ఎకరాలు అవసరం అవుతుందని జిల్లా అధికారులకు తెలిపారు. విశాఖ జిల్లా మొత్తం సిటీ కావడం, ఒక్క భీమునిపట్నం నియోజకవర్గంలోనే గ్రామీణ ప్రాంతాలు, పెద్ద సంఖ్యలో భూములు ఉండడంతో అధికారులు వాటినే గూగుల్ ప్రతినిధులకు చూపించారు. అనేక చర్చల అనంతరం తర్లువాడలోని భూములను గూగుల్‌కు ఇవ్వాలని నిర్ణయించినట్టు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శనివారం 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఇప్పటికే మధురవాడలో హిల్ నంబరు 4పై అదానీ డేటా సెంటర్ పనులు జరుగుతున్నాయని తెలిపారు. తర్లువాడలో మరో డేటా సెంటర్‌ను గూగుల్ ఏర్పాటు చేస్తే... విశాఖపట్నం పెద్ద డేటా సెంటర్‌గా మారుతుందని గంటా ఆకాంక్షించారు.

విశాఖలో సబ్‌మెరైన్ కేబుల్ ల్యాండింగ్ సెంటర్



సబ్‌మెరైన్ కేబుల్ (ఫైల్)

డేటా సెంటర్ నిర్వహించాలంటే అత్యంత వేగవంతమైన 'స్పీడ్ ఇంటర్నెట్' అవసరం. దీనికి అవసరమైన కేబుల్‌ను ల్యాండ్ లైన్ ద్వారా కాకుండా సముద్ర గర్భం నుంచి తీసుకువస్తారు. దీనిని 'సబ్‌మెరైన్ కేబుల్'గా వ్యవహరిస్తారు. సింగపూర్ నుంచి తీసుకువచ్చే ఈ లైన్‌కు విశాఖపట్నంలో 'కేబుల్ ల్యాండింగ్ స్టేషన్' (సీఎల్ఎస్) ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. దేశంలో ఇలాంటి స్టేషన్లు ఇప్పటికే ముంబై, చెన్నై, కొచ్చీ, టుటికోరిన్, తిరువనంతపురంలో ఉన్నాయి. కొత్తగా విశాఖలో దీనిని ఏర్పాటుచేయాలని నిర్ణయించడం వల్ల ఇక్కడ అదానీ, గూగుల్ సంస్థలు డేటా సెంటర్ల ఏర్పాటుకు ముందుకువచ్చాయి.

దేవదాయ శాఖలో
డిప్యూటీ కమిషనర్ల భర్తీకి చెల్లు!

29 ఏళ్లుగా ఆ పోస్టుల భర్తీ ఊసే లేదు.. ఏపీపీఎస్సీ ద్వారా రిక్రూట్‌మెంట్ చేపట్టని వైనం

- త్వరలో కొంత మంది అర్జేసీల పదవీ విరమణ
- దేవుడి శాఖను వేధిస్తున్న అధికారుల కొరత
- రెవెన్యూ శాఖపై ఆధారపడాల్సిన పరిస్థితి

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రూ.కోట్ల విలువైన ఆస్తులు.. లక్షల ఎకరాల భూమి.. నిత్య కల్యాణం.. పచ్చ తోరణంగా ఉండే దేవదాయ శాఖను ఉన్నతాధికారుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఈ శాఖలో కమిషనర్‌తో పాటు అడిషనల్ కమిషనర్లు, జాయింట్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్ల పోస్టులు కీలకం. వీరి ద్వారానే పాలన నడుస్తుంది. దేవుడి ఆస్తులు, భూములకు రక్షణ కల్పించాలంటే ఈ పోస్టుల్లో రెగ్యులర్ అధికారులుండాలి. కమిషనర్ పోస్టులో ప్రభుత్వం అఖిల భారత సర్వీసు అధికారిని నియమిస్తుంది. మిగతా పోస్టులను డైరెక్ట్ నియామకం లేదా పదోన్నతుల ద్వారా భర్తీ చేస్తారు. ఉమ్మడి ఏపీలో రెగ్యులర్ ఉద్యోగులతో కళకళలాడిన దేవదాయ శాఖ.. రాష్ట్ర విభజన తర్వాత సీన్ మారిపోయింది. శాఖలో పై నుంచి కింది వరకూ ఇన్‌చార్జిలే ఉంటున్నారు. లేదంటే రెవెన్యూ అధికారులతో నింపేస్తున్నారు. రెగ్యులర్ పోస్టులున్నప్పటికీ, డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ చేయకుండా కాలయాపన చేస్తున్నారు. ముఖ్యంగా డిప్యూటీ కమిషనర్ (డీసీ) పోస్టుల నియామకాల్లో తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోంది. దేవదాయ శాఖలో 29 డిప్యూటీ కమిషనర్ పోస్టులున్నాయి. ఇందులో 23 పోస్టులను పదోన్నతులు, 6 పోస్టులను ఏపీపీఎస్సీ ద్వారా భర్తీ చేయాలి. అయితే గత ఏడాది 25 మందికి డీసీలుగా పదోన్నతి కల్పించారు. నిబంధనలకు విరుద్ధంగా ఇద్దరికి అదనంగా పదోన్నతి ఇచ్చారు. ముఖ్యంగా ఏపీపీఎస్సీ ద్వారా నియామకం చేపట్టాల్సిన డీసీల పోస్టుల విషయంలో ప్రభుత్వాలు గత 29 ఏళ్లుగా నోటిఫికేషన్ ఇవ్వలేదు. చివరగా 1996లో చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా రెండు డీసీ పోస్టులను భర్తీ చేశారు. ఆ ఇద్దరు కూడా ఇప్పుడు రిటైర్‌మెంట్ దగ్గరకు వచ్చేశారు. ప్రభుత్వం డీసీ పోస్టుల భర్తీపై దృష్టి పెట్టి, నోటిఫికేషన్ ఇవ్వాలని నిరుద్యోగులు కోరుతున్నారు.

ఆర్జేసీల కొరత..

దేవదాయ శాఖను వేధిస్తున్న ప్రధాన సమస్యల్లో రీజనల్ జాయింట్ కమిషనర్ల (ఆర్జేసీ) కొరత కూడా ఉంది. డీసీ నియామకాలు, పదోన్నతులు లేకపోవడం వల్ల ఈ సమస్య వేధిస్తోంది. శాఖలో మొత్తం 11 ఆర్జేసీ పోస్టులున్నాయి. డీసీ పోస్టులను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ చేయడం, ఏసీలకు డీసీ పదోన్నతులు కల్పిస్తే, ఆ తర్వాత రెండేళ్లకు వాళ్లు ఆర్జేసీగా పదోన్నతులు లభిస్తాయి. ప్రస్తుతం దేవదాయ శాఖలో నలుగురు మాత్రమే రెగ్యులర్ ఆర్జేసీలుగా ఉన్నారు. వీరిలో త్వరలో కొంత మంది పదవీ విరమణ పొందనున్న నేపథ్యంలో ఏపీపీఎస్సీ ద్వారా ఈ ఏడాదిలోగా నియామకాలు చేపడితే సమస్య కొంత వరకు పరిష్కారమవుతుంది. ప్రస్తుతం రాష్ట్రంలో 7 పెద్ద ఆలయాలున్నాయి. సింహచలం, అన్నవరం, శ్రీశైలం, కాణిపాకం, శ్రీకాళహస్తి ఆలయాలకు రెవెన్యూ నుంచి వచ్చిన వారిని ఈవోలుగా నియమించారు. మరికొన్ని ఆర్జేసీ పోస్టుల భర్తీకి కూడా బయట శాఖల అధికారులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. రెవెన్యూ నుంచి వచ్చిన అధికారులను ఇన్‌చార్జి ఈవోలు, ఇన్‌చార్జి ఆర్జేసీలుగా నియమిస్తున్నారు. ఇన్‌చార్జిలను వేయడం వల్ల కొంత మంది భారీ ఎత్తును జేబులు నింపుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాబట్టి ప్రభుత్వం డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌పై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందనే వాదనలు వినిపిస్తున్నాయి.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ



కొత్తపలుకు

▪ ఆర్కే RK

పొంగిపోకుండా, కుంగిపోకుండా...

పిన్న వయసులోనే ముఖ్యమంత్రి కావడంతో రాజకీయాలలో తన స్థానాన్ని పదిలపరచుకోవడం కోసం ఆయన దిగని మెట్లు, ఎక్కని మెట్లు లేవు. ఈ క్రమంలోనే ఆయన తనను తాను రోబోగా మార్చుకున్నారు. ఆయన గుండె పొరల్లో తడి లేదా ? అంటే ఉంటుంది? అయితే ఇతరుల వలే దాన్ని ఆయన ప్రదర్శించరు. ఎవరికైనా సాయం చేసినా ఆ విషయం ఇంకెవరికీ చెప్పవద్దంటారు. స్వగ్రామం నారావారిపల్లెకు చెందిన ఎంతో మందికి సాయం చేశారు. అయితే ఈ విషయం ఆయన చెప్పుకోరు. సహాయం పొందిన వాళ్లను కూడా చెప్పుకోనివ్వరు. ఈ విషయం తెలియని చాలా మంది రాజశేఖర రెడ్డి వలె చంద్రబాబు ఉదారంగా సహాయం చేయరని అంటారు. తనకు తానుగా అవతలి వారి కష్టసుఖాలు అడిగి తెలుసుకోరు గానీ, నోరు తెరిచి అడిగిన వారికి తన శక్తి మేర సహాయం చేస్తూ ఉంటారు. ఈ కోణం తెలియని చాలా మంది ఆయనను విమర్శిస్తుంటారు.

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేడు 75వ పుట్టినరోజు జరుపుకొంటున్నారు. 1978లో తొలిసారిగా ఆయన ఇందిరా కాంగ్రెస్ (ప్రస్తుత కాంగ్రెస్) తరఫున శాసనసభ్యుడిగా ఎన్నికయ్యారు. నాటి నుంచి నేటి వరకు తెలుగునాట రాజకీయాలలో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారు. తెలుగునాట ఇంత సుదీర్ఘ కాలం రాజకీయాలలో కీలక పాత్ర పోషిస్తూ వచ్చిన నాయకుడు మరొకరు లేరు అంటే అతిశయోక్తి కాదు. ఈ 47 ఏళ్లలో ఆయన ఎన్నో ఉత్థాన పతనాలు చూశారు. అపజయాలు, అవమానాలకు కుంగిపోకుండా రాజకీయాలలో ఆయన తన స్థానాన్ని పదిలం చేసుకుంటూ వస్తున్నారు. 1978లో ఎమ్మెల్యేగా తొలిసారి ఎన్నికైన ఆయన అదే టర్మ్‌లో మంత్రి కూడా అయ్యారు. మంత్రి పదవితో పాటు ఆయనను మరో అదృష్టం కూడా వరించింది. పిన్న వయసులోనే మంత్రిగా నియమితులైన చంద్రబాబును చూసి ముచ్చటపడిన ఎన్టీ రామారావు తన కుమార్తె భువనేశ్వరిని ఆయనకు ఇచ్చి పెళ్లి చేశారు. అప్పటి నుంచి ఆయన జాతకం మారింది. మంత్రిగా ఉండగానే ఆయన పార్టీ నిర్ణయాన్ని ధిక్కరించి సస్పెండ్ అవడం, సాయంత్రానికల్లా తనపై విధించిన సస్పెన్షన్‌ను తొలగింపజేసుకొని రాజకీయాల్లో సంచలనం సృష్టించారు. అప్పుడు చిత్తూరు జిల్లా జెడ్పీ ఛైర్మన్ పదవికి మరో మంత్రి నల్లారి అమర్నాథ్‌రెడ్డి ప్రతిపాదించిన అభ్యర్థిని పార్టీ ఖరారు చేయగా, అధికార అభ్యర్థిని కాదని మరో మంత్రి సి.దాస్‌తో కలసి డాక్టర్ కుతూహలమ్మను పోటీ పెట్టి గెలిపించుకున్నారు. దీంతో పార్టీ నిర్ణయాన్ని ధిక్కరించినందుకు నాటి పీసీసీ అధ్యక్షుడు కోన ప్రభాకరరావు ఆగ్రహించి మంత్రులుగా ఉన్న చంద్రబాబు నాయుడు, దాస్‌లను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. దీంతో ఢిల్లీ వెళ్లి కాంగ్రెస్ అధినాయకత్వాన్ని కలసి, వారికి వాస్తవ పరిస్థితిని వివరించి తమపై విధించిన సస్పెన్షన్‌ను చంద్రబాబు రద్దు చేయించుకున్నారు. అప్పట్లో ఇదొక సంచలనం. ఆ తర్వాత 1982లో ఎన్టీ రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించడం, 1983 ఎన్నికల్లో చంద్రగిరి నియోజకవర్గం నుంచి పోటీ చేసిన చంద్రబాబు తెలుగుదేశం అభ్యర్థి చేతిలో ఓడిపోయారు. ఆ తర్వాత తెలుగుదేశంలో చేరి, 1984 ఆగస్టు సంక్షోభంలో పదవీచ్యుతుడైన ఎన్టీరామారావుకు అండగా నిలబడి పార్టీలో తన స్థానాన్ని పదిలం చేసుకున్నారు.

సంక్షోభ సమయంలో చంద్రబాబు రాజకీయ చాతుర్యాన్ని గమనించిన ఎన్టీ రామారావు.. తెలుగుదేశం పార్టీ రాజకీయాలలో చంద్రబాబును ప్రోత్సహించారు. 1989 ఎన్నికల్లో ఎన్టీఆర్ అధికారం కోల్పోయిన తర్వాత తెలుగుదేశం పార్టీలో చంద్రబాబు పాత్ర మరింత ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. సభలో తనను అవమానించిన కారణంగా శాసనసభను ఎన్టీఆర్ బహిష్కరించగా, చంద్రబాబు అన్నీ తానై నడిపించారు. అధికారంలో ఉన్నప్పుడు ఇందిరాగాంధీకి వ్యతిరేకంగా ప్రతిపక్షాలను కూడగట్టడంలో ఎన్టీఆర్‌ది కీలక పాత్ర కాగా, ఆ అవకాశాన్ని ఉపయోగించుకున్న చంద్రబాబు జాతీయ స్థాయి నాయకులతో పరిచయాలు పెంచుకున్నారు. 1989 తర్వాత ఎన్టీఆర్ మార్గదర్శకత్వంలో తెలుగుదేశం పార్టీ కార్యకలాపాలను మొత్తం ఆయన పర్యవేక్షించినప్పటికీ ఎన్టీఆర్ జీవితంలోకి లక్ష్మీపార్వతి ప్రవేశించడంతో చంద్రబాబు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎన్టీఆర్‌పై లక్ష్మీపార్వతి ప్రభావం అధికంగా ఉండటంతో అనేక సందర్భాలలో పార్టీ వ్యవహారాల్లో చంద్రబాబు మాట చెల్లుబాటు అయ్యేది కాదు. ఈ నేపథ్యంలో 1994లో ఎన్టీఆర్ మళ్లీ అధికారంలోకి రావడం, పార్టీలోనే కాకుండా ప్రభుత్వంలోనూ లక్ష్మీపార్వతిదే పైచేయి కావడంతో చంద్రబాబు ఉక్కపోతకు గురయ్యారు. పరిస్థితి చేయి దాటి పోతోందని భావించిన చంద్రబాబు నాయుడు పార్టీలో మరో ముఖ్యుడిగా ఉన్న తోడల్లుడు దగ్గుబాటి వెంకటేశ్వరరావును కలుపుకొని ఎన్టీఆర్ కుటుంబాన్ని తనవైపు తిప్పుకొన్నారు. లక్ష్మీపార్వతికి వ్యతిరేకంగా ఎన్టీఆర్‌పై తిరుగుబాటు చేయడం, ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టడం, తెలుగుదేశం పార్టీని కూడా సొంతం చేసుకోవడం 1995లో జరిగింది. 1984లో అధికారం కోల్పోయినప్పుడు ఎన్టీఆర్‌కు అండగా నిలబడి ప్రజాస్వామ్య పునరుద్ధరణ కోసం పోరాడిన ప్రజలు.. 1995లో మాత్రం లక్ష్మీపార్వతి పాత్ర కారణంగా ఎన్టీఆర్‌ను పదవీచ్యుతుడ్ని చేసినా పట్టించుకోలేదు.

కేంద్రంలో కీలకంగా...


అధికారాన్ని కోల్పోయిన కొంత కాలానికే ఎన్టీఆర్ కన్నుమూయడం, 1996లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి గౌరవప్రదమైన సంఖ్యలో సీట్లు గెలిపించుకోగలగడంతో తెలుగు రాజకీయాల్లో చంద్రబాబు స్థానం సుస్థిరమైంది. 1978లోనే చంద్రబాబుతో పాటు ఇందిరా కాంగ్రెస్ తరఫున కాకుండా రెడ్డి కాంగ్రెస్ తరఫున తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన రాజశేఖరరెడ్డి సమ ఉజ్జీగా తెలుగునాట రాజకీయాలలో కీలక పాత్ర పోషించారు. కేంద్రంలో కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం ఏర్పాటు కావడంలో చంద్రబాబు పాత్ర కీలకం. ఆ తర్వాత వాజపేయి నేతృత్వంలో కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పాటులో కూడా చంద్రబాబు కీలక పాత్ర పోషించారు. ప్రస్తుత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అప్పుడు గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కాకుండా జాతీయ స్థాయిలో కూడా చంద్రబాబు తనదైన ముద్ర వేసుకున్నారు. జాతీయ రాజకీయాలతో పాటు రాష్ట్రంలో కూడా ఆయన కొంతకాలం కమ్యూనిస్టులతో, మరి కొంత కాలం భారతీయ జనతా పార్టీతో జట్టు కట్టారు. రాజకీయాలలో తన స్థానాన్ని సుస్థిరం చేసుకోవడానికి ఆయన తన వైఖరిని ఎప్పటికప్పుడు మార్చుకున్నారు. ఈ కారణంగానే రాజకీయ అవకాశవాది అన్న విమర్శను చంద్రబాబు ఎదుర్కోవలసి వచ్చింది. భారతీయ జనతా పార్టీకి కొంత కాలం దగ్గరగా ఉండటం, మరికొంత కాలం దూరంగా జరగడంతో జాతీయ రాజకీయాల్లో ఆయన ప్రతిష్ఠకు మచ్చ ఏర్పడింది. తన రాజకీయ పోకడలు, నిర్ణయాలపై చంద్రబాబు ఎన్నో విమర్శలు ఎదుర్కొన్నారు. సందర్భాన్ని, పరిస్థితిని బట్టి నిర్ణయాలు తీసుకొని ఉండకపోతే ఇతరుల వలె తాను కూడా రాజకీయాల నుంచి ఎప్పుడో కనుమరుగయ్యే వాడినని విమర్శకులకు సమాధానంగా ఆయన చెబుతుంటారు. ఒక దశలో ప్రధానమంత్రి పదవి చేపట్టే అవకాశం వచ్చినా చంద్రబాబు కాదనుకున్నారు. జాతీయ స్థాయిలో కూడా ఉద్ధండ రాజకీయ నాయకులతో కలిసి పని చేసిన అనుభవం ఆయన సొంతం. కమ్యూనిస్టు ఉద్ధండులు జ్యోతి బసు, హరికిషన్ సింగ్ సుర్జీత్‌లతో పాటు భారతీయ జనతా పార్టీ అగ్రనాయకులు అటల్ బిహారీ వాజపేయి, లాల్ కృష్ణ అడ్వానీ వంటి వారు చంద్రబాబు మాటకు, నిర్ణయాలకు విలువ ఇచ్చేవారు. దేవెగౌడ, ఐకే గుజ్రాల్‌లను ప్రధానమంత్రులుగా చేయడంలోనూ, డాక్టర్ అబ్దుల్ కలాంను రాష్ట్రపతిగా నియమించడంలోనూ చంద్రబాబుది కీలక పాత్ర. 2019 ఎన్నికలకు ముందు ప్రస్తుత ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో తీవ్రంగా విభేదించిన చంద్రబాబు.. 2024 ఎన్నికల్లో తిరిగి ఆయనతోనే జత కట్టారు. నిజానికి 2024కు ముందు చంద్రబాబుతో చేతులు కలపడానికి ప్రధాని మోదీ అంతగా ఇష్టపడ లేదు. అయితే ఆంధ్రప్రదేశ్ రాజకీయాల గురించి తెలంగాణకు చెందిన ఒక కీలక నాయకుడితో జరిపిన చర్చలు ప్రధాని మోదీపై ప్రభావం చూపాయి. 'ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పుడు చంద్రబాబు జీరోగా కనిపించవచ్చు. ఈ ఎన్నికల్లో ఆయనకు 20 వరకు ఎంపీ స్థానాలు వస్తాయి. చంద్రబాబును రాష్ట్రంలో 40 శాతం మంది ప్రజలు వ్యతిరేకించవచ్చు కానీ జాతీయ స్థాయిలో ఆయన ఎటు నిలబడితే అటు బలం చేకూరుతుంది. ఈ ఎన్నికల్లో బీజేపీకి మెజారిటీ లభించదు. చంద్రబాబు గణనీయమైన సంఖ్యలో సీట్లు గెలుచుకుంటారు. ఆయన ఇండియా కూటమి వైపు మళ్లితే పరిస్థితిని ఊహించుకోండి' అని సదరు కీలక నేత ప్రధాని మోదీకి వివరించారు. ఈ కారణంగానే అని చెప్పలేం గానీ చంద్రబాబుతో స్నేహం విషయంలో ప్రధాని మోదీ తన మనసు మార్చుకోవడానికి ఇది కూడా ఒక కారణమని చెప్పవచ్చు.

విజన్.. ఓర్పు.. సహనం!

చంద్రబాబు రాజకీయాలను, నిర్ణయాలను వ్యతిరేకించేవారు రాష్ట్రంలోనే కాదు.. జాతీయ స్థాయిలోనూ ఉన్నారు. అయితే ఆయన పట్టుదలను, కృషిని ప్రశంసించనివారు అరుదుగా ఉంటారు. చంద్రబాబుకు తెలుగు, ఇంగ్లీషులో వాగ్ధాటి లేదు. అయినా అంతర్జాతీయ ప్రముఖుల మన్ననలను ఆయన చూరగొనగలిగారు. అభివృద్ధి విషయంలో ఆయనకు ఉన్న అంకితభావమే ఇందుకు కారణం. విజనరీగా పేరొందిన చంద్రబాబు.. అప్పుడు ప్రజలకు అందనంత దూరంలో పరుగెట్టేవారు. ఫలితంగా ఓటమిపాలవుతూ వచ్చారు. ఆయన విజన్‌ను అందుకోలేని ప్రజలు ఆయనను ఓడించారు. చంద్రబాబు రాజకీయాలను విమర్శించేవారు కూడా రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే అది చంద్రబాబుతోనే సాధ్యం అని అంగీకరించక తప్పని పరిస్థితి. తక్షణ ప్రయోజనాలు, స్వల్పకాలిక ప్రయోజనాలు ఆశించే ప్రజలతో పాటు పార్టీ శ్రేణులు కూడా చంద్రబాబుతో మరీ అంత దూరదృష్టి ఎందుకు అని విభేదిస్తూ ఉంటారు. అయితే తెలుగుదేశం పార్టీని ఎన్టీఆర్ స్థాపించినప్పటికీ ఆ పార్టీని కాపాడి నిలబెట్టింది మాత్రం చంద్రబాబే. 1995లో పార్టీ పగ్గాలు చేపట్టిన ఆయన పదిహేనేళ్లపాటు ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికీ, ఇప్పటికీ కొనసాగుతున్నప్పటికీ మరో పదిహేనేళ్లపాటు ప్రతిపక్షంలోనూ ఉన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, జగన్మోహన్‌రెడ్డి

> **చంద్రబాబుకు ఉన్న ఒకే ఒక స్వార్థం అధికారంలో కొనసాగడం మాత్రమే. ఇందుకోసమే రాజకీయంగా పిల్లి మొగ్గలు వేస్తారు. అధికారాన్ని అభివృద్ధి కోసం ఉపయోగించి రాష్ట్ర చరిత్రలో తన పేరు చిరస్థాయిగా ఉండిపోవాలన్న కీర్తి కాంక్ష మాత్రం ఆయనకు మెండుగా ఉంది. అందుకే రాజధాని అమరావతిని అద్భుతంగా నిర్మించి ప్రజల గుండెల్లో నిలిచిపోవాలని ఆయన కలలుగంటున్నారు.**

ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు– ఉమ్మడి రాష్ట్రంలోనూ, విభజిత ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఆయన ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నారు. ఎన్నో అవమానాలూ ఎదురయ్యాయి. పార్టీని కాపాడుకొనే క్రమంలో ఆయన ఎన్నో నిద్ర లేని రాత్రులు గడిపారు. భూదేవికి ఉన్నంత సహనం, ఓర్పు ఆయన సొంతం. అవమానాలను దిగమింగుకుంటూ ఆయన పార్టీని కాపాడుకున్నారు. సంక్షోభాలను అవకాశాలుగా మలుచుకుంటూ ఆయన ఎదిగారు. జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చంద్రబాబుకు ఎదురైన అవమానాలు అన్నీ ఇన్నీ కావు. తన సతీమణిని నిండు సభలో అవమానించడంతో ఎన్నడూ లేని విధంగా వెక్కి వెక్కి ఏడ్చారు. చివరికి జైలు జీవితం కూడా గడపాల్సి వచ్చింది. రాజశేఖరరెడ్డి రాజకీయం వేరు.. జగన్‌రెడ్డి రాజకీయం వేరు అని గుర్తించి కోలుకోవడానికి ఆయనకు చాలా సమయమే పట్టింది. వాజపేయి, అడ్వానీ, జ్యోతిబసు, బిజూ పట్నాయక్, వీపీ సింగ్, దేవీలాల్ వంటి వారితో రాజకీయాలలో కలిసి నడిచిన చంద్రబాబు.. ఇప్పుడు జగన్‌రెడ్డి వంటి వ్యక్తితో రాజకీయం చేయాల్సి వస్తోంది. జగన్ వంటి సైకో మనస్తత్వం కలిగిన వ్యక్తితో రాజకీయాల్లో పోటీ పడాల్సి వచ్చినప్పుడు ఆయన సహజంగానే తొట్రుపడ్డారు. తనకు ఎదురైన చేదు అనుభవాలను దిగమింగుకొని పార్టీని కాపాడుకున్న ఆయన 2024 ఎన్నికల్లో కనీవినీ ఎరుగని మెజారిటీతో తిరిగి అధికారాన్ని చేపట్టారు.



అందుకే రోబోగా మారి...

చంద్రబాబు వ్యక్తిగత వ్యవహార శైలిని విమర్శించేవారు ఎందరో ఉంటారు. ఆయన సాటి మనుషులతో ఆత్మీయంగా మసలుకోరు, యాంత్రికంగా ఉంటారు. సన్నిహితులు అనుకున్న వారి యోగక్షేమాలు కూడా ఆరా తీయరు. అలా అని ఇబ్బందుల్లో ఉన్నవారిని పూర్తిగా పట్టించుకోకుండా ఉండరు. విద్య, వైద్యం ఖర్చుల కోసం ఆయన ఎంతో మందికి ఆర్థిక సాయం చేశారు. అయితే రాజశేఖరరెడ్డి వలే చంద్రబాబు సహచరులతో కలివిడిగా ఉండరు. ఆయన భోజనం కూడా చేతులతో కలుపుకొని తినరు. స్పూన్‌తోనే తింటారు. అది కూడా పెదవులకు అంటకుండా తింటారు. నిన్న కాక మొన్న కడప జిల్లాలోని ఒంటిమిట్ట రామాలయానికి వెళ్లినప్పుడు అక్కడ అందించిన ప్రసాదాన్ని కూడా పూర్తిగా తినలేదు. మొదటిసారి రెండు చెంచాల ప్రసాదం తీసుకొని మిగతాది తన సతీమణి భువనేశ్వరికి ఇచ్చేశారు. రెండవసారి మరో ప్రసాదం ఇవ్వగా అది కూడా ఒక స్పూన్ తీసుకొని మిగతాది భువనేశ్వరికి ఇవ్వబోగా తనకు వద్దని ఆమె వారించారు. దీంతో అటూ ఇటూ చూసి పక్కనున్న వారికి ఇచ్చేశారు. మామూలుగా అయితే మనం మొత్తం ప్రసాదం తినేస్తాం. చంద్రబాబు మాత్రం తూకం వేసుకొని తింటారు. ఇలా చేయడం చూసే వారిలో కొందరికి నచ్చకపోవచ్చు. ఒకటి మాత్రం నిజం. చంద్రబాబు అనే వ్యక్తికి వ్యక్తిగత జీవితం ఉండదు. అవసరానికి మాత్రమే ఆయన తింటారు, నిద్రపోతారు. భార్యా పిల్లలతో కలిసి సరదాగా హోటల్‌కు వెళ్లి భోజనం చేసిన సందర్భాలు ఒకటో రెండో ఉంటాయంతే. చంద్రబాబు మెకానికల్‌గా ఎలా ఉంటారు? ఎందుకుంటారు? అంటే ఆయన కూడా కారణం చెప్పలేరు. స్వతహాగా అతి జాగ్రత్తపరుడు కావడం వల్లనే ఆయన ఏ ఒక్కరినీ పూర్తిగా నమ్మరని భావించవచ్చు. ఒకప్పుడు చంద్రబాబు ఇలా ఉండేవారు కాదు. ఎన్టీఆర్ అంటే ఆయనకు భయం, గౌరవం. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అల్లుడిగా చొరవ తీసుకొని కలిసేవారు కాదు. ఎన్టీఆర్ నుంచి పిలుపు వచ్చినప్పుడే వెళ్లేవారు. ఆయన మూడ్‌ను బట్టి కలుసుకొనేవారు. 1995లో ముఖ్యమంత్రి అయిన తర్వాత చంద్రబాబులో అనేక మార్పులు వచ్చాయి. అతి జాగ్రత్త ఆయనను కమ్మేసింది. పిన్న వయసులోనే ముఖ్యమంత్రి కావడంతో రాజకీయాలలో తన స్థానాన్ని పదిలపరచుకోవడం కోసం ఆయన దిగని మెట్లు, ఎక్కని మెట్లు లేవు. ఈ క్రమంలోనే ఆయన తనను తాను రోబోగా మార్చుకున్నారు. ఆయన గుండె పొరల్లో తడి లేదా? అంటే ఉంటుంది. అయితే ఇతరుల వలే దాన్ని ఆయన ప్రదర్శించరు. ఎవరికైనా సాయం చేసినా ఆ విషయం ఇంకెవరికీ చెప్పవద్దంటారు. స్వగ్రామం నారావారిపల్లెకు చెందిన ఎంతోమందికి సాయం చేశారు. అయితే ఈ విషయం ఆయన చెప్పుకోరు. సహాయం పొందినవాళ్లను కూడా చెప్పుకోనివ్వరు. ఈ విషయం తెలియని చాలా మంది రాజశేఖరరెడ్డి వలె చంద్రబాబు ఉదారంగా సహాయం చేయరని అంటారు. తనకు తానుగా అవతలి వారి కష్టసుఖాలు అడిగి తెలుసుకోరు గానీ, నోరు తెరిచి అడిగిన వారికి తన శక్తి మేర సహాయం చేస్తూ ఉంటారు. ఈ కోణం తెలియని చాలా మంది ఆయనను విమర్శిస్తుంటారు. చంద్రబాబు వద్ద సహాయం పొందిన కొంత మంది ఆ తర్వాత ఆయనను మోసం చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. అయినా అవేమీ ఆయన పట్టించుకోరు. పార్ట్ ఆఫ్ ద గేమ్ అని అనుకుంటారు.

అభివృద్ధి కాంక్ష

చంద్రబాబువి అవకాశవాద రాజకీయాలు అయివుండవచ్చు గానీ, తెలుగునాట ఇంత సుదీర్ఘకాలం కీలక పాత్ర పోషిస్తున్నారంటే ఆయన ఎప్పటికప్పుడు వైఖరులు మార్చుకోవడం ప్రధాన కారణం. రాజకీయాల్లో కక్షలు కార్పణ్యాలను చంద్రబాబు నమ్ముకోలేదు. 1996లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కడప పార్లమెంటు స్థానానికి పోటీ చేసిన రాజశేఖరరెడ్డిని ఓడించే అవకాశం ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబుకు వచ్చింది. అయితే చివరి నిమిషంలో ఆయన మనసు మార్చుకున్నారు. దీంతో ఐదారు వేల ఓట్ల స్వల్ప మెజారిటీతో రాజశేఖరరెడ్డి గెలిచారు. అలాంటి చంద్రబాబును గత ఎన్నికల్లో ఓడించడానికి ముఖ్యమంత్రిగా ఉన్న జగన్‌రెడ్డి చేయని ప్రయత్నం లేదు. ఈ కారణంగానే రాష్ట్రమంతటా కూటమి సునామీ సృష్టించినా కుప్పంలో చంద్రబాబు మెజారిటీ 45 వేలకే పరిమితం అయింది. రాజశేఖరరెడ్డితో రాజకీయం చేయడం వేరు, ఆయన కుమారుడు జగన్‌రెడ్డితో రాజకీయం చేయడం వేరు అని చంద్రబాబు గుర్తించడానికి చాలా సమయం పట్టింది.. పడుతోంది. జగన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తన అధికారాన్ని తనపై ఉన్న కేసులలో విచారణ ముందుకు సాగకుండా ఉండటానికి ఉపయోగించుకోగా

> **చంద్రబాబు రాజకీయాలను, నిర్ణయాలను వ్యతిరేకించేవారు రాష్ట్రంలోనే కాదు.. జాతీయ స్థాయిలోనూ ఉన్నారు. అయితే ఆయన పట్టుదలను, కృషిని ప్రశంసించని వారు అరుదుగా ఉంటారు. చంద్రబాబుకు తెలుగు, ఇంగ్లీషులో వాగ్ధాటి లేదు. అయినా అంతర్జాతీయ ప్రముఖుల మన్ననలను ఆయన చూరగొనగలిగారు. అభివృద్ధి విషయంలో ఆయనకు ఉన్న అంకితభావమే ఇందుకు కారణం. విజనరీగా పేరొందిన చంద్రబాబు.. అప్పుడు ప్రజలకు అందనంత దూరంలో పరుగెట్టే వారు. ఫలితంగా ఓటమిపాలవుతూ వచ్చారు. ఆయన విజన్‌ను అందుకోలేని ప్రజలు ఆయనను ఓడించారు. చంద్రబాబు రాజకీయాలను విమర్శించేవారు కూడా రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే అది చంద్రబాబుతోనే సాధ్యం అని అంగీకరించక తప్పని పరిస్థితి.**

ఇప్పుడు చంద్రబాబు రాష్ట్రాభివృద్ధి కోసం వాడుతున్నారు. కేంద్రంలో తనకు ఉన్న పలుకుబడితో రాష్ట్రానికి నిధులు, పథకాలు తెచ్చుకోవడానికి మాత్రమే ఉపయోగిస్తున్నారు. నరేంద్ర మోదీ మూడవసారి ప్రధానమంత్రి అవడానికి చంద్రబాబు మద్దతు కీలకం అయినప్పటికీ ఆయన వ్యక్తిగత రాజకీయ ప్రయోజనాలకు తన పలుకుబడిని వాడటం లేదు. ఆయనకు ఉన్న ఒకే ఒక స్వార్థం అధికారంలో కొనసాగడం మాత్రమే. ఇందుకోసమే రాజకీయంగా పిల్లి మొగ్గలు వేస్తారు. అధికారాన్ని అభివృద్ధి కోసం ఉపయోగించి రాష్ట్ర చరిత్రలో తన పేరు చిరస్థాయిగా ఉండిపోవాలన్న కీర్తి కాంక్ష మాత్రం ఆయనకు మెండుగా ఉంది. అందుకే రాజధాని అమరావతిని అద్భుతంగా నిర్మించి ప్రజల గుండెల్లో నిలిచిపోవాలని ఆయన కలలుగంటున్నారు. హైదరాబాద్ హైటెక్ సిటీ భవనాన్ని కొండ ప్రాంతమైన మాదాపూర్‌లో నిర్మించినప్పుడు కూడా ఇప్పటి లాగే విమర్శలు ఎదుర్కొన్నారు. అయితే అప్పుడు ఆయన వేసిన పునాది హైదరాబాద్ విశ్వవ్యాప్తంగా గుర్తింపు పొందడానికి కారణం అయింది. రాజధాని అమరావతికి అంత భూమి ఎందుకు? ఇంత భూమి ఎందుకు? అని విమర్శిస్తున్న వారికి చంద్రబాబు విజన్ అర్థం కాదు. అందుకే భావి తరాల గురించి ఆలోచిస్తున్న ఆయన విమర్శల పాలవుతున్నారు. అధికారం ఎందుకు? అంటే అభివృద్ధి కోసమే అని చంద్రబాబు నమ్ముతుండగా, దోచుకోవడానికి అని జగన్‌రెడ్డి నమ్ముతారు. అందుకే జగన్ పేదలకు సహాయం పేరిట తాయిలాలు ఇచ్చి తెర వెనుక దోపిడీకి తెగబడ్డారు. అలాంటి మనస్తత్వం ఉన్న వారు అందరూ జగన్ చుట్టూ చేరారు. ఇప్పుడు అధికారం కోల్పోయిన జగన్ అండ్ కోలో భయం లేదు. ఎందుకంటే చంద్రబాబు కక్షపూరితంగా వ్యవహరించరన్న ధీమానే! ఈ కారణంగానే అధికార మార్పిడి జరిగి ఏడాది కూడా పూర్తి

> **ఒక దశలో ప్రధానమంత్రి పదవి చేపట్టే అవకాశం వచ్చినా చంద్రబాబు కాదనుకున్నారు. జాతీయ స్థాయిలో ఉద్ధండ రాజకీయ నాయకులతో కలిసి పనిచేసిన అనుభవం ఆయన సొంతం. కమ్యూనిస్టు ఉద్ధండులు జ్యోతి బసు, హరికిషన్ సింగ్ సుర్జీత్‌లతో పాటు భారతీయ జనతా పార్టీ అగ్రనాయకులు వాజపేయి, అడ్వానీ వంటి వారు చంద్రబాబు మాటకు, నిర్ణయాలకు విలువ ఇచ్చేవారు. దేవెగౌడ, గుజ్రాల్‌లను ప్రధానమంత్రులుగా చేయడంలోనూ, డాక్టర్ అబ్దుల్ కలాంను రాష్ట్రపతిగా నియమించడంలోనూ చంద్రబాబుది కీలక పాత్ర.**

కాకుండానే జగన్ అండ్ కో నోటికి పని చెబుతున్నారు. నిజానికి ఇప్పుడు రాష్ట్రంలో ఎవరు అధికారంలో ఉన్నారన్న సందేహం తెలుగు తమ్ముళ్లలో ఏర్పడటానికి కారణం లేకపోలేదు. వైసీపీకి చెందినవారు రొమ్ము విరుచుకొని తిరుగుతుండగా, జగన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి వస్తే అన్న భయంతో తెలుగుదేశం వాళ్లు బిక్కుబిక్కుమంటున్నారు. ఒక విజనరీకి, ఒక పాలెగాడికి మధ్య ఉన్న తేడా వల్లనే ఈ పరిస్థితి ఏర్పడింది. జగన్‌రెడ్డి హయాంలో మద్యం కుంభకోణంలో ఏం జరిగిందో అందరికీ తెలుసు. నాసిరకం మద్యం అమ్మి ఎంతో మంది ప్రాణాలు తీశారు. వేల కోట్లు దోచుకున్నారు. మద్యం కుంభకోణం జరిగిన తీరు చూసి సిట్ అధికారులు ఆశ్చర్యపోతున్నారు. కుంభకోణానికి పాల్పడటం వేరు, ఇంత వినూత్నంగా, వ్యవస్థీకృతంగా నేరం చేయడం ఇప్పుడే చూస్తున్నామని ఒక అధికారి పేర్కొనడం పరిస్థితి తీవ్రతను చెబుతోంది. ఈ వ్యవహారం నుంచి ప్రజల దృష్టి మరల్చడానికి జగన్‌రెడ్డికి చెందిన రోత మీడియా దొంగే దొంగ అని అరుస్తున్నట్టుగా కథనాలు వండి వారుస్తోంది. 2014–2019 మధ్య కాలంలో వేల కోట్లు దోచుకున్నారని నిందలు వేస్తున్నారు. ఇంతకంటే బరితెగింపు ఉండదేమో. జగన్‌రెడ్డి హయాంలో జరిగిన మద్యం కుంభకోణానికి కర్త, కర్మ, క్రియ అంతా రాజ్ కసిరెడ్డి అని మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి చెబుతున్నారంటే అప్పుడు ఏం జరిగిందో అర్థం చేసుకోవచ్చు. రాజ్ కసిరెడ్డి ఒక ఇంటెలిజెంట్ క్రిమినల్ అని, తననే మోసం చేశాడని విజయసాయిరెడ్డి వాపోవడం చూశాం. అంటే, తానే ఒక ఇంటెలిజెంట్ క్రిమినల్‌ను అయితే రాజ్ కసిరెడ్డి తననే మోసం చేశాడన్న ఆవేదన విజయసాయిరెడ్డి మాటల్లో వ్యక్తం అవుతోంది. హేమాహేమీలతో రాజకీయం చేసి రాణించిన చంద్రబాబునాయుడు ఇప్పుడు ఇలాంటి ఇంటెలిజెంట్ క్రిమినల్స్‌తో తలపడాల్సి రావడమే ఆయన రాజకీయ జీవితంలో అత్యంత విషాదమని చెప్పవచ్చు. తనను తాను క్రిమినల్‌గా మార్చుకోలేక, మరోవైపు క్రిమినల్స్‌ను కట్టడి చేయలేక చంద్రబాబు సతమతం అవుతున్నారు. 75వ పుట్టిన రోజు జరుపుకొంటున్న ఆయనలో ఉత్సాహం, శక్తి సన్నగిల్లలేదు. పని రాక్షసుడిగా పేరొందిన ఆయనకు అలసట తెలియదు. అయితే క్రిమినాలజీలో ఆరితేరిన వారిని ఎదుర్కొనే క్రమంలో ఆయన కొన్ని సందర్భాలలో విఫలం అవుతున్నారు. క్రిమినల్స్‌ను కట్టడి చేయడం ముఖ్యమే గానీ రాష్ట్రాన్ని కక్షలు, కార్పణ్యాలకు నిలయంగా మార్చకూడదని చంద్రబాబు భావిస్తున్నారు. అందుకే ఆయన ఆచితూచి వ్యవహరిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో చంద్రబాబు అవసరం రాష్ట్రానికి ఉందా? రాష్ట్ర అవసరం చంద్రబాబుకు ఉందా? అని ప్రజలు ఆలోచించుకోవాలి. భవిష్యత్తు గురించి ఆలోచించేవారు చంద్రబాబుకు అండగా నిలబడి రాష్ట్రాభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషిస్తారని ఆశిద్దాం. చంద్రబాబుకు జన్మదిన శుభాకాంక్షలు చెబుదాం!

భారతీయతకు విశ్వగౌరవం

భారతదేశం భౌగోళికంగా ఒక దేశమే కావొచ్చు. కానీ ఇది అనేక సంస్కృతుల, భాషల, సంప్రదాయాల సమ్మేళనం. మన దేశ చరిత్ర చూసినప్పుడు, వేలాది సంవత్సరాల నాటి జ్ఞాన సంపద, తత్త్వ సారాలు కనిపిస్తాయి. మనం చెప్పుకునే రామాయణం, మహాభారతం, ఉపనిషత్తులు, నాట్యశాస్త్రం, భగవద్గీత వంటి గ్రంథాలు కేవలం మతపరమైన రచనలు కావు. అవి జీవన పాఠాలు. భారతీయత అనే భావనను నిర్వచించే మూలస్తంభాలు. ఈ సాంస్కృతిక సారస్వతానికి తాజాగా యునెస్కో ఇచ్చిన గుర్తింపు మన దేశానికి మాత్రమే కాక, ప్రపంచ మానవ సమాజానికి ఒక గొప్ప సందేశాన్ని ఇస్తోంది. భగవద్గీతను, నాట్యశాస్త్రాన్ని ప్రపంచ వారసత్వ సంపదగా యునెస్కో గుర్తించడం ద్వారా భారతీయ విలువలకు, కళలకు అంతర్జాతీయ గౌరవం దక్కింది.

భగవద్గీతను ఒక మతపుస్తకంగా చూడటం అన్యాయమే. అదొక తత్త్వశాస్త్ర గ్రంథం. జీవితంలో ఎదురయ్యే అనేక సమస్యలకు ఆత్మవిశ్వాసంతో, ధర్మబద్ధంగా ఎలా స్పందించాలో తెలిపే మార్గదర్శి. గీతలో అర్జునుడు తన కర్తవ్యం విషయంలో సందిగ్ధంలో పడినప్పుడు, శ్రీకృష్ణుడు ఇచ్చిన ఉపదేశం కేవలం ఆ యుద్ధానికి మాత్రమే సంబంధించినది కాదు. అది యుగయుగాలుగా అన్ని తరాల మానవులకు వర్తించగల సందేశం. 'కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన' అనే వాక్యం ఎప్పటికీ మారని తత్త్వాన్ని తెలియజేస్తుంది. మనం ఫలితాల కోరిక లేకుండా, నైతికతను అనుసరించి కర్మ చేయాలని చెప్పిన ఈ సిద్ధాంతం ప్రపంచవ్యాప్తంగా మనుషుల జీవితాలను మార్చగల సామర్థ్యం కలిగి ఉంది. ఇప్పుడు ప్రపంచంలోని అనేక విశ్వవిద్యాలయాల్లో గీతాపఠనం ఒక తత్త్వశాస్త్ర అధ్యయనంగా మారింది. అది మతపరంగా కాకుండా, తాత్వికంగా, జీవన విలువల పరంగా ప్రజలు అర్థం చేసుకుంటున్నారు. ఈ దృష్టితో యునెస్కో దీన్ని ప్రపంచ వారసత్వ జాబితాలో చేర్చింది. ఇది భారతీయతకు వచ్చిన గౌరవమే కాక, ప్రపంచానికి మన జ్ఞాన సంపదను అర్థం చేసుకునే అవకాశం కూడా. గీతలోని ఉపదేశాలు విశ్వ మానవ విలువలకు దగ్గరగా ఉండటం వల్ల దీన్ని ఒక మానవతా గ్రంథంగా భావిస్తున్నారు.

> **భారతీయత అనేది మాటల్లో చెప్పే భావం కాదు. అది అనుభవంలో, ప్రవర్తనలో, జీవనశైలిలో ప్రత్యక్షమవుతుంది. భగవద్గీతలోని ధర్మబద్ధతను మన వృత్తిజీవితంలో పాటించాలి. నాట్యశాస్త్రంలోని కళాసౌందర్యాన్ని మన వ్యక్తిత్వంలోనూ కలుపుకోవాలి. మన జ్ఞాన సంపదను మనం గౌరవిస్తే, ప్రపంచం కూడా గౌరవిస్తుంది.**



నాట్యశాస్త్రం విషయానికి వస్తే, ఇది కేవలం నాట్యకళకు సంబంధించిన పుస్తకం కాదు. ఇది మన కళా సంపదకు మూలమైన శాస్త్రరూపం. నాట్యం అంటే శరీరంతో చేసే విన్యాసాలు మాత్రమే కాదు. అది భావాలు, భావోద్వేగాలు, తత్త్వాలు అన్నిటినీ సమన్వయపరిచే ఒక సమగ్ర కళ. హస్త ముద్రలు, నవరసాలు, సంగీతమూ, నృత్యంతో కలసి ఒక సందేశాన్ని ఎలా తెలియజేయాలో నాట్యశాస్త్రం స్పష్టంగా వివరిస్తోంది. భారతదేశంలోని అనేక నాట్య రూపాలు– భరతనాట్యం, కూచిపూడి, కథక్, ఒడిస్సీ– అన్నింటికీ నాట్యశాస్త్రమే మూలంగా ఉంది. ఇవి ప్రాంతీయ కళలు మాత్రమే కాదు. ప్రతి నాట్య రూపకంలోనూ భావప్రకటన, శరీరచలనం, సంగీత సామరస్యం ఉన్నాయి.

ఈ రెండు గ్రంథాలకు యునెస్కో గుర్తింపు లభించడానికి వెనుక అనేక శ్రమలు ఉన్నాయి. భారత ప్రభుత్వం, ముఖ్యంగా ఇటీవల మోదీ ప్రభుత్వంలో, భారతీయ సంస్కృతి మరియు సంప్రదాయాల ప్రచారానికి పెద్దపీట వేసింది. విదేశాంగ శాఖ, యునెస్కో సంస్థలతో సమన్వయం, అంతర్జాతీయ వేదికలపై భారత ప్రతినిధుల అవగాహన, ఇతర దేశాల మద్దతు– ఇవన్నీ ఈ గుర్తింపునకు కారణమయ్యాయి. ఈ గుర్తింపు మనకెంతో గర్వాన్ని కలిగించినప్పటికీ, ఇది ఒక బాధ్యతను కూడా గుర్తుచేస్తోంది. మనం ఈ సంపదను కాపాడాలి. యువతకు ఈ జ్ఞానాన్ని చేరవేయాలి. మన విద్యా వ్యవస్థలో ఈ అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. చిన్నతనం నుంచే భగవద్గీతలోని తాత్విక భావాలను, నాట్యకళలోని సున్నితత్వాన్ని, మన సంప్రదాయాల విలువను పిల్లలకు నేర్పాలి. ఇది కేవలం పాఠ్యాంశంగా కాకుండా, ఒక జీవన విధానంగా ఉండాలి.

మనకు కూచిపూడి అనే ప్రాచీన నాట్యకళ ఉంది. ఇది నాట్య శాస్త్రానికి ప్రాణం. కానీ, మనం ఈ కళను ఎంతవరకు సంరక్షిస్తున్నాం? అనే ప్రశ్న మనల్ని కాసేపు ఆలోచనలో పడేస్తుంది. ప్రభుత్వాల ప్రోత్సాహం తక్కువగా ఉండటం, పరిశోధనలకు సరైన వనరులు లేకపోవడం వల్ల, మన కళలు కనుమరుగవుతున్నాయి. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక నాట్య పాఠశాలలు, కళా విశ్వవిద్యాలయాలు, పరిశోధనా కేంద్రాలను స్థాపించాలి. కూచిపూడి నాట్యకళను ప్రపంచానికి తెలియజేయగల ప్రణాళికలను తయారు చేయాలి.ఇప్పటి వరకు గీత, నాట్యశాస్త్రం లాంటి అంశాలను పాశ్చాత్య దేశాలు చాలాసార్లు 'పౌరాణిక రచనలు', లేదా 'తక్కువ విలువ ఉన్న విషయాలు'గా చూశాయి. కానీ ఇప్పుడు అదే ప్రపంచం వాటిని శాస్త్రీయంగా అంగీకరిస్తోంది. ఇది ఒక పెద్ద సాంస్కృతిక మార్పు. ప్రస్తుత గుర్తింపు కేవలం ఒక పురస్కారం కాదు. గీతా, నాట్యశాస్త్రం లాంటి గ్రంథాల పరిరక్షణ మనకు లభించిన అవకాశంగా కాకుండా, ఒక కర్తవ్యంగా భావించాలి. భారతీయత అనేది మాటల్లో చెప్పే భావం కాదు. అది అనుభవంలో, ప్రవర్తనలో, జీవనశైలిలో ప్రత్యక్షమవుతుంది. గీతలోని ధర్మబద్ధతను మన వృత్తిజీవితంలో పాటించాలి. నాట్యశాస్త్రంలోని కళాసౌందర్యాన్ని మన వ్యక్తిత్వంలోనూ కలుపుకోవాలి. మనం మన జ్ఞాన సంపదను మనం గౌరవిస్తే, ప్రపంచం కూడా గౌరవిస్తుంది. విద్య, పరిశోధన, కళ, తత్త్వశాస్త్రం– అన్నింటిలో మన సంపదను అర్థవంతంగా వినియోగించాలి. అప్పుడు మాత్రమే ఈ యునెస్కో గుర్తింపు సార్థకం అవుతుంది.

▪ అప్పన్న గొనప



విశాఖపట్నం నగర నడిబొడ్డున ఉన్న విప్రో భవనం

ఐటీ భవనాలన్నీ ఖాళీ!

విశాఖలో భూములు తీసుకొని పట్టించుకోని కంపెనీలు.. కార్యకలాపాలు ప్రారంభించకుండా కాలక్షేపం

విశాఖలో 2లక్షల చ.అడుగులు అందుబాటులో.. నామమాత్రపు ఉద్యోగులతో నెట్టుకొస్తున్న విప్రో

హామీ నెరవేర్చలేదని రిజిస్ట్రేషన్ ఆపిన ప్రభుత్వం.. రుషికొండలో దాదాపు పదేళ్ల నుంచి ఇదే పరిస్థితి

అదానీ డేటా సెంటర్‌కు సుమారు 200 ఎకరాలు.. కొండపైకి రోడ్డు తప్ప అడుగు ముందుకు పడలేదు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నంలో ఐటీ భవనాలన్నీ ఖాళీగా దర్శనమిస్తున్నాయి. దశాబ్దాల క్రితమే ప్రభుత్వం కేటాయించిన భూములు తీసుకున్న కంపెనీలు వాటిల్లో కార్యకలాపాలు మాత్రం ప్రారంభించడం లేదు. ఈ జాబితాలో పెద్దపెద్ద సంస్థలు కూడా ఉండటం గమనార్హం. ఒక్క రుషికొండ ఐటీ పార్కులోనే సుమారు 2లక్షల చ.అ. విస్తీర్ణం ఖాళీగా ఉంది. రాష్ట్ర యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ప్రభుత్వం నుంచి భూములు తీసుకున్న పలు ఐటీ సంస్థలు దశాబ్దం దాటినా ఆ హామీని నెరవేర్చకుండా భవనాలను ఖాళీగా ఉంచేశాయి. కొన్ని సంస్థలైతే తీసుకున్న భూముల్లో భవనాలు నిర్మించి అక్కడితో పని అయిపోయినట్టు చేతులు దులుపుకొన్నాయి. 2006లోనే విశాఖ నగరం నడిబొడ్డున 7ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం విప్రో టెక్నాలజీస్‌కు కేటాయించింది. అందులో 6,200 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఆ సంస్థ హామీ ఇచ్చింది. చాలా కాలం పాటు ఆ భూమిని ఖాళీగా ఉంచిన విప్రో.. ఆ తరువాత 4ఎకరాల్లో ఆరు అంతస్తుల భవనాన్ని నిర్మించింది. దానిని కూడా ఖాళీగా ఉంచింది. విశాఖ ఎంపీగా పురందేశ్వరి ఉన్న సమయంలో నాటి ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుతో కలసి ఆ భవనాన్ని సందర్శించారు. వెంటనే ఆపరేషన్లు ప్రారంభించి, ఉద్యోగ అవకాశాలు కల్పించకపోతే భూ కేటాయింపు రద్దు చేస్తామని హెచ్చరించారు. దాంతో అప్పటికప్పుడు 300 మందితో కార్యకలాపాలు ప్రారంభించారు. పక్కనే ఉన్న 3ఎకరాల్లో ప్రత్యేక ఆర్థిక మండలి(సెజ్) ఏర్పాటుకు దరఖాస్తు చేయగా 2014లో కేంద్రం అనుమతి ఇచ్చింది. అందులో కూడా ఎటువంటి కార్యకలాపాలు చేపట్టలేదు. ఉపాధి కల్పిస్తామని ఇచ్చిన హామీని పూర్తి చేయకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం విప్రోకి భూమి రిజిస్ట్రేషన్ చేయకుండా ఆపేసింది. ఇప్పటికీ అదే పరిస్థితి కొనసాగుతోంది. అందులో కొన్ని (2, 5, 6) అంతస్థులను ఆరేళ్ల క్రితం 2019లో ఒమిక్స్ ఇంటర్నేషనల్ (పల్సస్) సంస్థకు అద్దెకు ఇవ్వగా వారు దాదాపు వెయ్యి మందికి ఉపాధి కల్పించారు. అయితే అక్కడి నుంచి ఐటీ ఉత్పత్తులను విదేశాలకు రాయితీపై ఎగుమతి చేసుకునే అవకాశం లేకపోవడంతో ఆ సంస్థ కూడా కొద్ది కాలానికే ఖాళీ చేసి వెళ్లిపోయింది. ఒమిక్స్ అద్దెకు తీసుకున్న భవనం సెజ్ పరిధిలో లేకపోవడమే దీనికి కారణం. అంతకుముందు విప్రోతో లీజు ఒప్పందానికి ఒమిక్స్ ప్రయత్నించింది. ఆ భూమి విప్రో పేరుతో లేదని రిజిస్ట్రేషన్ల శాఖ తిరస్కరించింది. దాంతో ఒమిక్స్ ఆ ప్రాంగణం ఖాళీ చేసింది. తాజాగా ఈ నెల మొదటి వారంలో తమను మోసం చేశారంటూ విప్రోపై ద్వారకానగర్ పోలీసు స్టేషన్‌లో కేసు పెట్టింది. విదేశాలకు ఐటీ ఎగుమతులు చేసుకునే అవకాశం లేకపోవడంతో దాదాపు రూ.200 కోట్ల వరకు నష్టపోయామని ఆరోపించింది. ప్రస్తుతం విప్రో చేతిలో ఏడు ఎకరాలు ఉండగా, నామమాత్రపు ఉద్యోగులతోనే నడుస్తోంది.

రుషికొండలో ఇదీ పరిస్థితి

రుషికొండ హిల్ నం.2లో కలర్ చిప్స్‌కు 2 ఎకరాలు, మిరాకిల్‌కు 2ఎకరాలు, ఆ పక్కనే మరో సంస్థకు 3 ఎకరాలు కేటాయించారు. వీరంతా భవనాలు అయితే నిర్మించారు కానీ కార్యకలాపాలు మాత్రం ప్రారంభించలేదు. సుమారు పదేళ్లుగా ఈ భవనాలన్నీ ఖాళీగానే ఉన్నాయి. కనీసం అద్దెకు కూడా ఇవ్వలేదు. అలాగే హిల్ నం.3లో ఎక్సటీ గ్లోబల్ ఐదేళ్ల క్రితం నిర్మించిన భవనం కూడా ఖాళీగానే ఉంది. ఇవికాకుండా ఇంకా పలు పెద్ద కంపెనీలు భూములు తీసుకొని ఇప్పటివరకూ ఎటువంటి కార్యకలాపాలు చేపట్టలేదు. అదానీ డేటా సెంటర్ కోసం మధురవాడ హిల్ నం.4పై సుమారు 200 ఎకరాలు కేటాయించారు. శంకుస్థాపనలు కూడా జరిగి ఏళ్లు దాటిపోయాయి. కొండ మీదకు రోడ్డు తప్ప ఇంకేమీ చేయలేదు. పనులు ఎప్పుడు ప్రారంభిస్తారని కూటమి ప్రభుత్వం అడగడంతో ప్రహరీ నిర్మాణం మాత్రం చేపడుతున్నారు. ఇప్పట్లో డేటా సెంటర్ ఏర్పాటుచేసే ఆలోచన వారికి లేదని ఐటీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. కొత్తగా ఎవరికి భూములు ఇచ్చినా ఎంత గడువులో ఆపరేషన్లు ప్రారంభిస్తారో స్పష్టమైన హామీ తీసుకోవాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



చిత్రజ్యోతి

SINCE 1965



ఆ లోటును భర్తీ చేస్తుంది

- మోహనకృష్ణ ఇంద్రగంటి

'అష్టాచెమ్మ', 'గోల్కొండ హైస్కూల్', 'సమ్మోహనం' వంటి చిత్రాలతో సెన్సిబుల్ దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు మోహనకృష్ణ ఇంద్రగంటి. ఆయన తెరకెక్కించిన తాజా చిత్రం 'సారంగపాణి జాతకం'. ప్రియదర్శి, రూప కొడవాయూర్ ప్రధాన పాత్రల్లో నటించారు. శివలెంక కృష్ణప్రసాద్ నిర్మించారు. ఈ నెల 25న సినిమా విడుదలవుతోన్న సందర్భంగా మోహనకృష్ణ మీడియాతో ముచ్చటించారు. "ఒకప్పటితో పోల్చితో తెలుగులో పూర్తి స్థాయి కామెడీ చిత్రాల సంఖ్య తగ్గిపోయింది. ఆ లోటును భర్తీ చేస్తుందీ చిత్రం. కథానాయకుడి పాత్రకు ఎవరు సరిపోతారా అని వెతికే క్రమంలో, ప్రియదర్శి నటించిన 'బలగం'తో పాటు ఆయన చేసిన మరికొన్ని చిత్రాలు చూశా. ఈ కథకు ఆయనే సరిపోతారనిపించింది. ఇందులో పాత్రలన్నీ కొత్తగా ఉంటాయి. కేవలం థియేటర్లో చూసి ఆనందించడమే కాకుండా.. కొన్ని రోజుల పాటు మాట్లాడుకునేలా ఉంటుందీ సినిమా. అన్ని వర్గాలను మెప్పించే ఈ చిత్రం, కాసేపు మీ కష్టాలన్నింటినీ మర్చిపోయేలా చేస్తుంది. జాతకాలను అతిగా నమ్మే ఓ యువకుడి జీవితంలో జరిగిన ఆసక్తికరమైన సంఘటనలే చిత్రకథాంశం. నమ్మకం మూఢనమ్మకంగా మారి, ఇతరుల్ని ఇబ్బందిపెట్టకూడదనే సందేశాన్ని వినోదాత్మకంగా అందిస్తుంది. సినిమాలో కడుపుబ్బా నవ్వుకునే వినోదంతో పాటు ఓ క్రైమ్ ఎలిమెంట్ ఉంటుంది. అది చాలా ఆసక్తికరంగా ఉంటుంది. దర్శకుడిగా ఈ సినిమా నాకు చాలా సంతృప్తిని ఇచ్చింది. ఇప్పుడు ప్రేక్షకుల అటెన్షన్ స్పాన్ తగ్గిపోయింది. వారు థియేటర్లో మొబైల్ తీయకుండా ఉంచగల స్థాయిలో సినిమాలు తీయడం దర్శకులు నేర్చుకోవాలి" అని చెప్పారు.




ఎన్ని అబద్ధాలు చెప్పినా మా సినిమా గెలుస్తుంది

విజయశాంతి

"అర్జున్ సన్నాఫ్ వైజయంతి' సినిమాను హిట్ చేసిన ప్రేక్షకులకు పాదాభివందనాలు. క్లైమాక్స్ కోసం కల్యాణ్‌బాబు తీసుకున్న రిస్క్ వల్లే సినిమా ఇంత గొప్పగా వచ్చింది. సినిమాకు నెగెటివ్ ప్రచారం చేయడం మంచి పద్ధతి కాదు. దుష్ప్రచారం చేసేవారు దయచేసి మైండ్‌సెట్‌ను మార్చుకోండి. వారు సినిమా బాగాలేదని ఎన్ని అబద్ధాలు చెప్పినా, చివరికి మా సినిమానే గెలుస్తుంది. కోట్లు ఖర్చు పెట్టి తీసిన సినిమాను బ్రతకనివ్వండి. మనస్ఫూర్తిగా సినిమాను దీవించడం నేర్చుకోండి" అని నటి విజయశాంతి అన్నారు. కల్యాణ్‌రామ్ కథానాయకుడిగా ప్రదీప్ చిలుకూరి తెరకెక్కించిన ఈ చిత్రం ఇటీవలె విడుదలైంది. సక్సెస్ మీట్‌లో కల్యాణ్‌రామ్ మాట్లాడుతూ "కమర్షియల్ సినిమాలోనూ కొత్తదనం ఉంటేనే ప్రేక్షకులు ఇష్టపడుతున్నారు. ఈ విషయంలో దర్శకుడు ప్రదీప్ ప్రేక్షకుల అంచనాలను అందుకున్నాడు" అని చెప్పారు.













విశాఖ నగరిపై కూటమి జెండా

- మేయర్‌పై నెగ్గిన అవిశ్వాస తీర్మానం
- తీర్మానానికి 74 మంది మద్దతు
- సమావేశాన్ని బహిష్కరించిన వైసీపీ
- 26న డిప్యూటీ మేయర్లపై అవిశ్వాస తీర్మానం!


అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా చేతులెత్తిన ఎంపీలు ఎం.శ్రీభరత్, సీఎం రమేశ్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, పి.గణబాబు, పంచకర్ల రమేశ్‌బాబు, కొణతాల రామకృష్ణ, పల్లా శ్రీనివాసరావు, విష్ణుకుమార్‌రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్, టీడీపీ, జనసేన, బీజేపీ కార్పొరేటర్లు

విశాఖపట్నం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) మేయర్ గొలగాని హరివెంకటకుమారిపై కూటమి కార్పొరేటర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్, జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి ఎంఎన్ హరేంధిర ప్రసాద్ అధ్యక్షతన శనివారం జరిగిన కౌన్సిల్ ప్రత్యేక సమావేశానికి టీడీపీ, జనసేన, బీజేపీలకు చెందిన 63 మంది కార్పొరేటర్లు, 11 మంది ఎక్స్ అఫీషియో సభ్యులు(ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ) మొత్తం 74 మంది సభ్యులు హాజరయ్యారు. వైసీపీకి చెందిన 31 మంది కార్పొరేటర్లు, సీపీఐ, సీపీఎంలకు చెందిన ఒక్కొక్క కార్పొరేటర్ సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్టు ప్రకటించారు. సమావేశం నిర్వహించేందుకు అవసరమైన కోరం ఉండడంతో అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ నిర్వహిస్తున్నట్టు ఎన్నికల అధికారి ప్రకటించారు. అవిశ్వాస తీర్మానానికి మద్దతు తెలిపేవారు చేతులు ఎత్తాలని కోరగా 63 మంది కార్పొరేటర్లు, 11 మంది ఎక్స్‌అఫీషియో సభ్యులు చేతులు ఎత్తారు. అవిశ్వాస తీర్మానాన్ని వ్యతిరేకించేవారు చేతులు ఎత్తాలని కలెక్టర్ కోరగా ఎవరూ స్పందించలేదు. దీంతో మేయర్‌పై అవిశ్వాస తీర్మానం నెగ్గినట్టు కలెక్టర్ ప్రకటించారు. ఈ నేపథ్యంలో మేయర్ పీఠం కూటమి పరం కానుంది. కాగా, డిప్యూటీ మేయర్లపై అవిశ్వాస తీర్మానం కోసం ఈనెల 26న కౌన్సిల్ సమావేశం జరగనుంది.


మాట్లాడుతున్న కలెక్టర్ డీకే బాలజీ, చిత్రంలో జేసీ గీతాంజలి శర్మ, ఎస్పీ గంగాధరరావు

ప్రధాని పర్యటనకు
పకడ్బందీ ఏర్పాట్లు

- కలెక్టర్ డీకే బాలాజీ
- గన్నవరం విమానాశ్రయంలో అధికారులతో సన్నాహక సమావేశం

గన్నవరం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ పర్యటనకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. గన్నవరం విమానాశ్రయంలో శనివారం ఎస్పీ ఆర్.గంగాధరరావు, జేసీ గీతాంజలి శర్మతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ మే 2వ తేదీన అమరావతిలో రాజధాని నిర్మాణ పనులు పునఃప్రారంభం సందర్భంగా గన్నవరం విమానాశ్రయానికి వస్తున్నారని చెప్పారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేసి ఎలాంటి లోటుపాట్లు లేకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రధానితో పాటు పలువురు గవర్నర్‌లు, ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రులు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు విమానాశ్రయానికి రానున్నారని చెప్పారు. జిల్లాలో వారు పర్యటించే ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రోటోకాల్ ప్రకారం గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా పర్యవేక్షించాలని చెప్పారు. నిర్దేశిత ప్రాంతల్లో మంచినీటి సౌకర్యం కల్పించాలన్నారు. కంట్రోల్ విభాగం, అంతర్జాలం కనెక్షన్‌లు ఏర్పాటు చేసి పరిస్థితులను బట్టి ఎప్పటికప్పుడు స్పందించాలనారు. ప్రముఖులు విమానాశ్రయానికి వస్తున్న నేపథ్యంలో ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బంది లేకుండా వీలైనంత తొందరగా ముందుగానే విమానాశ్రయం చేరుకునే విధంగా అన్ని మార్గాల్లో సమాచారం ఇవ్వాలన్నారు. వచ్చే ప్రముఖులకు రవాణా, వసతి ఏర్పాట్లు పక్కాగా చేయాలన్నారు. బ్లూ పుస్తకం ప్రకారం తాత్కాలిక ప్రధాన మంత్రి కార్యాలయ సెటప్‌ను ఎస్పీజీ వారు వచ్చాక చర్చించి ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలో ఏ విధులు నిర్వహిం చాలో త్వరలో చెబుతామన్నారు. పాసులు పట్టేవారి పేర్లు వివరాల జాబితా పోలీసుల ఆమోదం కోసం ముందుగా అందజేయాలన్నారు. ప్రముఖులు విమానాశ్రయం నుంచి విజయ వాడ, అమరావతికి చేరుకునే మార్గాల్లో రాకపోకలు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసు కోవాల న్నారు. ఎస్పీ ఆర్.గంగాధరరావు మాటా ్లడుతూ ప్రభుత్వ అధికారు లు వారి తరపున ఎవరినైన వివిధ పనుల కోసం నియమిం చుకుంటే వారి పూర్తి వివరాలు అందజేసి గుర్తింపు కార్డులు పొందాలన్నారు. గుడివాడ ఆర్డీవో బాలసుబ్రహ్మణ్యం, డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ శర్మిష్ట, ఆర్‌అండ్‌బీ అధికారి లోకేష్, ఆర్టీవో శ్రీనివాస్, డీఎస్‌వో పార్వతి, డీఎఫ్‌వో సునీత, విమానాశ్రయ సహాయ మేనేజర్ శ్రీలేఖ, డీఎస్పీ చలసాని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్ రోగులకు పూర్తిస్థాయి వైద్య సేవలు

- వైద్య, ఆరోగ్య మంత్రి సత్యకుమార్ వెల్లడి
- కర్నూలులోని స్టేట్ కేన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో లీనియర్ యాక్సిలరేటర్ ప్రారంభం
- సీటీ సిమ్యులేటర్, ఆపరేషన్ థియేటర్లు కూడా..
- రూ.29 కోట్లతో నూతన సదుపాయాల ఏర్పాటు


కర్నూలులోని స్టేట్ కేన్సర్ ఇనిస్టిట్యూట్‌లో లీనియర్ యాక్సిలరేటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్, చిత్రంలో మంత్రి భరత్, ఎంపీ నాగరాజు, ఎమ్మెల్యేలు గౌరు చరిత, దస్తగిరి తదితరులు

కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): కేన్సర్ రోగులకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించనున్నట్లు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. కర్నూలు స్టేట్ కేన్సర్ ఇనిస్టిట్యూట్‌లో రూ.29 కోట్లతో ఏర్పాటు చేసిన లీనియర్ యాక్సిలరేటర్, సీటీ సిమ్యులేటర్, ఆపరేషన్ థియేటర్లను శనివారం ఆయన ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ 120 పడకల సామర్థ్యం గల స్టేట్ కేన్సర్ ఇనిస్టిట్యూట్‌కు 2019లో శంకుస్థాపన జరిగిందని, అయితే గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లు తాత్సారం చేసిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కర్నూలులో రాష్ట్రస్థాయి స్టేట్ కేన్సర్ ఆస్పత్రిని అందుబాటులోకి తెచ్చామన్నారు. ప్రత్యేకించి వైద్య రంగానికి 15వ ఆర్థిక సంఘం కింద నిధులు వస్తున్నాయని చెప్పారు. కేన్సర్ ఇనిస్టిట్యూట్‌లో ఏపీకి చెందిన రోగులే కాకుండా కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన వాళ్లు కూడా చికిత్స తీసుకుంటున్నారని తెలిపారు. రాష్ట్రంలో కేన్సర్ వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు ఎన్‌సీడీ కింద 3.0 స్ర్కీనింగ్‌ను ప్రారంభించామని మంత్రి పేర్కొన్నారు. 1-2 శాతం కొరత ఉన్న పరికరాలు, సౌకర్యాలు కల్పించి రానున్న రోజుల్లో పూర్తి స్థాయిలో స్టేట్ కేన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో సేవలు అందిస్తామన్నారు. 2022లో రాష్ట్రంలో 73 వేల కొత్త కేన్సర్ కేసులు వెలుగు చూడగా.. అందులో 41 వేల మంది ప్రాణాలు కోల్పోయారని ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల కేన్సర్ ఇన్‌స్టిట్యూట్ ప్రారంభం కాలేదని, కూటమి ప్రభుత్వం తక్షణమే రూ.45 కోట్ల విలువైన పరికరాలను సమకూర్చిందని తెలిపారు. అనంతరం మంత్రి సత్యకుమార్ రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌తో కలిసి కర్నూలు జీజీహెచ్‌లోని సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌లో ఉన్న క్యాత్‌ల్యాబ్, సీటీ సర్జరీ విభాగాలను పరిశీలించారు. తర్వాత కర్నూలు మెడికల్ కాలేజీలో వైద్యులతో కలిసి సమీక్ష నిర్వహించారు. కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, పాణ్యం, కోడుమూరు, ఆదోని ఎమ్మెల్యేలు గౌరు చరితా రెడ్డి, బొగ్గుల దస్తగిరి, పార్థసారధి, ఏపీఎంఎస్ ఐడీసీ చైర్మన్ చల్లపల్లి శ్రీనివాస్, అకడమిక్ డీఎంఈ డా.రఘునందన్, కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, కర్నూలు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ పాల్గొన్నారు.

సర్దార్ గౌతు లచ్చన్న సేవలు స్ఫూర్తిదాయకం

- ఎమ్మెల్యేలు బోడె ప్రసాద్, గౌతు శిరీష
- యనమలకుదురులో గౌతు లచ్చన్న విగ్రహావిష్కరణ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌతు శిరీష, చిత్రంలో పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, ఏప్రిల్19(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య ఉద్యమంలో జైలు జీవితం గడిపిన ఉద్యమకారుడు, సర్దార్ వల్లభాయ్ పటేల్ తర్వాత సర్దార్ అని పిలిపించుకొన్న గొప్ప వ్యక్తి గౌతు లచ్చన్న సేవలు స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యేలు బోడె ప్రసాద్, గౌతు శిరీష పేర్కొన్నారు. గౌతు లచ్చన్న వర్ధంతి సందర్భంగా శనివారం యనమలకుదురులో ఏర్పాటు చేసిన లచ్చన్న విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. చిన్నతనంలోనే జమిందారీ, ఈనాం వ్యవస్థల రద్దు కోసం ఇచ్ఛాపురం నుంచి తడ వరకు 2400 కిలోమీటర్లు పాదయాత్ర చేసి ఆ రోజుల్లో పెను సంచలనం సృష్టించారని కొనియాడారు. అంటరానితనంపై కత్తి ఎత్తిన లచ్చన్న దళితులకు దేవాలయ ప్రవేశం, విద్యాభివృద్ధికి విశేష కృషి చేశారని తెలిపారు. ఐదుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎమ్మెల్సీగా, మంత్రిగా సుదీర్ఘ కాలం చట్టసభల్లో ప్రజాగొంతుకై ప్రాతినిధ్యం వహించారన్నారు. టంగుటూరి ప్రకాశం పంతులు, బెజవాడ రాజగోపాల్ రెడ్డి మంత్రివర్గాల్లో వ్యవసాయ శాఖ, కార్మికశాఖల మంత్రిగా పనిచేశారని, తన గురువు ఎన్జీ రంగా కోసం తాను రాజీనామా చేసి శ్రీకాకుళం నుంచి రంగాను ఎంపీగా గెలిపించిన ఘనతను దక్కించుకున్నారన్నారు. లచ్చన్న ఆదర్శాలకు అనుగుణంగా టీడీపీ బీసీలకు ప్రాధాన్యత కల్పించడం, ఆయన కుమారుడు శివాజీ, మనుమరాలు శిరీషలు కూడా టీడీపీలో ఎమ్మెల్యేలుగా పార్టీపదవులు ఇచ్చి గౌరవించిందన్నారు. లచ్చన్నను ఆదర్శంగా తీసుకొని నాయకులు, కార్యకర్తలు నడుచుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, నాయకులు కొనకళ్ల బుల్లయ్య, వీరంకి గురుమూర్తి, అనుమోలు ప్రభాకరరావు, వెలగపూడి శంకర బాబు, శొంఠి శివరాంప్రసాద్, మొక్కపాటి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

23న మాజీ సైనికుల సమస్యలపై సదస్సు

విజయవాడ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్, కృష్ణాజిల్లాలోని మద్రాసు రెజిమెంట్‌కు చెందిన మాజీ సైనికులు, మరణించిన సైనికుల కుటుంబ సభ్యుల సమస్యలు తెలుసుకోడానికి జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయంలో ఈ నెల 23న సదస్సు ఏర్పాటు చేసినట్లు రెజిమెంట్ సర్జన్ లెఫ్టినెంట్ కమాండర్, జిల్లా సైనిక సంక్షేమ అధికారిణి కళ్యాణవీణ ఓ ప్రకటనలో తెలిపారు. సంక్షేమ కార్యాలయంలో జరగబోయే సదస్సుకు మాజీ సైనికులు, మరణించిన సైనికుల కుటుంబ సభ్యులు డిశ్చార్జి బుక్, పెన్షన్ పేమెంట్ ఆర్డర్ (పీపీఓ), ఐడీ కార్డు, ఆధార్ కార్డు తీసుకునిరావాలని కోరారు. ఈ సదస్సులో వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలియజేయాలని ఆమె పేర్కొన్నారు.

నేటి మ్యాచ్‌లు

పంజాబ్ x బెంగళూరు	మ.3.30 నుంచి	వేదిక: చండీగఢ్
ముంబై x చెన్నై	రా.7.30 నుంచి	వేదిక: ముంబై

అజర్ స్టాండ్ తొలగించండి

హెచ్‌సీఏకు అంబుడ్స్‌మన్ ఆదేశాలు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఉప్పల్ స్టేడియంలో ఉత్తర భాగం స్టాండ్స్‌కు ఉన్న మాజీ కెప్టెన్ అజరుద్దీన్ పేరును తక్షణమే తొలగించాలని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అంబుడ్స్‌మన్ జస్టిస్ ఈశ్వరయ్య ఉత్తర్వులు జారీ చేశారు. 2019లో అజర్ తన పేరు పెట్టుకునే క్రమంలో అవలంబించాల్సిన పద్ధతులను పాటించలేదని హెచ్‌సీఏకి అనుబంధంగా ఉన్న లార్డ్స్ క్రికెట్ క్లబ్ అంబుడ్స్‌మన్‌కు ఫిర్యాదు చేసింది. దీనిపై విచారణ చేపట్టిన అంబుడ్స్‌మన్ శనివారం తుది తీర్పును వెలువరించారు. అజరుద్దీన్ చర్య పరస్పర విరుద్ధ ప్రయోజనాల కిందకు వస్తుందని తెలిపారు. స్టాండ్స్‌కు పేరు పెట్టే విషయాన్ని హెచ్‌సీఏ సర్వసభ్య సమావేశంలో తీర్మానించలేదని పేర్కొన్నారు. ఇకనుంచి జరిగే మ్యాచ్ టిక్కెట్ల ముద్రణపై కూడా అజర్ పేరు ఉండకూడదని అంబుడ్స్‌మన్ ఆదేశించారు.

కేకేఆర్ చెంతకు అభిషేక్ నాయర్

న్యూఢిల్లీ: భారత క్రికెట్ జట్టు మాజీ సహాయ కోచ్ అభిషేక్ నాయర్ తిరిగి కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టులో చేరాడు. టీమిండియా ఇటీవలి వరుస వైఫల్యాల నేపథ్యంలో సహాయక సిబ్బందిపై బీసీసీఐ ఆగ్రహంగా ఉంది. దీంతో నాయర్ సహా పలువురిపై వేటు వేసింది. అలాగే సీనియర్ ఆటగాళ్లతోనూ నాయర్‌కు అంతగా సఖ్యత లేదనే కథనాలు వినిపించాయి. అయితే బీసీసీఐ వేటు వేయడమే ఆలస్యం కేకేఆర్ అభిషేక్‌ను తమ సహాయక బృందంలో చేర్చుకుంది. శనివారమే తను జట్టులో చేరాడు. గతేడాది కోల్‌కతాకు గంభీర్ మెంటార్‌గా ఉన్నప్పుడు నాయర్ అసిస్టెంట్ కోచ్‌గా వ్యవహరించాడు.

పడగొట్టిన ప్రసిద్ధ్ బాదేసిన బట్లర్

మళ్లీ టాప్‌నకు గుజరాత్ ● 7 వికెట్లతో ఢిల్లీ చిత్తు


ప్రసిద్ధ్ కృష్ణ (4-0-41-4)


బట్లర్ (97 నాటౌట్)

స్కోరుబోర్డు

ఢిల్లీ: పోరెల్ (సి) సిరాజ్ (బి) అర్షద్ 18, కరుణ్ నాయర్ (సి) అర్షద్ (బి) ప్రసిద్ధ్ 31, రాహుల్ (ఎల్బీ) ప్రసిద్ధ్ 28, అక్షర్ (సి) బట్లర్ (బి) ప్రసిద్ధ్ 39, స్టబ్స్ (సి) ప్రసిద్ధ్ (బి) సిరాజ్ 31, అశుతోష్ (సి/సబ్) లోమ్రోర్ (బి) కిశోర్ 37, విప్రజ్ (సి) బట్లర్ (బి) ప్రసిద్ధ్ 0, ఫెరీరా (సి) కిశోర్ (బి) ఇషాంత్ 1, స్టార్క్ (నాటౌట్) 2, కుల్దీప్ (నాటౌట్) 4; **ఎక్స్‌ట్రాలు: 12; మొత్తం: 20 ఓవర్లలో 203/8; వికెట్ల పతనం:** 1-23, 2-58, 3-93, 4-146, 5-173, 6-173, 7-191, 8-199; **బౌలింగ్:** సిరాజ్ 4-0-47-1, అర్షద్ 4-0-46-1, ప్రసిద్ధ్ కృష్ణ 4-0-41-4, రషీద్ 4-0-38-0, ఇషాంత్ 3-0-19-1, సాయి కిశోర్ 1-0-9-1.

గుజరాత్: సాయి సుదర్శన్ (సి) స్టబ్స్ (బి) కుల్దీప్ 36, గిల్ (రనౌట్) 7, బట్లర్ (నాటౌట్) 97, రూథర్‌ఫోర్డ్ (సి) స్టార్క్ (బి) ముకేశ్ 43, తెవాటియా (నాటౌట్) 11; **ఎక్స్‌ట్రాలు: 10; మొత్తం: 19.2 ఓవర్లలో 204/3; వికెట్ల పతనం:** 1-14, 2-74, 3-193; **బౌలింగ్:** స్టార్క్ 3.2-0-49-0, ముకేశ్ 4-0-40-1, అక్షర్ 2-0-18-0, విప్రజ్ నిగమ్ 4-0-34-0, కుల్దీప్ 4-0-30-1, మోహిత్ 2-0-28-0.

1

ఐపీఎల్‌లో వేగంగా 200 సిక్స్‌ల మైలురాయిని చేరిన భారత ఆటగాడిగా రాహుల్ (129 ఇన్నింగ్స్). శాంసన్ (159 ఇన్నింగ్స్)ను రాహుల్ వెనక్కినెట్టాడు. ఓవరాల్‌గా క్రిస్ గేల్ (69 ఇన్నింగ్స్), రస్సెల్ (97 ఇన్నింగ్స్) టాప్‌లో ఉన్నారు.

అహ్మదాబాద్: బట్లర్ (54 బంతుల్లో 11 ఫోర్లు, 4 సిక్స్‌లతో 97 నాటౌట్) భారీ అర్ధ శతకంతోపాటు ప్రసిద్ధ్ కృష్ణ (4-0-41-4) బంతితో విజృంభించడంతో.. గుజరాత్ టైటాన్స్ మళ్లీ టాప్‌లేపింది. శనివారం జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ 7 వికెట్ల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఓడించింది. తొలుత ఢిల్లీ 20 ఓవర్లలో 203/8 స్కోరు చేసింది. అక్షర్ (39), అశుతోష్ శర్మ (37), స్టబ్స్ (31), కరుణ్ నాయర్ (31) ఫర్వాలేదనిపించారు. ఛేదనలో గుజరాత్ 19.2 ఓవర్లలో 3 వికెట్లకు 204 పరుగులు చేసి గెలిచింది. సాయి సుదర్శన్ (36), రూథర్‌ఫోర్డ్ (43) అదరగొట్టారు. కుల్దీప్, ముకేశ్ చెరో వికెట్ దక్కించుకొన్నారు. మూడు పరుగుల తేడాతో శతకం చేజార్చుకున్న బట్లర్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు.

అలవోకగా..: ఛేదనలో బట్లర్ జోరుకు ఢిల్లీ బౌలింగ్ బేజారైంది. ఓపెనర్ గిల్ (7) స్వల్ప స్కోరుకే అవుటయ్యాడు. కానీ, మరో ఓపెనర్ సుదర్శన్‌తో కలసి రెండో వికెట్‌కు 60 పరుగులు జోడించిన బట్లర్.. రూథర్‌ఫోర్డ్‌తో కలసి మూడో వికెట్‌కు 119 పరుగుల భాగస్వామ్యంతో జట్టును గెలుపు బాటలో నిలిపాడు. కానీ, శతకం మాత్రం పూర్తి చేసుకోలేకపోయాడు. రూథర్‌ఫోర్డ్‌ను ముకేశ్ వెనక్కిపంపాడు. చివరి ఓవర్‌లో విజయానికి 10 పరుగులు కావాల్సి ఉండగా.. స్టార్క్ గత మ్యాచ్ తరహాలో మరోసారి మ్యాజిక్ చేస్తాడేమోనని భావించారు. కానీ, 6,4 బాదిన రాహుల్ తెవాటియా (11 నాటౌట్).. మరో 4 బంతులు మిగిలుండగానే జట్టును గెలిపించాడు.

కట్టడి చేసిన బౌలర్లు..: ప్రధాన బ్యాటర్లకు శుభారంభాలు దక్కినా.. వాటిని భారీస్కోర్లుగా మలచలేకపోవడం ఢిల్లీని దెబ్బతీసింది. ప్రసిద్ధ్ కృష్ణతో పాటు మిగతా బౌలర్లు సమష్టిగా రాణించడంతో.. ఢిల్లీ 203 పరుగులకు పరిమితమైంది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన క్యాపిటల్స్‌కు ఓపెనర్ అభిషేక్ పోరెల్ (18).. తొలి ఓవర్‌లోనే 16 పరుగులతో దూకుడైన ఆరంభాన్నిచ్చాడు. కానీ, ఆ తర్వాతి ఓవర్‌లోనే అర్షద్ బౌలింగ్‌లో అవుటయ్యాడు. అనంతరం రాహుల్ (28).. ఓపెనర్‌గా వచ్చిన నాయర్‌తో కలసి రెండో వికెట్‌కు వేగంగా 35 పరుగులు జోడించాడు. అయితే, రాహుల్‌ను కృష్ణ ఎల్బీగా వెనక్కిపంపాడు. మరోవైపు నాయర్ కొన్ని అద్భుత షాట్లతో అలరించినా.. కృష్ణ బౌలింగ్‌లో అవుటయ్యాడు. దీంతో ఢిల్లీ 9 ఓవర్లలో 93/3తో ఇబ్బందుల్లో పడింది. ఈ దశలో అక్షర్, స్టబ్స్ నాలుగో వికెట్‌కు 53 పరుగులు జోడించడంతో.. స్కోరుబోర్డు దూసుకెళ్లింది. అయితే, స్టబ్స్‌ను సిరాజ్ పెవిలియన్ చేర్చాడు. 17వ ఓవర్‌లో అక్షర్, నిగమ్ (0)ను కృష్ణ వరుస బంతుల్లో అవుట్ చేయడంతో.. డెత్ ఓవర్లలో ఢిల్లీ డీలాపడింది. అశుతోష్ చివరి వరకు క్రీజులో ఉన్నా.. గుజరాత్ బౌలర్లు భారీ షాట్లు ఆడకుండా అతడిని కట్టడి చేశారు.

ప్చ్.. రాజస్థాన్

ఆఖరి ఓవర్‌లో ఓటమి
లఖ్‌నవూను గెలిపించిన అవేశ్


అవేశ్ ఖాన్ (3/37)

జైపూర్: రాజస్థాన్ రాయల్స్‌కు మరోసారి ఆఖరి ఓవర్‌లోనే భంగపాటు ఎదురైంది. గత మ్యాచ్‌లో ఢిల్లీ చేతిలో 9 పరుగులను సాధించలేక సూపర్ ఓవర్‌కు వెళ్లి ఓడగా.. ఈసారి లఖ్‌నవూపై 9 పరుగులు చేయలేక చతికిలపడింది. ఫలితంగా శనివారం జరిగిన ఈ మ్యాచ్‌లో 2 పరుగుల తేడాతో ఆర్ఆర్ ఓటవిపాలైంది. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్', పేసర్ అవేశ్ ఖాన్ (3/37) చివరి ఓవర్‌లో లఖ్‌నవూను గట్టెక్కించాడు. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన లఖ్‌నవూ 20 ఓవర్లలో 5 వికెట్లకు 180 పరుగులు చేసింది. మార్‌క్రమ్ (66), బదోని (50), సమద్ (30 నాటౌట్) రాణించారు. హసరంగకు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో రాజస్థాన్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 178 పరుగులు చేసి ఓడింది. జైస్వాల్ (74) అదరగొట్టగా.. పరాగ్ (39), వైభవ్ (34) ఫర్వాలేదనిపించారు.

చివర్లో తడబాటు: ఛేదనలో రాజస్థాన్ ఇన్నింగ్స్ వేగంగా ఆరంభమైంది. ఓపెనర్‌గా వచ్చిన 14 ఏళ్ల వైభవ్ అరంగేట్ర మ్యాచ్‌లో అదుర్స్ అనిపించాడు. తొలి ఓవర్‌లో తానెదుర్కొన్న మొదటి బంతినే సిక్సర్‌గా మలిచాడు. ఆ వెంటనే అవేశ్ ఓవర్‌లోనూ 6,4తో జోరు చూపాడు. అటు జైస్వాల్ మరింత దూకుడుతో బౌండరీలు రాబట్టడంతో పవర్‌ప్లేలో జట్టు 61 పరుగులు సాధించింది. 31 బంతుల్లో జైస్వాల్ హ్యాట్రిక్ హాఫ్ సెంచరీ పూర్తి చేయగా, మార్‌క్రమ్ ఓవర్‌లో వైభవ్ స్టంపయ్యాడు. దీంతో తొలి వికెట్‌కు 84 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ వెంటనే రాణా (8) శార్దూల్‌కు చిక్కాడు. 18వ ఓవర్‌లో జైస్వాల్, పరాగ్‌లను అవేశ్ అవుట్ చేశాడు. ఇక 12 బంతుల్లో 20 రన్స్ కావాల్సిన వేళ కాస్త ఒత్తిడి నెలకొన్నా, హెట్‌మయెర్ (12) రెండు ఫోర్లతో ఆరు బంతుల్లో 9 రన్స్ అవసరమయ్యాయి. కానీ చివరి ఓవర్‌లో హైడ్రామా నెలకొంది. మూడో బంతికి హెట్‌మయెర్‌ను అవుట్ చేసిన అవేశ్ ఆరు పరుగులే ఇవ్వడంతో లఖ్‌నవూ సంబరాల్లో మునిగింది.

ఆఖరి ఓవర్‌లో హల్‌చల్: వికెట్ పొడిగా ఉండడంతో టాస్ గెలిచిన లఖ్‌నవూ బ్యాటింగ్ ఎంచుకుంది. మార్‌క్రమ్, బదోని నిలదొక్కుకున్నా ఆశించిన వేగం కనిపించలేదు. కానీ అబ్దుల్ సమద్ పుణ్యమా అని జట్టు సవాల్ విసిరే స్కోరందుకుంది. ఓపెనర్ మార్ష్ (4), పూరన్ (11) పవర్‌ప్లేలోనే వెనుదిరగ్గా.. కెప్టెన్ పంత్ (3) ఊపు గత మ్యాచ్‌కే పరిమితమైంది. స్పిన్నర్ హసరంగ అతడిని ఎనిమిదో ఓవర్‌లో దెబ్బతీశాడు. అయితే 54/3 స్కోరుతో కష్టాల్లో పడిన జట్టుకు ఓపెనర్ మార్‌క్రమ్ అండగా నిలిచాడు. అటు బదోని కూడా అతడికి సహకరించాడు. నత్తనడకన సాగిన ఇన్నింగ్స్‌కు సమద్ ఆఖరి ఓవర్‌లో ఊపు తెచ్చాడు. సందీప్ వేసిన ఈ ఓవర్‌లో అతడు నాలుగు సిక్సర్లతో 27 రన్స్ సాధించగా జట్టు స్కోరు 153 నుంచి 180కి చేరింది.

14 ఏళ్లకే బరిలోకి..



బిహార్‌కు చెందిన 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ ఐపీఎల్‌లో చరిత్ర సృష్టించాడు. అత్యంత పిన్న వయస్సులోనే ఈ లీగ్‌లో అరంగేట్రం చేసిన తొలి ప్లేయర్‌గా నిలిచాడు. దీంతో ఇన్నాళ్లు ప్రయాస్ రే బర్మన్ (16) పేరిట ఉన్న రికార్డును అధిగమించాడు. కెప్టెన్ శాంసన్ గాయం కారణంగా లఖ్‌నవూతో మ్యాచ్‌కు దూరం కావడంతో ఇంపాక్ట్ ప్లేయర్‌గా వైభవ్‌ను ఓపెనర్‌గా ఆడించారు. అలాగే ఎలాంటి బెరుకు లేకుండా ఎదుర్కొన్న తొలి బంతినే సిక్సర్‌గా మలిచి ఆకట్టుకున్నాడు.

స్కోరుబోర్డు

లఖ్‌నవూ: మార్ష్ (సి) హెట్‌మయెర్ (బి) ఆర్చర్ 4, మార్‌క్రమ్ (సి) పరాగ్ (బి) హసరంగ 66, పూరన్ (ఎల్బీ) సందీప్ 11, పంత్ (సి) జురెల్ (బి) హసరంగ 3, బదోని (సి) దూబే (బి) దేశ్‌పాండే 50, మిల్లర్ (నాటౌట్) 7, అబ్దుల్ (నాటౌట్) 30, **ఎక్స్‌ట్రాలు: 9; మొత్తం: 20 ఓవర్లలో 180/5; వికెట్ల పతనం:** 1-16, 2-46, 3-54, 4-130, 5-143; **బౌలింగ్:** ఆర్చర్ 4-0-32-1, తీక్షణ 4-0-32-0, సందీప్ 4-0-55-1, తుషార్ దేశ్‌పాండే 4-0-26-1, హసరంగ 4-0-31-2.

రాజస్థాన్: జైస్వాల్ (బి) అవేశ్ 74, వైభవ్ సూర్యవంశీ (స్టంప్డ్) పంత్ (బి) మార్‌క్రమ్ 34, నితీశ్ (సి) అవేశ్ (బి) శార్దూల్ 8, పరాగ్ (ఎల్బీ) అవేశ్ 39, జురెల్ (నాటౌట్) 6, హెట్‌మయెర్ (సి) శార్దూల్ (బి) అవేశ్ 12, శుభమ్ దూబే (నాటౌట్) 3. **ఎక్స్‌ట్రాలు: 2; మొత్తం: 20 ఓవర్లలో 178/5; వికెట్ల పతనం:** 1-85, 2-94, 3-156, 4-161, 5-175, **బౌలింగ్:** శార్దూల్ 3-0-34-1, అవేశ్ 4-0-37-3, దిగ్వేశ్ 4-0-30-0, మార్‌క్రమ్ 2-0-18-1, ప్రిన్స్ 4-0-39-0, రవి బిష్ణోయ్ 3-0-19-0.

ప్రపంచ బ్రిడ్జ్ చాంపియన్‌షిప్‌నకు భారత్ అర్హత

న్యూఢిల్లీ: వరల్డ్ బ్రిడ్జ్ చాంపియన్‌షిప్‌నకు భారత్ అర్హత సాధించింది. దుబాయ్‌లో జరిగిన ఆసియా బ్రిడ్జ్ సమాఖ్య మధ్య ప్రాచ్య టోర్నీలో భారత్ మూడు స్వర్ణాలు, ఒక రజత పతకం సాధించింది. భారత పురుషులు, మహిళలు, సీనియర్ జట్లు పసిడి పతకాల్ని సొంతం చేసుకున్నాయి. మిక్స్‌డ్ జట్టు రజతం కైవసం చేసుకుంది. దరిమిలా ఈ జట్లు వచ్చే ఆగస్టులో డెన్మార్క్‌లోని హెర్నింగ్‌లో జరిగే ప్రపంచ చాంపియన్‌షిప్‌నకు క్వాలిఫై అయ్యాయి. భారత్ సహా మొత్తం 35 దేశాల నుంచి 66 జట్లు హెర్నింగ్ టోర్నమెంట్‌లో తలపడనున్నాయి.

మా జట్టు భారత్ వెళ్లదు

పీసీబీ చైర్మన్ నక్వీ

లాహోర్: భారత్ ఆతిథ్యమిచ్చే వన్డే వరల్డ్ కప్‌లో పాల్గొనేందుకు తమ మహిళల జట్టు ఆ దేశం వెళ్లబోదని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) చైర్మన్ మొహిసిన్ నక్వీ స్పష్టంజేశాడు. వచ్చే సెప్టెంబరు-అక్టోబరులో ఈ మెగా టోర్నమెంట్ జరగనుంది. ఈ ఏడాది ఆరంభంలో కుదిరిన ఒప్పందం మేరకు భారత్ ఆతిథ్యమిచ్చే ఐసీసీ టోర్నమెంట్‌ను హైబ్రిడ్ విధానంలో నిర్వహించాల్సి ఉంటుందని నక్వీ గుర్తు చేశాడు.

అవన్నీ కట్టుకథలు



న్యూఢిల్లీ: సోషల్ మీడియాలో రిషభ్ పంత్ గురించి తాను చేసినట్టుగా వచ్చిన కథనాలను ప్రీతి జింటా తోసిపుచ్చింది. అయితే వేలంలో పంత్‌ను తీసుకునే అవకాశం ఉన్నా..తమకు బాగా ఆడే వాళ్లు అవసరమని ప్రీతి జింటా చెప్పినట్టుగా వార్తలు వినిపించాయి. అంతకంటే ముందు పంత్.. తాను ఏ జట్టుకైనా వెళ్తానని, పంజాబ్‌కు మాత్రం ఆడదలుచుకోలేదని చెప్పిన మాటలకు ప్రీతి ఇలా కౌంటర్ వేసినట్టుగా సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ లాభంలో 7% వృద్ధి

- క్యూ4 లాభం రూ.18,835 కోట్లు
- ఒక్కో షేరుకు రూ.22 డివిడెండ్

ముంబై: గడచిన ఆర్థిక సంవత్సరం (2024-25) మార్చితో ముగిసిన చివరి త్రైమాసికం (క్యూ4)లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఆకర్షణీయమైన ఫలితాలను ప్రకటించింది. ఈ కాలానికి గాను బ్యాంక్ కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.18,835 కోట్ల నికర లాభం ఆర్జించింది. 2023-24 ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే ఇది 7 శాతం ఎక్కువ. కాగా స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన ఈ కాలంలో రూ.17,616 కోట్ల లాభాన్ని నమోదు చేసింది. కాగా సమీక్షా త్రైమాసికంలో స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన మొత్తం ఆదాయం మాత్రం రూ.80,639 కోట్ల నుంచి రూ.89,488 కోట్లకు తగ్గింది. స్థూల మొండి బకాయిలు (ఎన్‌పీఏ) 1.24 శాతం నుంచి 1.33 శాతానికి పెరగా నికర ఎన్‌పీఏలు కూడా 0.33 శాతం నుంచి 0.43 శాతానికి పెరిగాయి. కాగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.1 ముఖ విలువ కలిగిన ప్రతి షేరుకు రూ.22 చొప్పున (2,200 శాతం) డివిడెండ్‌ను బ్యాంక్ డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది.

ఐసీఐసీఐ బ్యాంక్ లాభం రూ.13,502 కోట్లు

ముంబై: ప్రైవేట్ రంగంలోని ఐసీఐసీఐ బ్యాంక్ మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికంలో మంచి ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. జనవరి-మార్చి త్రైమాసికానికి గాను బ్యాంక్ రూ.13,502 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ఆర్జించింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో పోలిస్తే ఇది 15.7 శాతం ఎక్కువ. కాగా స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన బ్యాంక్ నికర లాభం ఏకంగా 18 శాతం వృద్ధి చెంది రూ.12,630 కోట్లకు చేరింది. ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉండటంతో ఒక్కో షేరుకు రూ.11 డివిడెండ్‌ను బ్యాంక్ బోర్డు సిఫారసు చేసింది.

వడ్డీ రేట్లు దిగొస్తున్నాయ్..

దేశంలో వడ్డీ రేట్లు దిగొస్తున్నాయి. భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) ఇటీవల రెపో రేటు మరో పావు శాతం తగ్గించి ఆరు శాతానికి కుదించింది. పరిస్థితులు అనుకూలిస్తే ఈ ఏడాది చివరికల్లా రెపో రేటు మరో అర శాతం తగ్గే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ అవకాశాన్ని గృహ రుణ భారం తగ్గించుకునేందుకు ఎలా ఉపయోగించుకోవచ్చో చూద్దాం...

బిజినెస్ ప్లస్

అప్పుల భారం తగ్గించుకోండి..



చలన (ఫ్లోటింగ్) వడ్డీ రేటుతో గృహ రుణాలు తీసుకున్న వారికి ఆర్‌బీఐ ఇటీవల మరోసారి శుభవార్త చెప్పింది. బ్యాంకులకు తాను ఇచ్చే స్వల్పకాలిక రుణాపై వసూలు చేసే రెపో రేటును మరో పావు (0.25) శాతం కుదించింది. దీంతో దాదాపు అన్ని బ్యాంకులు తమ రెపో ఆధారిత లేదా ఏదైనా ఇతర ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ ఆధారిత గృహ రుణాల వడ్డీ రేట్లనూ కుదిస్తున్నాయి. దాంతో ఈ రుణాల నెలవారీ వాయిదాలు (ఈఎంఐ) దిగి వస్తున్నాయి. దీన్ని అప్పుల భారం తగ్గించుకునేందుకు ఎలా ఉపయోగించుకోవచ్చో తెలుసుకుందాం.

పాక్షిక చెల్లింపు

ఒకవేళ చేతిలో మిగులు నిధులు ఉంటే మీ గృహ రుణంలో కొంత మొత్తాన్ని ముందే పాక్షికంగా చెల్లించడం మంచిది. కాకపోతే ఈ చెల్లింపు మీ నెలవారీ బడ్జెట్‌ను దెబ్బతీయకుండా చూసుకోవాలి. దీనివల్ల ఈఎంఐ భారం తగ్గడంతో పాటు రుణ చెల్లింపు కాల పరిమితి త్వరగా పూర్తవుతుంది.

ఈఎంఐల కొనసాగింపు

వడ్డీ రేటు తగ్గడంతో ఈఎంఐల భారమూ తగుతుంది. దీనికి మురిసిపోయి ఈఎంఐని కుదించుకోవద్దు. గతంలోలానే ఈఎంఐని కొనసాగించండి. దీంతో అదనంగా చెల్లించే ఈఎంఐ అసలు కింద జమ చేయబడుతుంది. రుణ చెల్లింపు కాల పరిమితి తగ్గుతుంది.

చర వడ్డీ రేట్లు

గృహ రుణం తీసుకునేటప్పుడే చర వడ్డీ రేటును ఎంచుకోవాలి. దీనివల్ల మన దగ్గర మిగులు నిధులు ఉన్నపుడు కొంత రుణాన్ని ముందుగానే చెల్లించవచ్చు. దీనిపై బ్యాంకులు ఎలాంటి పెనాల్టీ చార్జీలు వసూలు చేయవు. ఏటా ఇలా రెండు మూడు చెల్లింపులు చేసినా.. చెప్పుకోదగ్గ స్థాయిలో వడ్డీ ఖర్చులు ఆదా అవుతాయి.

రీఫైనాన్స్‌కు వెళ్లడం

ఆర్‌బీఐ తగ్గించిన రెపో రేటుతో దాదాపు అన్ని బ్యాంకులు, హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీలు (హెచ్‌ఎఫ్‌సీ) కూడా వడ్డీ రేట్లు తగ్గిస్తాయి. ఒకవేళ మీకు గృహ రుణం ఇచ్చిన బ్యాంకు ఆ పని చేయకపోతే.. మీ గృహ రుణాన్ని తక్కువ వడ్డీ రేటు ఆఫర్ చేసే వేరే బ్యాంకు లేదా హెచ్‌ఎఫ్‌సీకి మార్చుకోవడం మంచిది. కాకపోతే ఇందుకు మిగిలిన రుణ మొత్తంపై పావు శాతం నుంచి ఒక శాతం వరకు ఖర్చులవుతాయి. టెక్నికల్, లీగల్ చార్జీల కింద రూ.5,000 నుంచి రూ.15,000, అడ్మినిస్ట్రేటివ్ ఫీజు కింద మరో రూ.1,000 నుంచి రూ.5,000 వసూలు చేస్తారు. సరిగ్గా బేరమాడగలిగితే కొత్త రుణదాతకు ఈ చార్జీలను కొంత వరకు తగ్గించే అవకాశం ఉంది. ఒకవేళ పాత రుణ దాతలు కూడా అదే వడ్డీ రేటుకు సిద్ధపడితే.. రీఫైనాన్స్ ప్రయత్నం పక్కన పెట్టడం మంచిది.

పన్ను ప్రయోజనాలు

రుణాన్ని ముందుగానే చెల్లించడం వల్ల పన్ను ప్రయోజనాలు పోతాయనే బెంగ అవసరం లేదు. పాత పన్ను విధానంలో సెక్షన్ 80సీ కింద యధావిధిగా ఏటా రూ.1.5 లక్షల అసలు, సెక్షన్ 24 (బీ) కింద రూ.2 లక్షల వడ్డీ చెల్లింపులకు పన్ను మినహాయింపులు పొందవచ్చు. అయితే ఇందు కోసం చేతిలో డబ్బులు ఉన్నాయి కదాని ఒకేసారి ముందస్తు చెల్లింపులు చేయవద్దు. ఏటా పన్ను పోటు తగ్గేలా కొద్ది కొద్దిగా ముందస్తు చెల్లింపులు చేయడం మంచిది.

పొదుపు

వడ్డీ రేట్లు తగ్గడం మన నెలవారీ బడ్జెట్‌ను కూడా ఆదా చేస్తుంది. దీన్ని తెలివిగా గృహ రుణ భారం తగ్గించుకునేందుకు వినియోగించుకోవాలి. అంతే తప్ప, తగ్గే ఈఎంఐల భారాన్ని వేరే ఖర్చులకు మళ్లించకూడదు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



20వ తేదీ			
హైదరాబాద్	405	విజయవాడ	420
వరంగల్	407	గోదావరి	395
చిత్తూరు	460	విశాఖపట్నం	425
		దజను గుడ్లు రూ. 60	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	120	విజయవాడ	120
వరంగల్	120	గుంటూరు	120
కరీంనగర్	120	ఒంగోలు	120
మహబూబ్‌నగర్	120	చిత్తూరు	77
కర్నూలు	120	నెల్లూరు	82
విశాఖపట్నం	109	అనంతపురం	82
గోదావరి	120		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	97,550 ▼	89,400 ▼	1,10,000 ▲
విజయవాడ	98,500 ▼	90,000 ▼	98,500 ▲
విశాఖపట్నం	98,490 ▲	89,450 ▼	1,10,000 ▼
రాజమండ్రి	97,580 ▲	89,450 ▲	98,400 ▲
ప్రొద్దుటూరు	95,900 ▲	88,230 ▲	98,500 ▲
ముంబై	94,910 ▲	86,940 ▲	95,150 ▼

బిల్ టు, షిప్ టు అంటే?

ఇటీ GST


రాంబాబు గొండాల

కిరణ్ ఖమ్మంలో ఒక ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ దుకాణం నిర్వహిస్తున్నాడు. సాధారణంగా తనకు కావాల్సిన సరుకును హైదరాబాద్‌లోని హోల్‌సేల్ వ్యాపారి నుంచి తెప్పించుకుంటాడు. సదరు హోల్‌సేల్ వ్యాపారి సాధారణంగా సరుకును తమ వద్ద నుంచే కిరణ్‌కు నేరుగా పంపుతుంటాడు. ఒక సందర్భంలో కిరణ్ కొంత సరుకును అత్యవసరంగా పంపాలని కోరటం జరిగింది. సమయానికి సదరు హోల్‌సేల్ వ్యాపారి వద్ద కిరణ్ అడిగిన వస్తువులు అందుబాటులో లేవు. సాధారణంగా వ్యాపారస్తులు తమ కస్టమర్లు అడిగిన సరుకు తమ వద్ద లేకపోతే వేరే చోట నుంచి తామే తెప్పించి ఇస్తుంటారు. అంతేగానీ ఆర్డర్‌ను రద్దు చేసుకోరు. సరుకు అదే ఊరిలోని వేరే దుకాణంలో కొన్నప్పటికీ ముందుగా తమ వద్దకు తెచ్చుకుని తమ ద్వారానే రవాణా జరిగేట్లు చూసుకుంటారు. అయితే ఈసారి ఆర్డర్‌లోని వస్తువులు తమ వద్ద లేకపోవటంతో పాటుగా డెలివరీ అత్యవసరం కావటంతో హైదరాబాద్ వ్యాపారి ఆ సరుకును విజయవాడలో తనకు పరిచయం ఉన్న మరొక హోల్‌సేల్ దుకాణం నుంచి సర్దుబాటు చేయటం జరిగింది. అంటే కిరణ్ ఆర్డర్ పెట్టింది హైదరాబాద్ వ్యాపారికి. కాగా సరుకు విజయవాడ నుంచి వస్తుంది. అయితే, కిరణ్‌కు విజయవాడ వ్యాపారికి ఎలాంటి సంబంధం లేదు. తాను చెల్లించాల్సిన మొత్తం హైదరాబాద్ వ్యాపారికే చెల్లిస్తాడు. తనకు సరుకు అందించాల్సిన బాధ్యత కూడా హైదరాబాద్ వ్యాపారిదే. కాబట్టి సరుకు విజయవాడ నుంచి వచ్చినప్పటికీ, కిరణ్‌కు ఇవ్వాల్సిన ఇన్వాయిస్ హైదరాబాద్ వ్యాపారే ఇవ్వాలి. అలాగే విజయవాడ వ్యాపారికి సంబంధించి తనకు కిరణ్‌తో ఎలాంటి సంబంధం లేదు. తనకు రావాల్సిన మొత్తం హైదరాబాద్ వ్యాపారి నుంచే రావాలి. ఇన్వాయిస్ కూడా హైదరాబాద్ వ్యాపారి పేరు మీదే ఇస్తాడు. మరి ఇలాంటప్పుడు సరుకు ఎలా పంపాలి?

అంటే విజయవాడ నుంచి హైదరాబాద్ పోయి అక్కడి నుంచి తిరిగి ఖమ్మం రావటానికి రవాణా ఖర్చులు అధికం కావటమే కాకుండా సమయం కూడా వృథా అవుతుంది. కాబట్టి హైదరాబాద్ వ్యాపారి ఆ సరుకును నేరుగా ఖమ్మం పంపేటట్లు విజయవాడ వ్యాపారికి తగు ఆదేశాలు ఇచ్చాడు. మరి ఈ లావాదేవీని జీఎస్‌టీలో ఎలా చూపాలి?

ఈ విధమైన లావాదేవీలు వ్యాపార వర్గాల్లో సర్వసాధారణం. అంటే ఆర్డర్ ఒకరికి ఇస్తే సరుకు వేరొక చోటు నుంచి రావచ్చు. ఒక్కొక్కసారి సరుకు నేరుగా అంతిమ కొనుగోలుదారునికి డెలివరీ జరిగినప్పటికీ మధ్యలో చాలా మంది ఉండవచ్చు. ఇలాంటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని జీఎస్‌టీలో ఒక వెసులుబాటు కల్పించటం జరిగింది. దీన్నే 'బిల్ టు, షిప్ టు' అని అంటారు. అంటే సరుకు ఎవరికి అమ్ముతున్నారో బిల్ లేదా ఇన్వాయిస్ వారి పేరు మీద ఇవ్వటం జరుగుతుంది. దాన్ని 'బిల్ టు' అంటారు. సరుకు డెలివరీ జరిగే ప్రదేశాన్ని 'షిప్ టు' అంటారు. అయితే దీన్ని జాగ్రత్తగా అమలు చేయాల్సి ఉంటుంది.

అంటే ఈ విధానంలో ముందుగా ఒక లావాదేవీకి సంబంధించి నిజమైన అమ్మకందారుడు, కొనుగోలుదారుడిని గుర్తించాలి. దాన్ని బట్టి ఆ సరఫరా రాష్ట్ర అంతర్గత సరఫరా లేదా అంతర్ రాష్ట్ర సరఫరానా అనేది గుర్తించాలి. ఎందుకంటే దాన్ని బట్టే వర్తకుడు ఐజీఎస్‌టీ చెల్లించాలా లేదా సీజీఎస్‌టీ, ఎస్‌జీఎస్‌టీ చెల్లించాలా? అనేది దీన్ని బట్టే నిర్ణయించాలి.

పై ఉదాహరణలో సరుకు విజయవాడ నుంచి వచ్చినప్పటికీ, కిరణ్‌కు సంబంధించి అమ్మకందారుడు హైదరాబాద్ వ్యాపారే. అంటే హైదరాబాద్ వ్యాపారి.. ఖమ్మంలోని కిరణ్‌కు సరుకు అమ్ముతున్నట్లు లెక్క (సరుకు ఎక్కడ నుంచి వచ్చినప్పటికీ). కాబట్టి, హైదరాబాద్ వ్యాపారి ఖమ్మంలోని కిరణ్ పేరు మీద ఇన్వాయిస్ జారీ చేయాలి. ఈ రెండు ప్రదేశాలు తెలంగాణలోనే ఉన్నాయి కాబట్టి ఈ సరఫరా రాష్ట్ర అంతర్గత సరఫరా కింద భావించి సీజీఎస్‌టీ, ఎస్‌జీఎస్‌టీ చెల్లించాల్సి ఉంటుంది. అలాగే విజయవాడ వ్యాపారికి సంబంధించి కొనుగోలుదారుడు హైదరాబాద్ వ్యాపారి అవుతాడు (సరుకు ఎక్కడకు పంపినప్పటికీ). కాబట్టి హైదరాబాద్ వ్యాపారి పేరు మీద ఇన్వాయిస్ జారీ చేయాలి. అంటే లెక్క ప్రకారం సరుకు విజయవాడ నుంచి హైదరాబాద్‌కు వస్తున్నట్లుగా భావించాలి. ఈ రెండు ప్రదేశాలు వేర్వేరు రాష్ట్రాల్లో ఉన్నాయి. కాబట్టి ఐజీఎస్‌టీ చెల్లించాలి. తాను ఇచ్చే ఇన్వాయిస్ మీద 'బిల్ టు' లో హైదరాబాద్ వ్యాపారి పేరు, చిరునామా చూపాలి. 'షిప్ టు'లో కిరణ్ చిరునామా చూపాలి. అలాగే ఈ-వే బిల్ జారీ చేయాల్సి వస్తే, అందులో కూడా బిల్ టు, షిప్ టు విధిగా చూపాలి. విజయవాడ వ్యాపారి ఇచ్చిన ఇన్వాయిస్ ఆధారంగా హైదరాబాద్ వ్యాపారి ఐటీసీ తీసుకోవాల్సి ఉండగా, హైదరాబాద్ వ్యాపారి ఇచ్చిన ఇన్వాయిస్ ఆధారంగా కిరణ్ ఐటీసీ తీసుకోవాల్సి ఉంటుంది.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
9
ఎన్.టి.ఆర్ జిల్లా వార్తలు
ఆదివారం 20 ఏప్రిల్ 2025

ప్రధానమైన కేసుల్లో పోలీసులకు కీలక ఆధారంగా పనిచేసే సీసీ కెమెరాలు.. ఉన్నట్టుండి పనిచేయకపోతే పరిస్థితి ఏమిటి? ఏదైనా ఘటన జరిగిన తర్వాత సీసీ కెమెరాలు పనిచేయడం లేదన్న విషయాన్ని తెలుసుకోవడం కంటే.. అంతకుముందే ఆ విషయాన్ని పసిగట్టడం మేలని పోలీసులు నిర్ణయించారు. దీనికోసం ప్రత్యేకంగా డాష్‌బోర్డు అనే సాఫ్ట్‌వేర్‌ను సిద్ధం చేస్తున్నారు. నగరంతో పాటు జిల్లాలో ఉన్న నిఘా నేత్రాలు సక్రమంగా పనిచేస్తున్నాయా లేదా అనే అంశాలను అధికారులు ఈ డాష్‌బోర్డు ద్వారా గుర్తించి వెంటనే మరమ్మతులు చేయిస్తారు.



పచ్చదనానికి ప్రతిజ్ఞ

స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో శనివారం బెంజిసర్కిల్‌లోని నారా చంద్రబాబు నాయుడు కాలనీలో ఈ-వ్యర్థాల స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. కలెక్టర్ లక్ష్మీశ, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ముఖ్య అతిథులుగా పాల్గొని స్థానికుల నుంచి ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సేకరించారు. స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు.

12లో

పనిలో పనిఘా

పోలీసు కమిషనరేట్ పరిధిలో సీసీ కెమెరాలపై సరికొత్త పర్యవేక్షణ

డాష్‌బోర్డు అనే సాఫ్ట్‌వేర్‌కు అనుసంధానం

- ప్రభుత్వ, ప్రైవేట్ కెమెరాలన్నింటిపై నిఘా
- రిపేరైతే వెంటనే పరిష్కరించేలా ప్రణాళిక
- **స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, హోంగార్డులకు బాధ్యతలు**



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : పోలీసు కమిషనరేట్ పరిధిలో మొత్తం సుమారు 5 వేల నుంచి 6 వేల వరకు సీసీ కెమెరాలు ఉన్నాయి. సురక్ష పథకంలో భాగంగా విస్తృతంగా ఈ కెమెరాలను ఏర్పాటు చేయించారు. ఈ ప్రాజెక్టును నిరంతరం కొనసాగించాలని పోలీసు అధికారులు భావిస్తున్నారు. కమిషనరేట్ పరిధిలో మొత్తం 10 వేల నుంచి 15 వేల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రజల్లో సీసీ కెమెరాల ఏర్పాటుపై చైతన్యం తీసుకురావడానికి ఒక సీసీ కెమెరాను ఉచితంగా ఇస్తామని ఆఫర్ కూడా ప్రకటించారు. దీంతో అపార్టుమెంట్లు, కాలనీలు, వీధుల్లో విస్తృతంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. నగరాన్ని భద్రతా వలయంలో పెట్టడానికి పోలీసు అధికారులు మూడు దశలుగా ప్రాజెక్టును అమలు చేయాలని నిర్ణయించారు. మొదటి దశలో కమ్యూనిటీ సీసీ కెమెరాల వ్యవస్థ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే కాలనీలు, సంక్షేమ సంఘాల ద్వారా నిధులను సమీకరించి 2,500 కెమెరాలను నగరంలో ఏర్పాటు చేయించారు.

డాష్‌లో పూర్తి సమాచారం

జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఎన్నెన్ని సీసీ కెమెరాలు ఉన్నాయో గణాంకాలను రూపొందించారు. ఇంకా ఎక్కడెక్కడ ఏర్పాటు చేయాలో ప్రదేశాలను గుర్తిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం ప్రవేశ మార్గంలో ఒకటి, గ్రామం నుంచి బయటకు వెళ్లే మార్గంలో ఒకటి కచ్చితంగా ఏర్పాటు చేస్తున్నారు. ఇదికాకుండా గ్రామంలోని ముఖ్యమైన కూడలి వద్ద మొత్తం ప్రదేశం కనిపించేలా మరో కెమెరాను సిద్ధం చేస్తున్నారు. ఇలా జిల్లాలోని 5 వేల నుంచి 6 వేల సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయా లేదా అని తెలుసుకునేందుకు ప్రత్యేకంగా డాష్‌బోర్డును రూపొందిస్తున్నారు. ఇందులో పోలీస్‌స్టేషన్ వారీ ఎన్ని కెమెరాలు ఉన్నాయి, వాటిలో ఎన్ని పనిచేస్తున్నాయి, ఎన్ని పనిచేయడం లేదన్న వివరాలు తెలిసిపోతాయి. పని చేయలేని కెమెరా ఏ ప్రాంతంలో ఉందో డాష్‌బోర్డులో స్పష్టంగా తెలుస్తుంది. ఇలా పనిచేయని కెమెరాలను పని చేయించే బాధ్యత సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లపై ఉంటుంది. వీటిని బాగు చేయడానికి ఒక హోంగార్డును నియమిస్తారు. ఇప్పటి వరకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు సాంకేతిక లోపంతో పనిచేయకపోతే సంబంధిత కాంట్రాక్టర్లు బిల్లులు చెల్లించలేని వాటిని అలాగే వదిలేసే వారు. పోలీసు శాఖ ఎన్నిసార్లు లేఖలు రాసినా స్పందించేవారు కాదు. ఇలాంటి సమస్య రాకుండా సాంకేతికంగా పట్టున్న హోంగార్డులను ఎంపిక చేసి వారికి మరింత నైపుణ్య మెలకువలను నేర్పుతారు. సీసీ కెమెరాలను సరిచేయడానికి అవసరమైన పరికరాలను సమకూర్చుతారు. కమిషనరేట్ పరిధిలో ఎక్కడ సీసీ కెమెరా పనిచేయకపోయినా ఈ హోంగార్డు సరంజామాతో వెళ్లి సరి చేయాల్సి ఉంటుంది. దీనివల్ల బయట నిపుణులపై ఆధారపడాల్సిన అవసరం ఉండదని అధికారులు భావిస్తున్నారు.

ఉమ్మడి కృష్ణాకు 1,213 పోస్టులు

మెగా డీఎస్సీకి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్.. నేడే నోటిఫికేషన్

- **ప్రభుత్వ, జడ్పీ, ఎంఈపీ, మునిసిపల్ స్కూళ్లలో 1,208 పోస్టులు**
- **ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలలో 5 పోస్టుల భర్తీ**
- **ప్రభుత్వ నిర్ణయంపై నిరుద్యోగుల హర్షాతిరేకాలు**

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/మచిలీపట్నం) : ఉమ్మడి కృష్ణాజిల్లాలో మెగా డీఎస్సీ-2025 ద్వారా మొత్తం 1,213 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు ఆదివారం నోటిఫికేషన్ విడుదల కానుంది. పాఠశాల విద్యాశాఖ పరిధిలో 1,208 ఉపాధ్యాయ పోస్టులు, ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలల విభాగంలో 5 ఉపాధ్యాయ పోస్టులను కలిపి మొత్తం 1,213 పోస్టులకు అవకాశం కల్పించింది. పాఠశాల విద్యాశాఖ పరిధిలో ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మునిసిపల్ పాఠశాలల్లో పనిచేసేందుకు జారీ చేసిన 1,208 పోస్టుల్లో లాంగ్వేజీ-1 (తెలుగు)- 39 పోస్టులు, హిందీ- 25 పోస్టులు, ఇంగ్లీషు- 93 పోస్టులు, గణితం- 52 పోస్టులు, ఫిజికల్ సైన్స్- 54 పోస్టులు, బయాలజికల్ సైన్స్- 142 పోస్టులు, సోషల్- 135 పోస్టులు, ఫిజికల్ ఎడ్యుకేషన్- 123 పోస్టులు, సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్‌జీటీ) టీచర్లు- 545 పోస్టుల ప్రాతిపదికన నోటిఫికేషన్ జారీ కానుంది. ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయ పోస్టులకు సంబంధించి ఉమ్మడి కృష్ణాజిల్లాకు ఇంగ్లీషు- 1, ఫిజికల్ సైన్స్- 1, బయాలజికల్ సైన్స్- 1, ఎస్‌జీటీలు- 2 చొప్పున నోటిఫికేషన్ ఇవ్వనున్నారు.

ఐదేళ్ల కల నెరవేరిన వేళ

ఉమ్మడి కృష్ణా జిల్లావ్యాప్తంగా నిరుద్యోగులుగా ఉన్న బీఈడీ, డీఈడీ అభ్యర్థులు ఐదేళ్లుగా డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారు. కిందటి వైసీపీ ప్రభుత్వం మాయమాటలు చెప్పి నిరుద్యోగుల మిగతా 10లో..

అవినీతి అధికారి.. దారి దోపిడీ

ఉమ్మడి కృష్ణాజిల్లాను దోచేస్తున్న రవాణాధికారి

రవాణా శాఖలో ఆయనొక బాస్. అంతకువిుంచి వసూల్ రాజా అంటే సరిగ్గా సరిపోతుంది. కలెక్షన్ల కోసం ఏజెంట్లనే నియమించుకున్న లంచాల ఘనాపాటి ఆయన. ఎన్టీఆర్ జిల్లాలో ఎక్కువగా దందా చేస్తే తెలిసిపోతుందని.. కృష్ణాజిల్లాపై పడ్డాడు. మచిలీపట్నం, గుడివాడ, ఉయ్యూరు కేంద్రంగా కలెక్షన్ ఏజెంట్లను పెట్టుకుని విచ్చలవిడిగా వసూళ్లకు తెరలేపాడు. ఈ అధికారి దెబ్బతో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు.. వాహనదారులపై పడి అందినకాడికి దోచేస్తున్నారు.

- **మచిలీపట్నం, గుడివాడ, ఉయ్యూరులో కలెక్షన్ ఏజెంట్లు**
- **జగ్గయ్యపేట, నందిగామ ప్రాంతాల్లోనూ నియామకం**
- **సహాయ, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లతోనే దందా**
- **గన్నవరంలో ప్రైవేట్ వ్యక్తికి బాధ్యతలు.. హల్‌చల్**
- **ఇసుక, మెటల్ లారీల నుంచి దండిగా వసూళ్లు**
- **ట్రాక్టర్ ట్రక్కులను ఏమార్చి మస్తుగా మామూళ్లు**



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రవాణా శాఖలోని ఓ రాష్ట్రస్థాయి అధికారి ఉమ్మడి కృష్ణాజిల్లాలో వాహనాల నుంచి భారీగా మింగుతున్నారు. ఈ సార్ నిర్దేశిస్తున్న టార్గెట్లు చేరుకోవడానికి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ల (ఎంవీఐ) అసోసియేషన్లు సమావేశాలు కూడా నిర్వహించుకునే పరిస్థితి ఏర్పడిందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతుంది.

మచిలీపట్నంలో మామూళ్లు

మచిలీపట్నంలో ఒక ఎంవీఐను కలెక్షన్ ఏజెంట్‌గా పెట్టుకున్నారు. డీటీవో పరిధిలోని ఇసుక లారీలకు, పోర్టుకు వెళ్లే మెటల్, గ్రావెల్ లారీలకు నెల వారీ మామూళ్లు పెట్టేశారు. ఈ మామూళ్లకు సహకరించని వారిపై ఓవర్‌లోడ్ పేరుతో కేసులు రాస్తున్నారు. జరిమానాలు విధిస్తున్నారు. ఈ మామూళ్లపై మొదట్లో మెటల్ లారీ యజమానులు ఎదురుతిరిగారు. దీంతో వరుసగా లారీలను అడ్డుకుంటూ జరిమానాల మోత మోగించారు. ఈ దెబ్బతో లారీ యజమానులు మామూళ్లు ఇవ్వడానికి అంగీకరించారు. అడిగినంత ముట్టజెబుతున్నామని ఓవర్ లోడ్‌తో రాకపోకలు సాగిస్తున్నారు. రోజురోజుకూ కలెక్షన్ పెరగడంతో సదరు సార్.. టార్గెట్లు మరింత పెంచారు. దీంతో కలెక్షన్ ఏజెంట్ ట్రాక్టర్ల ట్రక్కులపై మిగతా 10లో..

కలెక్షన్ ఏజెంట్లకు సార్ అభయం

తన కోసం కలెక్షన్ ఏజెంట్లుగా మారిన కొందరు అవినీతి ఇన్‌స్పెక్టర్లకు సార్.. అండగా ఉంటారు. వారెన్ని తప్పులు చేసినా కాచుకుంటారు. రెడ్‌హ్యాండెడ్‌గా దొరికినా సరే.. వారికి సంబంధించిన ఫైల్‌ను హెడ్డాఫీసుకు పంపరు. వారిపై విచారణ నివేదికలను తొక్కి పట్టేస్తారు. దీంతో కలెక్షన్ ఏజెంట్లు విచ్చలవిడి దోపిడీకి పాల్పడుతున్నారు. బాస్ అండతో కొందరు అవినీతి ఇన్‌స్పెక్టర్లు హైవేలు, టోల్‌గేట్ల దగ్గర ప్రైవేట్ సిబ్బందిని పెట్టుకుని వసూలు చేస్తున్నారు. ప్రైవేట్ బస్సుల యాజమానుల నుంచి నెలవారీ మామూళ్లను నిర్దేశించుకోవడంతో వారి జోలికి వెళ్లరు. పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చే లారీలనే లక్ష్యంగా చేసుకుని అందినకాడికి దోచుకుంటున్నారు.

గొల్లపూడిలో క్లోవర్ లీఫ్

హైదరాబాద్-విజయవాడ 6 వరసల విస్తరణకు డీపీఆర్

- **గొల్లపూడి వద్ద క్లోవర్ లీఫ్ జంక్షన్ ఏర్పాటుకు ప్రతిపాదన**
- **ఇంతకుముందు రింగ్ జంక్షన్ ఏర్పాటు చేయాలని సర్వే**
- **తెరపైకి క్లోవర్ లీఫ్ రావడంతో గొల్లపూడి ట్రాఫిక్‌కు రిలీఫ్**

16, 65 నెంబర్ జాతీయ రహదారులు అనుసంధానమయ్యే చోట గొల్లపూడిలో 'క్లోవర్ లీఫ్' జంక్షన్ ఏర్పాటు దిశగా అడుగులు పడుతున్నాయి. రెండు ప్రధాన జాతీయ రహదారులు అనుసంధానమయ్యే చోట క్లోవర్ లీఫ్ లేకపోతే ట్రాఫిక్ సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఓ సర్వే తెలియజేయడంతో అధికారులు ఆ దిశగా ఆలోచనలు చేస్తున్నారు.



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : హైదరాబాద్-విజయవాడ ఎన్‌హెచ్-65ను ఆరు వరసలుగా విస్తరించటానికి డీపీఆర్ రూపకల్పన చేస్తున్న నేపథ్యంలో.. గొల్లపూడిలో విజయవాడ వెస్ట్ బైపాస్ అనుసంధానం అయ్యేచోట క్లోవర్ లీఫ్ జంక్షన్ ఏర్పాటు చేయాలని ఆలోచన చేస్తున్నారు. ఈ ప్రాంతంలో రింగ్ జంక్షన్‌ను అభివృద్ధి చేయాలని ఎన్‌హెచ్ అధికారులు ఇంతకుముందే నిర్ణయించారు. ఈ రింగ్‌ను ఏ విధంగా అభివృద్ధి చేయాలన్న దానిపై కన్సల్టెంట్‌ను కూడా నియమించారు. ఇదే సమయంలో హైదరాబాద్-విజయవాడ 6 వరసల విస్తరణకు సంబంధించి డీపీఆర్ రూపకల్పన జరుగుతుండటంతో క్లోవర్ లీఫ్ ప్రతిపాదన ముందుకొచ్చింది.

రింగ్ పోయె.. క్లోవర్ లీఫ్ వచ్చే..

విజయవాడ పశ్చిమ బైపాస్ రోడ్డు.. చిన్న అవుటపల్లి దగ్గర ఎన్‌హెచ్-16 నుంచి మర్లపాలెం, గన్నవరం, కొండపావులూరు, మిగతా 10లో..

ముంబయికి క్రేజ్

- **ఇప్పటికే ఎయిరిండియా, ఇండిగో సర్వీసులు**
- **తాజాగా మరో సర్వీసుకు ఎయిరిండియా సన్నాహాలు**

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ విమానాశ్రయం నుంచి దేశ ఆర్థిక రాజధాని ముంబయికి మరిన్ని సర్వీసులు నడపడానికి విమానయాన సంస్థలు పోటీ పడుతున్నాయి. విజయవాడ-ముంబాయికి మొదటిసారిగా ఎయిరిండియా సర్వీసును ప్రారంభించింది. కాగా, ప్రస్తుతం ముంబయికి వ్యాపారవేత్తలు ఎక్కువగా క్యూ కడుతున్న నేపథ్యంలో ఇండిగో ఎయిర్‌లైన్స్ మరో సర్వీసును ప్రారంభించింది. ఈ రెండు విమానాలకు డిమాండ్ ఉండటంతో ఎయిరిండియా తన రెండో సర్వీసును నడపాలని యోచిస్తోంది. మే 1 నుంచి ముంబయికి రెండో సర్వీసును నడపనున్నట్టు విమానాశ్రయ అధికారులకు సమాచారం పంపింది. అయితే, ఈ ప్రతిపాదనను రద్దు చేసుకున్నప్పటికీ త్వరలో ఎయిరిండియా రెండో సర్వీసు నడిచే అవకాశాలు ఉన్నాయి. ముంబయికి వెళ్లేవారిలో ఎక్కువగా వర్తక, వ్యాపారులు, విద్యార్థులు, పర్యాటకులు ఉంటుండటంతో పోటీ ఎక్కువైంది.

ఐటీ @ జగ్గయ్యపేట

ఐటీ పరిశ్రమల కోసం జగ్గయ్యపేటలో భూముల అన్వేషణ

1,000 ఎకరాలను పరిశీలిస్తున్న జిల్లా యంత్రాంగం

- **డిఫెన్స్ పరిశ్రమల కోసం మరో 100 ఎకరాలు**
- **హైదరాబాద్‌కు దగ్గరగా ఉండటం వల్లే ఎంపిక**

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : జగ్గయ్యపేటలో డిఫెన్స్, ఐటీ పరిశ్రమల ఏర్పాటు కోసం జిల్లా యంత్రాంగం భారీ ఎత్తున భూములను సేకరించేందుకు చర్యలు చేపడుతోంది. డీఆర్‌డీవో అనుబంధ డిఫెన్స్ ఆధారిత పరిశ్రమల కోసం 100 ఎకరాలు సేకరించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్థల పరిశీలన చేయమని ఆదేశాలు రావటంతో జిల్లా యంత్రాంగం ఆ పనిలో నిమగ్నమైంది. దీంతో పాటు ఐటీ, ఐటీ ఆధారిత పరిశ్రమల కోసం మరో 1,000 ఎకరాలు కూడా చూడాలని ప్రభుత్వం నుంచి సంకేతాలు వచ్చాయి.

ఇక్కడే ఎందుకు..?

ఐటీ, డిఫెన్స్ పరిశ్రమల కోసం జగ్గయ్యపేటను ఎందుకు ఎంచుకున్నారన్న దానిపై ఆసక్తి నెలకొంది. జగ్గయ్యపేట ప్రాంతం హైదరాబాద్‌కు దగ్గరగా ఉంటుంది. దీనికితోడు రాజధాని అమరావతికి గేట్‌వేగా పశ్చిమ ఎన్టీఆర్ జిల్లాలో మూలపాడు నుంచి కృష్ణానది మీదుగా ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి వచ్చేవారు మూలపాడు నుంచి ఐకానిక్ బ్రిడ్జి మీదుగా అమరావతికి చేరుకోవచ్చు. ఈ నేపథ్యంలో అటు హైదరాబాద్, ఇటు అమరావతి నడుమ భూములను పరిశీలిస్తే ఐటీ పరిశ్రమలను కేంద్రీకృతం చేయవచ్చన్నది ప్రభుత్వ ఆలోచన.

నియోజకవర్గాల్లో ఇండస్ట్రియల్ పార్కులు!

* ఉమ్మడి కృష్ణాజిల్లాలో రెండు చోట్ల ఎంఎస్ఎంఈ ఐపీల ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు
* గన్నవరం నియోజకవర్గం వీరపనేనిగూడెం, జగ్గయ్యపేట నియోజకవర్గం జయంతిపురం గ్రామాలు ఎంపిక
* ఒక్కో చోట 20 నుంచి 50 వరకు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పారిశ్రామిక యూనిట్లు ఏర్పాటు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఉమ్మడి కృష్ణాజిల్లాలో నియోజకవర్గ ఎంఎస్ఎంఈ ఇండస్ట్రియల్ పార్క్స్ (ఐపీ)లను ఏపీఐఐసీ అధికారులు ఖరారు చేశారు. ప్రతి నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఈ ఐపీ ఏర్పాటు చేసి స్థానికంగా ఉన్న వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఏపీఐఐసీకి లక్ష్యాన్ని నిర్దేశించింది. తొలి విడతగా 50 ఎంఎస్ఎంఈ ఐపీల ఏర్పాటు చేయాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి కృష్ణాజిల్లాలో రెండు ఎంఎస్ఎంఈ ఐపీలను ఏర్పాటు చేయాలని ఏపీఐఐసీ అధికారులు నిర్ణయించారు. ప్రతి ఎంఎస్ఎంఈ ఐపీ కోసం 20 ఎకరాలు తక్కువ కాకుండా చూడాల్సిందిగా ప్రభుత్వం నిర్దేశించటంతో ఆ మేరకు చర్యలు చేపట్టారు. కృష్ణాజిల్లాలో గన్నవరం నియోజకవర్గం వీరపనేనిగూడెం ఇండస్ట్రియల్ పార్క్ వెంబడే ఫేజ్-3లో ఎంఎస్ఎంఈ ఐపీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అవసరమైన భూముల లభ్యత ఇక్కడ ఉండటం వల్ల దీనిని అనువైనదిగా ప్రతిపాదించారు. ఎన్టీఆర్ జిల్లాలో జగ్గయ్యపేట నియోజకవర్గంలోని జయంతిపురం గ్రామంలో ఎంఎస్ఎంఈ ఐపీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇక్కడ ఏపీఐఐసీ పెద్దగా కష్టపడకుండానే భూములు అందుబాటులో ఉన్నాయి. ఈ భూముల దగ్గరకు చేరుకోవటానికి సరైన దారి లేదు. ఈ దారి సమస్యను ఏపీఐఐసీ అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లారు. ప్రభుత్వం కనుక రహదారి పనులకు శాంక్షన్ ఇచ్చి.. భూసేకరణ చేయిస్తే జయంతి పురం ఎంఎస్ఎంఈ ఐపీకి ఢోకా లేనట్టే. తొలి దశలో ఈ రెండు చోట్ల ఎంఎస్ఎంఈ ఐపీలను ఏర్పాటు చేయాలని ఏపీఐఐసీ అధికారులు కృతనిశ్చయంతో ఉన్నారు. ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లిన నేపథ్యంలో అనుమతులు రాగానే తదుపరి ప్రక్రియను చేపట్టనున్నారు. నియోజకవర్గానికి చెందిన ప్రజలకే ఈ ఎంఎస్ఎంఈ ఐపీలలో స్థానం కల్పిస్తారు. ఒక్కో ఎంఎస్ఎంఈలో సగటున 20 నుంచి 50 వరకు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పారిశ్రామిక యూనిట్లను ఏర్పాటు చేయించనున్నారు. భౌగోళికంగా అనువైన యూనిట్లకే అవకాశం కల్పించాలని ఏపీఐఐసీ అధికారులు నిర్ణయించారు.

సాగరంలోకి 342 తాబేళ్ల పిల్లలు

* ఆలివ్ రిడ్లేలను సముద్రంలో విడిచిపెట్టిన జేసీ గీతాంజలి శర్మ



ఆలివ్ రిడ్లే పిల్లలను తీసుకెళ్తున్న జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ

కోడూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): అరుదైన ఆలివ్ రిడ్లే తాబేలు పిల్లలను జిల్లా కలెక్టర్ గీతాంజలి శర్మ సాగరంలోకి వదిలిపెట్టారు. శనివారం కుటుంబసమేతంగా హంసలదీవి శివారు పాలకాయితిప్ప బీచ్ వద్ద అటవీ శాఖ వారి సంరక్షణలో ఉన్న గుడ్ల సేకరణ, పునరుత్పత్తి కేంద్రాన్ని జేసీ సందర్శించారు. తాబేళ్ల గుడ్లను సేకరించి కృత్రిమంగా 45 రోజులు పొదిగించి 342 తాబేళ్ల పిల్లలను సిద్ధం చేశారు. వీటిని జేసీ కుటుంబసభ్యులతో కలసి సముద్రంలోకి విడిచిపెట్టారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఆలివ్ రిడ్లే తాబేళ్ల పరిరక్షణ మన అందరి బాధ్యత అని జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ అన్నారు. సముద్రంలోని వ్యర్థాలను, కలుపు మొక్కలను తింటూ సముద్రపు నీరు కలుషితం కాకుండా ఉండేందుకు ఈ తాబేళ్లు దోహదపడతాయన్నారు. జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ విజయ మాట్లాడుతూ గత జనవరి నుంచి 50 వేల తాబేళ్ల గుడ్లను సేకరించి పాలకాయితిప్ప తాబేళ్ల పునరుత్పత్తి కేంద్రం వద్ద పొదిగించామని తెలిపారు. ఇప్పటి వరకు సుమారు తొమ్మిది వేల తాబేళ్ల పిల్లలను సముద్రంలోకి విడిచిపెట్టామన్నారు. ఈ కార్యక్రమంలో మెరైన్ ఎస్ఐ పూర్ణ మాధురి, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ నాగమణి పాల్గొన్నారు. అనంతరం జేసీ గీతాంజలి శర్మ హంసలదీవి కృష్ణ పవిత్ర సంగమం ప్రదేశాన్ని సందర్శించారు.

ఫైనల్‌కు అమరావతి, రాజధాని మీడియా జట్లు

* ఉత్సాహంగా అమరావతి జర్నలిస్టు క్రికెట్ లీగ్ టోర్నమెంట్
* ముగిసి సెమీ ఫైనల్ మ్యాచ్‌లు



సెమీ ఫైనల్‌లో విజయం సాధించిన రాజధాని మీడియా జట్టు

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మూలపాడు ఏసీఏ క్రికెట్ గ్రౌండ్‌లో అమరావతి జర్నలిస్టు క్రికెట్ లీగ్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. రెండో రోజు శనివారం బి.గ్రౌండ్‌లో జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన విజయవాడ మీడియా జట్టు నిర్ణీత 20 ఓవర్లో 8 వికెట్ల నష్టానికి 148 పరుగులు చేసింది. 149 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన రాజధాని మీడియా జట్టు 18.1 ఓవర్లలోనే ఐదు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించి ఫైనల్‌కు చేరింది. ఏ.గ్రౌండ్‌లో జరిగిన మరో సెమీ ఫైనల్ మ్యాచ్ ఆలస్యం కారణంగా 12 ఓవర్లకే కుదించారు. ముందుగా బ్యాటింగ్ చేసిన రాయుడు మీడియా జట్టు నాలుగు వికెట్లు కోల్పోయి 112 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన అమరావతి మీడియా జట్టు 113 పరుగుల లక్ష్యాన్ని ఛేదించి ఫైనల్‌కు చేరింది. కేవలం ఒకే ఒక్క బాల్ విగిలి ఉండగా అమరావతి మీడియా జట్టు విజయం సాధించడం విశేషం. ఆదివారం అమరావతి మీడియా, రాజధాని మీడియా జట్ల మధ్య ఫైనల్ పోరు జరుగనుంది.

సంపద సృష్టికర్త సీఎం చంద్రబాబు

ఎంపీ కేశినేని శివనాథ్



వన్‌టౌన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): సంపద సృష్టికర్త సీఎం చంద్రబాబు అని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. సీఎం చంద్రబాబు పుట్టిన రోజును పురస్కరించుకుని ఎంపీ శివనాథ్ ముందస్తు శుభాకాంక్షలు తెలియజేస్తూ శనివారం ప్రకటన విడుదల చేశారు. చంద్రబాబు సంపద సృష్టికర్త, స్వర్ణాంధ్ర రథసారధి అని కొనియాడారు. ఆయన మాత్రమే భావి తరాలకు బంగారు భవిష్యత్తును అందించే ముఖ్యమంత్రి అని చెప్పారు. తెలుగు జాతిని ప్రపంచంలోనే నంబర్ వన్‌గా ఉంచటంతో పాటు, దేశంలోనే అగ్రగామిగా ఆంధ్రప్రదేశ్‌ను ఉంచాలన్న సంకల్పంతో స్వర్ణాంధ్ర విజన్ 2047 సాధన కోసం చంద్రబాబు ప్రణాళిక రూపొందించారన్నారు. పి-4 విధానంతో సమాజంలో ఆర్థిక అసమానతలు తగ్గించి పేదరిక నిర్మూలనకు సంకల్పించారన్నారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా అలుపెరగని కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఐటీ, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి, యువతకు ఉద్యోగ అవకాశాల కోసం పేదరిక నిర్మూలనకు రాత్రి, పగలు శ్రమిస్తున్న మహోన్నత నేత చంద్రబాబు అన్నారు.

'ఈ-వేస్ట్' నిర్ణయం విప్లవాత్మకం

-గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



గన్నవరం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): దేశానికే సవాల్‌గా మారుతున్న ఈ-వేస్ట్‌ను నియంత్రించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకున్న నిర్ణయం విప్లవాత్మకమని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. ఎలక్ట్రానిక్స్ వ్యర్థాలు ఎక్కువ కలిగిన దేశాల్లో చైనా మొదటి స్థానంలో ఉంటే, అమెరికా రెండవ స్థానంలో, మన దేశం మూడవ స్థానంలో ఉందని చెప్పారు. గన్నవరం మండలం బుద్ధవరం గ్రామ పంచాయతీలో శనివారం స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో పాల్గొని ఆయన మీడియాతో మాట్లాడారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాలు సేకరించేందుకు పంచాయతీలోనే సెంటర్‌లు ఏర్పాటు చేసినందుకు ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాలు ఇంట్లో ఉంటే ఎన్నో అనర్థాలు వస్తాయని తెలిపారు.

జేఈఈ మెయిన్స్‌లో శారదా విద్యార్థుల విజయకేతనం



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల ప్రతినిధులు

గాంధీనగర్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్- 2025 ఫలితాల్లో నగరంలోని శారదా జూనియర్ కళాశాల విద్యార్థులు మరోసారి విజయకేతనం ఎగురవేశారు. పసుమర్తి బిందుశ్రీ యశస్విని 88.22 శాతం మార్కులు సాధించి అడ్వాన్స్‌కు అర్హత సాధించింది. ఈమని శాండిల్ ప్రణవ కృష్ణ 83.73 శాతంతో ఉత్తమ పర్సెంటేజ్ సాధించినట్టు కళాశాల సెక్రటరీ కుందా రామనారాయణ, కరస్పాండెంట్ ఎస్.ఎన్.వీ. వరప్రసాద్ తెలిపారు. గాంధీనగర్‌లోని కళాశాలలో విద్యార్థులను శనివారం అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, విట్ వంటి ప్రఖ్యాత ఇంజనీరింగ్ కళాశాలలో సీటు పొంది కళాశాలకు మంచి పేరు తెచ్చారన్నారు. ప్రిన్సిపల్ లుక్కా శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపులో ఉద్రిక్తత

* తన భూమి ఖాళీ చేయాలని యంత్రాలతో వెళ్లిన జనసేన నేత ఉదయభాను
* 40 ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నాం.. ఖాళీ చేయబోమన్న ఆక్రమణదారులు
* అధికారుల జోక్యంతో తాత్కాలికంగా సర్దుమణిగిన వివాదం



జేసీబీని అడ్డుకుంటున్న ప్రజలు



మున్సిపల్ చైర్మన్‌కు వివరిస్తున్న మహిళలు

జగ్గయ్యపేట రూరల్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దుర్గాపురంలో జనసేన జిల్లా అధ్యక్షుడు భూమిలో ఆక్రమణల తొలగింపులో ఉద్రిక్తత చోటు చేసుకుంది. జనసేన జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభానుకు చిల్లకల్లు రోడ్డులో ఆర్ఎస్ నెంబర్ 345లో 13.60 ఎకరాల స్థలం ఉంది. ఎఫ్‌లైన్‌కు దరఖాస్తు చేసుకోగా 24 మంది సుమారు 20 సెంట్ల భూమిని ఆక్రమించినట్లు తేలింది. వారిని ఖాళీ చేయాలని కోరగా నెల రోజులు గడువు కోరారు. గడువు పూర్తైన ఖాళీ చేయకపోవటంతో ఉదయభాను స్వయంగా యంత్రాలను పంపి తొలగింపునకు శ్రీకారం చేపట్టటంతో కొందరు తీవ్రంగా వ్యతిరేకించారు. 40 ఏళ్లుగా ఉంటున్నామని అప్పుడు లేనిది ఇప్పుడేంటని ప్రశ్నించారు. తొలగింపు వల్ల మరుగుదొడ్లు, బోర్లు, పోతున్నాయని అభ్యంతరం వ్యక్తం చేశారు. బాధితులు కౌన్సిలర్ అలేఖ్య, సైదాను ఆశ్రయించగా ఆక్రమణలను తొలగించవద్దని కోరారు. జగ్గయ్యపేట పోలీసులు, తహసీల్దార్ మనోహర్, మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్రలు అక్కడకు చేరుకుని బాధితులతో మాట్లాడారు. వారు ఆ స్థలాలకు ఉదయభాను బీఫారం పట్టాలు ఇప్పించారని ఇప్పుడు తనదే అనటం ఏంటన్నారు. మరోసారి కొలతలు వేసి నిర్ధారణకు వచ్చేంత వరకు ఆక్రమణల తొలగింపు నిలుపుదల చేయాలని చెప్పటంతో వివాదం తాత్కాలికంగా సద్దుమణిగింది.

ఉమ్మడి కృష్ణాలో న్యాయాధికారుల బదిలీ

విజయవాడ, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణాజిల్లాలో పలువురు న్యాయాధికారులను బదిలీ చేస్తూ హైకోర్టు శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. మచిలీపట్నం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారి ఎ.పద్మను అనంతపుర ప్రిన్సిపల్ సివిల్ జడ్జి కోర్టుకు, మచిలీపట్నం అదనపు సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారి కె.అరుణను అవనిగడ్డ సివిల్ జడ్జి కోర్టుకు బదిలీ చేశారు. విజయవాడలో మూడో అదనపు సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారి ఆర్.శాంతిశ్రీని శ్రీకాకుళం అదనపు సివిల్ జడ్జి కోర్టుకు మార్చారు. కృష్ణాజిల్లాలోని చీఫ్ జుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయాధికారి ఎస్.రాజశేఖర్‌ను అనంతపురం జిల్లా న్యాయసేవా ప్రాధికార సంస్థ కార్యదర్శిగా బదిలీ చేశారు. మచిలీపట్నంలోని అదనపు చీఫ్ జుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయాధికారి కె.జయలక్ష్మిని మదనపల్లి పిన్సిపల్ సివిల్ జడ్జి కోర్టుకు మార్చారు. నంద్యాల ప్రిన్సిపల్ సివిల్ జడ్జిగా ఉన్న బి.రాధారాణిని విజయవాడ చీఫ్ జుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టుకు మార్పు చేశారు. ఆత్మకూరు సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారిగా ఉన్న వెంకటేశ్వరరావును విజయవాడ మూడో అదనపు సివిల్ జడ్జి కోర్టుకు పంపించారు. శ్రీకాకుళం అడిషనల్ సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారిగా ఉన్న సీహెచ్ యుగంధర్‌ను మచిలీపట్నం అదనపు సివిల్ జడ్జి కోర్టుకు బదిలీ చేశారు. శ్రీకాకుళం మున్సిపల్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న కేవీఎల్ హిమబిందును మచిలీపట్నం సివిల్ జడ్జి కోర్టుకు పంపారు. విజయనగరం జిల్లా బొబ్బిలి సివిల్ జడ్జి కోర్టు న్యాయాధి కారి ఎస్.అరుణశ్రీని గన్నవరం అడిషనల్ చీఫ్ జుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టుకు బదిలీ చేశారు. విజయవాడలోని 12వ అదనపు జిల్లా జడ్జి కోర్టు న్యాయాధికారి పి.భాస్కరరావును ఏసీబీ కోర్టు న్యాయాధికారిగా బదిలీ చేశారు. ఇక్కడ ఉన్న జి.భూపాల్ రెడ్డిని కమర్షియల్ కోర్టుకు బదిలీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న వై శ్రీనివాసరావును ఏలూరులోని ఫ్యామిలీ కోర్టుకు పాలకులు పంపారు.

జేఈఈలో విజయవాడ విద్యార్థుల ప్రతిభ

విజయవాడ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : జేఈఈ మెయిన్స్ పరీక్షా ఫలితాల్లో విజయవాడ విద్యార్థులు ప్రతిభ చాటారు. పలు ర్యాంకులు పొందారు. నగరానికి చెందిన వడ్లమూడి లోకేశ్ (183), తోరాటి భరద్వాజ్ (237), కృష్ణ హర్షిత్ (296), జస్వంత్ వెంకట రఘువీర్ (360), మహేశ్వర రెడ్డి (484), పబ్బతి చంద్రేశ్ (586), ఎం.విశాత్ కుమార్ (219) తదితరులు ర్యాంకులు సాధించారు. వీరిని పలువురు అభినందించారు.

చర్లపల్లి - తిరుపతి మధ్య ప్రత్యేక రైలు నేడు

రైల్వే స్టేషన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): వేసవి రద్దీని పురస్కరించుకుని ప్రయాణికుల సౌకర్యార్థం వన్‌వే స్పెషల్ ట్రైన్‌ను ఆదివారం నడపుతున్నట్లు డివిజన్ పీఆర్‌వో నుస్రత్ ఎం. మండ్రూపకర్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. తిరుపతిలో ఈ రైలు ఆదివారం సాయంత్రం 4.55 గంటలకు బయలుదేరుతుంది. రేణిగుంట, తిరుపతి, నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి, విజయవాడ జంక్షన్, కొండపల్లి, ఖమ్మం, మహబూబాబాద్, నెక్కొండ, వరంగల్, ఖాజీపేట జంక్షన్, జనగాం స్టేషన్ల మీదుగా చర్లపల్లి చేరుతుంది. 21వ తేదీ ఉదయం 6.10 గంటలకు చర్లపల్లి చేరుకునే ఈ రైలు విజయవాడ జంక్షన్‌కు ఆదివారం రాత్రి 11 గంటలకు వస్తుంది. రేణిగుంట జంక్షన్‌కు 5.15 గంటలకు, శ్రీకాళహస్తికి 5.38 గంటలకు, గూడూరు జంక్షన్‌కు 6.43 గంటలకు చేరుకుంటుంది. నెల్లూరుకు రాత్రి 7.14 గంటలకు, ఒంగోలుకు 8.38 గంటలకు, చీరాలకు 9.23 గంటలకు, తెనాలికి 10.18 గంటలకు చేరుతుంది. కాగా, ఆదివారం అర్ధరాత్రి తరువాత తెలంగాణలోని ఖమ్మం, మహబూబాబాద్, నెక్కొండ, వరంగల్, ఖాజీపేట జంక్షన్, జనగాం మీదుగా చర్లపల్లి చేరుకుంటుంది.

బస్సు దహనం కేసు నిందితుల విడుదలకు వినతి

గాంధీనగర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): గత 32 ఏళ్లగా జైలు జీవితం గడుపుతున్న చిలకలూరిపేట బస్సు దహనం కేసు నిందితులు సాతులూరి చలపతిరావు, గంటెల విజయవర్ధన్‌రావులను విడుదల చేయాలని జీవిత ఖైదీల విడుదల సాధన సమితి నేతలు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో హైకోర్టు న్యాయవాది డి.సురేష్ కుమార్, నల్సార్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కరణం మురళీ మాట్లాడారు. ఆర్థిక ఇబ్బందులతోనే నిందితులు ఈ చర్యకు పాల్పడ్డారని గతంలో ఎటువంటి నేరాలు చేసిన చరిత్ర వీరికి లేదన్నారు. ఈ నెల 17న రాష్ట్ర ప్రభుత్వం జీవిత ఖైదీల విడుదల కోసం జారీ చేసిన జీవో 71లో చలపతిరావు, విజయవర్ధన్‌రావు విడుదలకు అడ్డుపడుతున్న గైడ్‌లైన్ ఉందన్నారు. దళితులైన వీరి పట్ల ప్రభుత్వం మానవతా దృక్పథంతో విడుదలకు ప్రత్యేక జీవో జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

అవినీతి అధికారి దారి దోపిడీ

(9వ పేజీ తరువాయి)

పడ్డాడు. పాత ట్రక్కుకు రంగు వేయించి కొత్త చాసిస్ నెంబర్ బిళ్లను తగిలిస్తున్నాడు. కొత్తది కాబట్టి పాత డబ్బు చెల్లించాల్సిన అవసరం ఉండదు. ఒక్కో ట్రక్కుకు రూ.20 వేలు తీసుకుని కొత్తవాటిగా రాజముద్ర వేసి పంపుతున్నాడు.

జిల్లాలోని పలు ప్రాంతాల్లో దోపిడీ ఇలా..

ఈ సార్‌కు.. గుడివాడలో మరో కలెక్షన్ ఏజెంట్ ఉన్నాడు. ఇక్కడ పనిచేసే ఓ ఇన్‌స్పెక్టర్ ఏకంగా ట్రాక్టర్ ట్రక్కులపై ఎక్కువగా వసూలు చేసి సార్‌కు అందజేస్తున్నాడు. ఇక ఇసుక లారీల డబ్బు మామూలే. గన్నవరం నియోజకవర్గం కేంద్రంగా ఓ ప్రైవేట్ కలెక్షన్ ఏజెంట్‌ను ఈ సార్ మళ్లీ లైన్‌లోకి దించారు. ఇంతకుముందు ఈ ఏజెంట్ కేవలం కొందరు అవినీతి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ల సేవలో ఉండేవాడు. ఈయన గన్నవరం ఎఫ్‌సీ స్టేషన్‌లో వాహనాలకు పెయింట్ వేసే పెయింటర్ దగ్గర పనిచేసే అసిస్టెంట్. కాలక్రమంలో కలెక్షన్ కింగ్ అవతారమెత్తాడు. ఈయన చేసే వసూళ్లకుగాను ఇన్‌స్పెక్టర్ల సిండికేట్ కొంత కమీషన్‌ను కూడా ఇచ్చేది. ఈ ఏజెంట్ కలెక్షన్లు మరీ ఎక్కువ కావడంతో ఎంవీఐల సిండికేట్ సమావేశం పెట్టుకుని మరీ ఇతనిని తొలగించాలని నిర్ణయించింది. ఆ సమావేశంలో ఇన్‌స్పెక్టర్ల సిండికేట్ రెండు వర్గాలుగా విడిపోయి.. తొలగించాలని కొందరు, తొలగించొద్దని మరికొందరు పట్టుబట్టారు. ఆ తర్వాత కలెక్షన్ కింగ్‌ను పిలిచి హెచ్చరించి పంపేశారు. ఈ వ్యవహారం తర్వాత కొంతకాలం స్తబ్దుగా ఉన్న ఆ ఏజెంట్ ఇప్పుడు మళ్లీ జూలు విదిల్చాడు. సార్ టార్గెట్లు ఎక్కువ కావటంతో ఇన్‌స్పెక్టర్ల సిండికేట్ ఇతనిపై బండ పెట్టింది. దీంతో సదరు ఏజెంట్ బయటకు రాకుండా ఇంటి నుంచే లారీ యజమానుల నుంచి వసూళ్లకు తెగబడ్డాడు. ఉయ్యూరు ఆర్‌టీవో కార్యాలయ పరిధిలోనూ ఇదే వ్యవహారం నడుస్తోంది. ఓ ఇన్‌స్పెక్టర్ దిగువ అధికారి ఇక్కడ కలెక్షన్లకు శ్రీకారం చుట్టాడు. అలాగే, నందిగామ, జగ్గయ్యపేట ప్రాంతాల పరిధిలో కొందరు ఇన్‌స్పెక్టర్లు మెటల్, ఇసుక లారీ యజమానుల నుంచి వసూళ్లు చేస్తున్నారు.

జేఈఈ మెయిన్స్‌లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ



లబ్బీపేట, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్-2025 ఫలితాలలో శ్రీచైతన్య విద్యార్థులు ఆలిండియా ఓపెన్ క్యాటగిరీలో 10లోపు 1, 1, 9, 10 ర్యాంకులు సాధించినట్లు సంస్థ ఎగ్జిక్యూటివ్ ఏజీఎం మద్దినేని మురళీకృష్ణ తెలిపారు. బందర్ రోడ్డులోని క్యాంపస్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీచైతన్య విజయవాడ విభాగం నుండి ఆలిండియా ఓపెన్ క్యాటగిరీ 100వ ర్యాంకు లోపు ముగ్గురు విద్యార్థులు పిహెచ్‌ఎస్ఎస్.కార్తీక్ 75వ ర్యాంకు, పి.ప్రణయ సాయి ముఖేష్ 81వ ర్యాంకు, వి.ఈశ్వర్ కార్తీక్ 94వ ర్యాంకు సాధించారని తెలిపారు. అదేవిధంగా ఆలిండియా ఓపెన్ క్యాటగిరీ 500ర్యాంకు లోపు 24మంది, ఆలిండియా క్యాటగిరీ 100ర్యాంకు లోపు 41మంది విద్యార్థులు సాధించారని, ఇటువంటి విజయాలు ఒక్క శ్రీచైతన్య కి మాత్రమే సాధ్యమని అన్నారు. ఈ విజయానికి తాము నిర్వహించిన ప్రోగ్రామ్స్ కారణమని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని అభినందించారు,

గొల్లపూడిలో క్లోవర్ లీఫ్

(9వ పేజీ తరువాయి)

నున్న, జక్కంపూడి, గొల్లపూడి అవుటర్ ప్రాంతాలను కలుపుతూ రాజధాని అమరావతిలోని వెంకటాయపాలెం మీదుగా కాజ చేరుకుని అక్కడ ఎన్‌హెచ్-16కు అనుసంధానమవుతుంది. ఇది గొల్లపూడి దగ్గర ఎన్‌హెచ్-65ను క్రాస్ చేస్తుంది. ఇక్కడ ఎన్‌హెచ్-65పై ఆర్‌వోబీ వెళ్తుంది. ఇక్కడ గతంలో జరిగిన తప్పిదం కారణంగా కొన్ని ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. విశాఖపట్నం, ఏలూరు నుంచి చిన అవుటపల్లి దగ్గర వెస్ట్ బైపాస్ మీదుగా వచ్చే వాహనాలు హైదరాబాద్ వెళ్లాలంటే ఆర్‌వోబీ పక్క నుంచి కిందకు దిగి.. గొల్లపూడి వెళ్లి అక్కడ ట్రాఫిక్ జంక్షన్ దగ్గర టర్నింగ్ తీసుకుని ఎన్‌హెచ్-65 మీదుగా ఇబ్రహీంపట్నం మీదుగా హైదరాబాద్ వెళ్లాల్సి ఉంటుంది. చెన్నై నుంచి కాజ, విజయవాడ వెస్ట్ బైపాస్ మీదుగా వచ్చే వాహనాలన్నీ విజయవాడ వెళ్లాలంటే గొల్లపూడి ఆర్‌వోబీ పక్క నుంచి దిగి ఇబ్రహీంపట్నం రింగ్‌కు వెళ్లి ఎన్‌హెచ్-65 మీదుగా వెనక్కి రావాల్సి ఉంటుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని కొద్దికాలం కిందట ఎన్‌హెచ్ అధికారులు గొల్లపూడి జంక్షన్ వద్ద ఒక రింగ్ జంక్షన్‌ను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఈ రింగ్ జంక్షన్ కోసం కన్సల్టెంట్‌తో సర్వే చేయించారు. దీనివల్ల గొల్లపూడి దగ్గర బైపాస్ మీదుగా రాకపోకలు సాగించే వాహనాలు కానీ, దిగువన ఉన్న ఎన్‌హెచ్-65పై రాకపోకలు సాగించే వాహనాలు బైపాస్ ఎక్కాలన్నా కానీ ఇబ్బంది లేకుండా ఉంటుంది. వాహనాలు కూడా ఇటు గొల్లపూడి సెంటర్, అటు ఇబ్రహీంపట్నం వెళ్లకుండానే రింగ్ జంక్షన్ మీదుగా అక్కడికక్కడే ఎటు కావాలన్నా వెళ్లే వీలుంటుంది. ఈ రింగ్ జంక్షన్‌కు పెద్దగా భూ సేకరణ కూడా అవసరం లేదని ఎన్‌హెచ్ వర్గాలు చెబుతున్నాయి. అయితే, ఈ రింగ్ జంక్షన్ పూర్తిస్థాయి ప్రత్యామ్నాయం కాదనేది నిపుణుల మాట. కనీసం సగం క్లోవర్ లీఫ్ జంక్షన్ అయినా ఏర్పాటు చేయాల్సిందేనని వారు ప్రతిపాదిస్తున్నారు. అయితే, దీనికి కూడా భూసేకరణ తప్పదని ఎన్‌హెచ్ వర్గాలు భావించి ఆ ప్రతిపాదనను విరమించుకున్నాయి. కాగా, అనూహ్యంగా సగం క్లోవర్ లీఫ్ జంక్షన్ ప్రతిపాదన పక్కకుపోయి పూర్తిస్థాయి క్లోవర్ లీఫ్ జంక్షన్‌ను ఏర్పాటుచేసే పరిస్థితి ఏర్పడింది.

ఎన్‌హెచ్-65 ఆరు వరసల ప్రతిపాదన నేపథ్యంలో..

ప్రధానంగా హైదరాబాద్-విజయవాడ వరకు ఎన్‌హెచ్- 65ను ఆరు వరసలుగా విస్తరించాలని నిర్ణయించటమే కారణం. డీపీఆర్ రూపకల్పన ప్రక్రియ కూడా వేగంగా శ్రీకారం చుట్టడంతో క్లోవర్ లీఫ్ జంక్షన్ అంశంపై ఎన్‌హెచ్ వర్గాల్లో చర్చ నడుస్తోంది. రెండు భారీ జాతీయ రహదారులు అనుసంధానమయ్యేచోట, అందునా ఆరు వరసలుగా క్రాస్ అవుతున్న దగ్గర కచ్చితంగా క్లోవర్ లీఫ్ జంక్షన్‌ను అభివృద్ధి చేయకపోతే ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారు. రాజధానికి సమీపంలో ఇలాంటి ట్రాఫిక్ తలనొప్పులు మంచిది కాదన్న అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. దీంతో హైదరాబాద్-విజయవాడ మార్గంలో 6 వరసల విస్తరణ డీపీఆర్‌లో క్లోవర్ లీఫ్ జంక్షన్‌ను ప్రతిపాదించే అవకాశం కనిపిస్తోంది. ఈ జంక్షన్ ఏర్పాటు చేయాల్సి వస్తే భూ సేకరణ తప్పదు. గొల్లపూడిలో అత్యంత ఖరీదైన భూములను సేకరించాల్సి ఉంటుంది.

ఉమ్మడి కృష్ణాకు 1,213 పోస్టులు

(9వ పేజీ తరువాయి)

ఆగ్రహానికి గురైంది. సరిగ్గా ఎన్నికల ముందు ఓటుబ్యాంకు రాజకీయాలకు తెరలేపి గత ఏడాది ఫిబ్రవరి 9న నోటిఫికేషన్ ఇచ్చింది. ఉమ్మడి కృష్ణాజిల్లాకు కేవలం 107 స్కూల్ అసిస్టెంట్ పోస్టులకే నోటిఫికేషన్ ఇచ్చింది. హడావిడిగా నోటిఫికేషన్ ఇవ్వటంపై అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. న్యాయస్థానం కూడా అభ్యర్థులకు అనుకూలంగానే ఆదేశాలిచ్చింది. కాగా, ఎన్నికల్లో కూటమి పార్టీలు మెగా డీఎస్సీ ప్రకటిస్తామని హామీ ఇచ్చాయి. ఇచ్చిన మాటను కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుంది. కిందటి వైసీపీ ప్రభుత్వం మంజూరు చేసిన 107 పోస్టుల కంటే పది రెట్లు ఎక్కువగా 1,213 ఉపాధ్యాయ పోస్టులకు నోటిఫికేషన్‌ను ఇవ్వనుండటంతో నిరుద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తాము పరీక్షలకు సన్నద్ధం కావటం కోసం ప్రభుత్వం కోచింగ్ ఇప్పించాలని కోరుతున్నారు.

మే 15 వరకు దరఖాస్తులు

ఉపాధ్యాయ అభ్యర్థులు మే 15వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఫీజులు కూడా అదే సమయంలో చెల్లించాలి. మే 20న మాక్ టెస్ట్ నిర్వహిస్తారు. 30న హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకుని, జూన్ 6 నుంచి జూలై 6 వరకు సీబీటీ విధానంలో అభ్యర్థులకు పరీక్షలు నిర్వహిస్తారు. అన్ని పరీక్షలు పూర్తయిన రెండు రోజులకే ప్రాథమిక కీ విడుదల చేస్తారు. ఏడు రోజుల పాటు అభ్యంతరాలను స్వీకరిస్తారు. ఆ తర్వాత ఏడు రోజులకు తుది కీ, ఆ తర్వాత ఏడు రోజుల తర్వాత మెరిట్ జాబితాను ప్రకటిస్తారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122,131, 142
చికెన్ విత్ స్కిన్	230
చికెన్ స్కిన్‌లెస్	240

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 420

ఫైర్ సేఫ్టీ పాటించకపోతే కఠిన చర్యలు

ఆటోనగర్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి) : వేసవిలో మాల్స్‌లో ప్రమాదాలు సంభవించే అవ కాశం ఉంటుందని, అగ్నిప్రమాదాల నియంత్రణలో యాజమాన్యాలు జాగ్రత్తలు పాటించక పోతే కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీపీ కె.దామోదర్ హెచ్చరించారు. పటమట ఎల్ఈ పీవీఎల్ మాల్‌లో శనివారం పోలీసులు ఫైర్ సేఫ్టీపై మాక్ డ్రిల్ నిర్వహించారు. ఏసీపీ మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పటమట సీఐ వల్లభనేని పవన్‌కిషోర్, ఎస్సైలు హరికృష్ణ, రేవతి, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల సైన్స్ టూర్

లబ్బీపేట, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ ప్రాథమిక పాఠశాలల నుంచి 50మంది విద్యార్థులు, గైడ్ టీచర్స్‌తో సైన్స్ ఎక్స్‌పోజర్‌ను నిర్వహించినట్లు జిల్లా సైన్స్ ఆఫీసర్ మైనం హుస్సేన్ తెలిపారు. శనివారం ఎంఈవో ఈ టూర్‌ను ప్రారంభించగా తొలుత భవానీపురంలోని కృష్ణానది పరివాహక ప్రదేశాలు, పున్నమిఘాట్, అనంతరం గాంధీ హిల్‌లోని సైన్స్ మ్యూజియం, బృందావన పార్క్‌ను విద్యార్థులు సందర్శించారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు రాజకుమార్, ఉమాదేవి, షేక్ సైదా సాహెబ్ తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా రన్ ఫర్ జీసెస్

- క్రీస్తు సందేశం మానవాళికి శాంతి సందేశం కావాలి
- పీఠాధిపతులు జోసఫ్ రాజారావు, కొర్నేలియస్ పిలుపు



రన్ ఫర్ జీసెస్ శాంతి ర్యాలీలో బిషప్ జోసఫ్ రాజారావు

బెంజిసర్కిల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): శిలువ మరణం ద్వారా పునరుత్థానుడైన ఏసుక్రీస్తు సందేశం సమస్త మానవాళి సందేశం కావాలని విజయవాడ కేథలిక్ డయోసిస్ బిషప్ మోస్ట్ తెలగతోటి జోసెఫ్ రాజారావు, కృష్ణా, గోదావరి డియోసిస్ సీఎస్ఐ బిషప్ టి.జార్జి కొర్నేలియస్ పిలుపు నిచ్చారు. ఈస్టర్ సందర్భంగా ఏపీ ఫెడరేషన్ ఆఫ్ తెలుగు చర్చెస్, క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో శనివారం ఉదయం 6గంటలకు ఆర్సీఎం బిషప్ జోసఫ్ రాజారావు, మోన్సిగ్నోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, సీఎస్ఐ బిషప్ కొర్నేలియస్, బేతేలు మినిస్ట్రీస్, బైబిల్ కాలేజీ ప్రెసిడెంట్ అండ్ డైరెక్టర్ పాస్టర్ సల్లూరి జయకుమార్ బాబు, పాస్టర్ అల్లూరి విశ్వప్రసాద్, ప్రవీణ్ శీలం క్రీస్తును స్వాగతిస్తూ కాగడాలు వెలిగించి ఆనందో త్సాహాల మధ్య రన్ ఫర్ జీసెస్ శాంతి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా బిషప్‌లు రాజారావు, కొర్నేలియస్‌లు సందేశం ఇస్తూ పాపుల రక్షణార్థం ఏసుక్రీస్తు శిలువమోసి ప్రాణత్యాగం చేసి మూడో రోజు తిరిగి లేచా రన్నారు. అంతకు ముందు బెంజిసర్కిల్ లోని సెయింట్ పాల్స్ కథెడ్రల్ చర్చి ప్రాంగణం నుంచి ప్రారంభమైన రన్ ఫర్ జీసెస్ శాంత ర్యాలీ పిన్నమనేని పాలీక్లినిక్ రోడ్డు, సిద్ధార్థ కాలేజీ, మదర్ థెరెస్సా సర్కిల్ మీదుగా శిఖా మణి సెంటర్, స్టేట్ గెస్ట్‌హౌస్ సమీపంలోని సెయింట్‌పాల్స్ బసిలికా సీఎస్ఐ చర్చి ప్రాం గణానికి చేరుకుంది. కార్యక్ర మంలో రన్ ఫర్ జీసెస్ స్టేట్ కో-ఆర్డినేటర్ పాస్టర్ బెల్లంకొండ శివాజీ రాజు, పాస్టర్ కరుణానిధి, మాజీ డిప్యూటీ మేయర్ ఎస్.గ్రిటన్, కోరుకొండ అశోక్ కుమార్, ఫెలోమిన్ స్వర్ణ పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో నారాయణ విద్యార్థుల విజయభేరి



విజేతలతో డీజీఎం రవిశంకర్, డీన్ శ్రీరాంచంద్ చౌదరి

పెనమలూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో నారాయణ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించి విజయభేరి మోగించారని సంస్థ డీజీఎం జాగర్లమూడి రవిశంకర్ తెలిపారు. కానూరు నారాయణ క్యాంపస్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన విజేతలయిన విద్యార్థులు, డీన్ శ్రీరాంచంద్ చౌదరి, విద్యార్థుల తల్లిదండ్రులతో కలసి మాట్లాడారు. ఆలిండియా ఓపెన్ కేటగిరి బనిబ్రత మజీ అనే విద్యార్థి 300 మార్కులకు గాను 300 సాధించి మొదటి ర్యాంకు, శివన్ వికాస్ 9వ ర్యాంకు, పదిలోపు వివిధ కేటగిరీలలో 1, 2, 2, 4, 4, 7, 9, 10 ర్యాంకులు సాధించారని తెలిపారు. విజయవాడ నారా యణ విద్యార్థులు వడ్లమూడి లోకేష్ 183వ ర్యాంకు, తోరాటి భరద్వాజ్ 237, కృష్ణ హర్షిత్ 296, వెంకట రఘువీర్ 360, మహేశ్వరరెడ్డి 484, చంద్రేష్ 586, రాచపూడి సాయికృష్ణ 622, ఆముదాల భార్గవ్ 706, బిందుమాధవి 744, జస్వంత్‌రెడ్డి 777, ఆంజనేయరెడ్డి 827, లిఖితశ్రీ 927, వసంత ప్రిషిని వాహన 949, సాయి శివరామకృష్ణ 955 ర్యాంకులు సాధించారని రవిశంకర్ తెలిపారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

గుణదల : నిడమానూరులో శనివారం స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణ ఆంధ్ర నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత పాటించే విషయమై సమాజంలోని ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శీలం రంగారావు, ఎంపీడీవో మురళీకృష్ణ ప్రసాద్, నిడమానూరు వెటర్నరీ డాక్టర్ సతీష్‌కుమార్, కార్యదర్శి నరసింహారావు పాల్గొన్నారు.

కండరాల క్షీణత వ్యాధిని గుర్తిస్తే పురోగతిని అడ్డుకోవచ్చు

బెంజిసర్కిల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): కండరాల క్షీణత వ్యాధి (మస్కులార్ డిస్ట్రఫి)ని మొదటి దశలో గుర్తిస్తే దాని పురోగతిని అడ్డుకునేందుకు అవకాశం ఉంటుందని అమరావతి రేర్ డిసీజెస్ ఆర్గనైజేషన్ ఫౌండర్ ఎస్.శోభారాణి చెప్పారు. బెంజిసర్కిల్ నాస్తిక్ కేంద్రంలోని వాసవ్య నర్సింగ్ హోమ్‌లో శనివారం డాక్టర్ జి. సమరం అధ్యక్షత జరిగిన ఆరోగ్య సదస్సులో శోభారాణి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఈవ్యాధి నివారణకు సరైన చికిత్స లేనప్పటికీ, ఫిజియోథెరపీ, స్టిరాయిడ్ తదితర సహాయ పద్ధతులు తోడ్పడతాయన్నారు. పుట్టుకతో జన్యుపరమైన దోషాలు ఈవ్యాధి రావడానికి చాలా వరకు కారణమన్నారు.

ల్యాబ్ టెక్నీషియన్ల పనితీరుపై సమీక్ష

కృష్ణలంక : లబ్బీపేట పశువుల ఆస్పత్రిలో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ ఎం.హనుమంతరావు మాట్లాడుతూ ఉమ్మడి కృష్ణాజిల్లాలోని నియోజకవర్గ స్థాయిల్లో ఏర్పాటు చేసిన పశువ్యాధి నిర్ధారణా శాలల్లో పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్ల పనితీరు సమీక్షిస్తున్నట్టు తెలిపారు. వారికి క్షేత్రస్థాయిలో పశువ్యాధి నిర్ధారణకు అవసరమైన కిట్లను, స్టేషనరీ అందజేశారు.

ఇ వేస్టుతో అనేక అనర్థాలు

ప్రభుత్వాసుపత్రి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఇ వ్యర్థాలతో అనేక అనర్థాలు కలుగుతాయని జీజీహెచ్ సూపరింటెండెంట్ ఎ.వి.రావు అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్రలో భాగంగా శనివారం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అవగాహన సదస్సు అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ వై.పద్మావతి, జి.వి.వి.సత్యనారాయణ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

గుణదల : స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణ ఆంధ్ర పరిపూర్ణంగా నెరవేరాలంటే సమాజంలోని ప్రతి ఒక్కరూ సంకల్పంగా తీసుకుంటేనే సాధ్యపడుతుందని 26వ డివిజన్ కార్పొరేటర్ వల్లభనేని రాజేశ్వరి అన్నారు. 26వ డివిజన్‌లో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. మసీదు రోడ్డునుంచి గద్దె పూర్ణచంద్రరావు కాలనీ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు తోట పాండు, డివిజన్ ఇన్‌చార్జి వల్లభనేని సతీష్, కడియం ప్రకాష్, డేవిడ్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

● ఎస్ఆర్ఆర్ కళాశాలలో శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర నిర్వహించారు. వ్యర్థాల వల్ల పర్యావరణానికి, మానవుల ఆరోగ్యానికి కలిగే నష్టాలపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ రెడ్యూస్, రిపేర్, రీయూస్, రీసైకిల్ అనే నియమాలను పాటించాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి తెలిపారు.

ప్రకటన

నాక్లయింటు అయిన విశాఖపట్నం, సీతమ్మధార, పి&టి కాలనీ కాపురస్తులు ముసునూరు లేటు సాంబశివరావు గారి భార్య ముసునూరు శైలజ గారి సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా...
నాక్లయింటు భర్తగారైన ముసునూరు సాంబశివరావు గారు ది. 12-04-2012న ఆధార్ కార్డ్ నెం. 4363 XXXX 5139 పొంది, ది.21-03 2017న మరణించినారు. ఇట్టిస్థితిలో కొంతమంది కుట్రపూరితంగా ది.15-03-2025న నాక్లయింటు భర్తగారి పేరు, వివరాలతో ఆధార్‌కార్డ్‌కు అప్లయ్ చేసినారని, ముసునూరు సాంబశివరావుగారి పేరుతో నకిలీ ఆధార్ నెం. 2321 6998 7680 పొందినారని తెలిసినది. ఆ నకిలీ కార్డును ఉపయోగించి నాక్లయింటు భర్తగారైన ముసునూరు సాంబశివరావు గారి పేరుతో ఉన్నఆస్తులు అన్యాక్రాంతం చేయడానికి ప్రయత్నిస్తున్నట్లుగా తెలిసినది. కావున ఈ నకిలీ ఆధార్ కార్డ్ నెం. 23216998 7680ను ఉపయోగించి నాక్లయింటు భర్తగారికి చెందినటు వంటి ఆస్తులను ఎవరైనాకొన్నా గానీ, అమ్మినా గానీ అవి చెల్ల నేరవు. అలాగే ఆ నకిలీ ఆధార్‌కార్డు ఉపయోగించి ఎవరైనా, ఎక్కడైనా, ఏ రిజిస్ట్రార్ ఆఫీసులో నైనా ఎటువంటి లావాదేవీలు చేయరాదని, చేసిన యెడల అవి చెల్లనేరవు అని, లావాదేవీలు జరిపిన వారిపై తగిన సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకోబడునని యావన్మందికి ఇందు మూలంగా తెలియ జేయడమైనది.

KIRANBABU TAGARAM,
B.Com., LLB., LLM(Con) Advocate
G-2, Sree Apartment, Bharat Gas Road,
Opp. ITI college, LIC colony,
Vijayawada -10. Cell: 6300114939



పరిటాల ప్రాంతంలోని కంకర క్వారీ

మెటల్ మైనింగ్‌కు మహర్దశ

రాజధాని పనులతో కంకరకు భలే డిమాండ్

- పరిటాల ప్రాంతంలో భారీ సంఖ్యలో క్వారీలు, క్రషర్లు
- క్వారీ, క్రషర్ యజమానులకు ఇక మంచిరోజులు

రాజధాని ప్రాంతంలో గత ఐదేళ్లు పడకేసిన నిర్మాణ పనులు కూటమి ప్రభుత్వమొచ్చాక బాగా ఊపందుకున్నాయి. ఒకవైపు కేంద్ర ప్రభుత్వం, మరోవైపు ఆర్థిక సంస్థలు రుణాలు ఇస్తుండటంతో రోడ్లు, భవనాల పనులు చురుకుగా జరుగుతున్నాయి. కొత్త పనులకు టెండర్లు పిలుస్తూ, ప్రభుత్వం చకాచకా కాంట్రాక్టర్లను ఎంపిక చేస్తోంది. పలు బడా నిర్మాణ సంస్థలు భారీ యంత్రాలు, వేలాది కార్మికులతో పనులు చేస్తుండటంతో ఇసుక, సిమెంట్‌తో పాటుగా కోట్లాది మెట్రిక్ టన్నుల కంకర అవసరమవుతోంది. ఎన్టీఆర్ జిల్లాలో పరిటాల, గుంటూరు జిల్లాలో పేరేచర్ల ప్రాంతాల్లో నిర్మాణపరంగా నాణ్యతగల కంకర దొరుకుతుంది. పేరేచర్ల ప్రాంతంలో కంకర నాలుగైదేళ్లకు మించి దొరకదు. పరిటాల ప్రాంతంలో రెండు మూడు దశాబ్దాల వరకు మైనింగ్‌కు ఢోకా లేదు. దీంతో ఇక్కడి కంకర, రోడ్డు మెటల్‌కు సమీప భవిష్యత్తులో ఇంకా గిరాకీ పెరగనున్నది. పరిటాల ప్రాంతంలో రోజుకు రెండు వందల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన భారీ క్రషర్లు పదుల సంఖ్యలో ఉన్నాయి. అమరావతి పుణ్యమా అని మెటల్ మైనింగ్‌కు ఇక మహర్దశ పట్టనున్నది.



పరిటాల ప్రాంతంలోని క్రషర్

(కంచికచర్ల - ఆంధ్రజ్యోతి)

కంచికచర్ల మండలం పరిటాల గ్రామ రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ రికార్డుల ప్రకారం సర్వే నెంబరు 801లో 13 వందల ఎకరాల విస్తీర్ణం కల్గిన కొండపోరంబోకు ఉన్నది. లీజు పద్ధతిపై సుమారుగా 120 క్వారీలు ఉన్నాయి. జిల్లాలో 40కు పైగా క్రషర్లు ఉండగా, పరిటాల ప్రాంతంలోనే 30 వరకు ఉన్నాయి. వీటిలో 25 క్రషర్లు పెద్దవి పైగా అధునాతనమైనవి. ఒక్కో క్రషర్ సామర్థ్యం రోజుకు 200 నుంచి 250 మెట్రిక్ టన్నులు. నెలకు ఒక్కో క్రషర్‌లో సగటున 50 వేల 60 వేల మెట్రిక్ టన్నుల కంకర ఉత్పత్తి అవుతోంది. ఈ ప్రాంతంలోని పెద్ద, చిన్న క్రషర్ల సామర్థ్యం నెలకు సగటున 15 లక్షల మెట్రిక్ టన్నులు ఉంది.

పరిటాలలో నాణ్యమైన కంకర

నాణ్యతాపరంగా పేరేచర్ల, పరిటాల ప్రాంతాల్లో లభ్యమయ్యే కంకర పటిష్టంగా(గట్టిగా) ఉంటుంది. మెటల్‌లో లూజు ఉండదు. చాలా గట్టిగా ఉంటుంది. పైగా మట్టి, మన్ను ఉండదు. ఇక్కడి క్రషర్లలో భవన నిర్మాణాల కోసం 40 ఎంఎం, 20 ఎంఎం, 12ఎంఎం, 6 ఎంఎం సైజుల వారీగా కంకర ఉత్పత్తి అవుతుంది. రోడ్డు మెటల్‌కు సంబంధించి జీఎస్బీ, డబ్ల్యూఎంఎం తయారవుతుంది. ఇక్కడి కంకర ఉమ్మడి కృష్ణాజిల్లాతో పాటుగా ఏలూరు, భీమవరం, తెలంగాణ రాష్ట్రం బోనకల్లు, మధిర, వైరా తదితర ప్రాంతాలకు సరఫరా అవుతోంది.

వైసీపీ ప్రభుత్వంలో క్రషర్ల యజమానులపై రుణాల భారం

వైసీపీ పాలకుల నిర్లక్ష్యం, ఇసుక దొరక్కపోవటం, దోపిడీ విధానాల వల్ల నిర్మాణ రంగం కుదేలు కావటం, రోడ్ల అభివృద్ధి చేయకపోవడం, మూడు రాజధానులంటూ అమరావతిలో ఒక్క పని కూడా చేపట్టకపోవడం తదితర కారణాలతో గడచిన ఐదేళ్లు కంకరకు పెద్దగా గిరాకీ లేదు. క్వారీలు, క్రషర్లలో సామర్థ్యం మేరకు ఉత్పత్తి జరగలేదు. ప్రతి నెలా కరెంట్ బిల్లులు, బ్యాంకు రుణాల కిస్తీలు చెల్లించలేక క్రషర్ల యజమానులు నానా ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వం అమలుచేస్తున్న ఉచిత ఇసుక విధానం పుణ్యమా అంటూ ఒకవైపు నిర్మాణ రంగం ఊపందుకోవటం, మరోవైపు రాజధానిలో చురుగ్గా నిర్మాణ పనులు జరుగుతుండటం వల్ల కంకర, రోడ్డు మెటల్‌కు గిరాకీ పెరగింది. మైనింగ్‌తో పాటుగా ఇక క్వారీ, క్రషర్ల యాజమానుల దశ కూడా మారనున్నది.

ఓరా..చైత్రదీపిక!

- స్కేటింగ్‌లో జాతీయ, అంతర్జాతీయ పతకాలతో జైత్రయాత్ర

పదిహేనేళ్ల వయసులోనే స్కేటింగ్‌లో ప్రతిభ కనబరిచి, జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పతకాలు సాధిస్తూ తన జైత్రయాత్ర కొనసాగిస్తోంది నగరానికి చెందిన చైత్రదీపిక. రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఆఫ్ కృష్ణా డిస్ట్రిక్ట్ ద్వారా నగరపాలక సంస్థకు చెందిన ఇండోర్ స్టేడియంలో సాధన చేస్తూ ఇప్పటి వరకు రాష్ట్రస్థాయి నుంచి ప్రపంచ స్థాయి వరకు అనేక టోర్నీలు, చాంపియన్ షిప్‌లలో 47 పతకాలు (16 పసిడి, 16 రజత, 15 కాంస్య) సాధించి అందరితో ఔరా అనిపించింది.



తైవాన్‌లో జరిగిన పోటీల్లో సాధించిన పతకాలతో చైత్రదీపిక

విజయవాడ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): చైత్రదీపిక కుటుంబం ఇదివరకు విశాఖలో ఉండేవారు. ఆమెకు ఐదేళ్ల వయసులో బాలల దినోత్సవం సందర్భంగా శివాజీ పార్క్‌కు వెళ్లారు. అక్కడ స్కేటింగ్ పోటీలను చూసి దీపిక ఆకర్షితురాలైంది. ఆసక్తిని గమనించిన కోచ్ పి.సత్యనారాయణ(సత్యం), చిట్టిబాబు తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఆమెకు శిక్షణ ఇచ్చారు. అప్పటి నుంచి వివిధ విభాగాల్లో ఆమె తన ప్రతిభ కనభరుస్తూ జిల్లా స్థాయిలో అనేక పతకాలు గెలుచుకుంది. కొంతకాలం తర్వాత ఆమె తల్లిదండ్రులు పీఆర్ సతీష్, లలితాదేవి వృత్తిరీత్యా విజయవాడకు వచ్చారు. ఇక్కడ స్కేటింగ్‌లో ఇండియాకు కోచ్‌గా ఉన్న పంచాడ సత్యనారాయణ దగ్గర మెళకువలు నేర్చుకుంది. చైత్రదీపిక స్కేటింగ్ రింగ్‌లోనే కాదు తరగతి గదిలోనూ ప్రతిభావంతురాలే. ఎన్ఎస్ఎం స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న ఆమె తరగతిలోనూ టాప్- 10లో ఉంటుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాల పంట

2021లో మొహాలీలో 59వ జాతీయ సబ్‌జూనియర్ ఆర్టిస్టిక్ స్కేటింగ్, పెయిర్ స్కేటింగ్‌లో బంగారు, ప్రిసిషన్, షో గ్రూప్ స్కేటింగ్ విభాగంలో కాంస్య పతకాలు సాధించింది. 2022లో బెంగళూరులో 60వ జాతీయ ఆర్టిస్టిక్ రోలర్ స్కేటింగ్‌లో బంగారు పతకం, 2023 చండీగఢ్‌లో అండర్-14 స్కేటింగ్ విభాగంలో బంగారు పతకం, ఫ్రీ స్టైల్ విభాగంలో మరొక బంగారు పతకం సాధించింది. అదే ఏడాది అక్టోబరులో చైనాలో 19వ ఆసియన్ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ అండర్-14 విభాగంలో అద్భుతమైన ప్రతిభ కనబరిచి పసిడి పతకం సాధించి దేశానికి పేరు తెచ్చింది. గత నెలలో అంతర్జాతీయ స్థాయి తైవాన్ ఆర్టిస్టిక్ రోలర్ స్కేటింగ్ ఓపెన్ పోటీల్లో దేశం తరపున ప్రాతినిధ్యం వహించి పెయిర్ స్కేటింగ్ విభాగంలో ఏడు దేశాల క్రీడాకారులతో పోటీపడి బంగారు పతకం సాధించింది. ఇన్‌లైన్ విభాగంలో కాంస్య, కపుల్ డ్యాన్స్ విభాగంలో రజత పతకం సాధించింది. చైత్రదీపిక రోజూ ఎనిమిది గంటలు సాధన చేస్తుందని, చదువుతో పాటు స్కేటింగ్‌లో రాణించడం గర్వంగా ఉందని తల్లిదండ్రులు తెలిపారు.

మండుటెండలో న్యాయవాది నిరసన దీక్ష

- తనపై దాడిచేసిన న్యాయవాదులను అరెస్టు చేయాలని మణిప్రియ డిమాండ్



సిటీ సివిల్ కోర్టుల ఎదుట నిరసన దీక్ష చేస్తున్న తుమ్మూరు మణిప్రియ

విజయవాడ లీగల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): సిటీ సివిల్ కోర్టుల ముందు శనివారం మధ్యాహ్నం మండుటెండలో యువ మహిళా న్యాయవాది తుమ్మూరు మణిప్రియ నిరసన దీక్ష చేపట్టారు. తనపై గురువా రం దాడికి పాల్పడిన న్యాయవాదులు పిట్ల శ్రీను, సౌందర్యపై కేసు నమోదు చేసి తనకు న్యాయం చేయాలని ఆమె డిమాండ్ చేశారు. మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టులో జరిగిన వివాదాన్ని పరిష్కరించేందుకు బార్ అధ్యక్ష, కార్యదర్శులు చాంబర్‌కు తనను పిలిపించారని, తాను జరిగిన విషయాన్ని చెబుతుండగా పిట్ల శ్రీను, సౌందర్య, పేరు తెలియని మరికొందరు న్యాయవాదులు తనపై దాడికి పాల్పడ్డారని, తనను కోర్టులోకి రానివ్వబోమని బెదిరించారని తెలిపారు. అంతేకాక కమిటీ వేస్తున్నామని చెబుతున్నారని, ఆ కమిటీలపై తనకు నమ్మకం లేదని స్పష్టం చేశారు. తనపై దాడికి పాల్పడ్డ న్యాయవాదులపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు పంపే వరకు తన నిరసన తెలియజేస్తానని తెలిపారు.

సీఎం కార్యదర్శి రాజమౌళి ఇంట్లో విషాదం

- గుండె సంబంధిత సమస్యతో ఆయన బావ ఆలపాటి వెంకటేశ్వర్లు కన్నుమూత



ఉంగుటూరు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కార్యదర్శి సీనియర్ ఐఏఎస్ అధికారి అడుసుమిల్లి రాజమౌళి ఇంట్లో విషాదం నెలకొంది. ఆయన మూడవ సోదరి భర్త ఆలపాటి వెంకటేశ్వర్లు(57)కార్డియాక్ అరెస్టుతో శుక్రవారం మధ్యాహ్నం విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో కన్నుమూశారు. గుంటూరు జిల్లా అమృతలూరు మండలం గోవాడకు చెందిన వెంకటేశ్వర్లు మెకానికల్ ఇంజనీరింగ్‌లో ఎంటెక్, పీహెచ్‌డీ పూర్తిచేశారు. ఆత్కూరుకు చెందిన అడుసుమిల్లి రామబ్రహ్మం మూడవ కుమార్తె ఆదిలక్ష్మి(55)ని వివాహం చేసుకున్నారు. ఇద్దరూ వీఆర్ సిద్ధార్థ, పీబీ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రొఫెసర్లుగా పనిచేస్తున్నారు. ఆత్కూరులోని ఆదిబ్రహ్మం ఇంటి వద్ద వెంకటేశ్వర్లు భౌతికకాయానికి శనివారం ఎమ్మెల్యేలు బోడె ప్రసాద్, యార్లగడ్డ వెంకట్రావు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దాసరి వెంకటబాలవర్ధనరావు, కలెక్టర్ డీకే బాలాజీ, సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల సెక్రటరీ లక్ష్మణరావు, ఈనాడు చీఫ్ ఎడిటర్ నాగేశ్వరరావు, తహసీల్దార్ జె.విమలకుమా రి తదితరులు నివాళులర్పించారు. రామబ్రహ్మానికి చెందిన సొంత వ్యవసాయక్షేత్రంలో శనివారం వెంకటేశ్వర్లు అంత్యక్రియలు ముగిశాయి.

వ్యవసాయ ఉత్పత్తులకు చట్టబద్ధ ఎమ్మెస్పీ కోసం రాష్ట్రవ్యాప్త ఆందోళనలు

- రైతు సంఘం నేతలు ప్రసాద్, ఈశ్వరయ్య

గాంధీనగర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): రైతాంగ ఉత్పత్తులకు చట్టబద్ధ ఎమ్మెస్పీ సాధించడానికి దేశవ్యాప్తంగా ఆందోళన సాగించాలని అఖిల భారత కిసాన్ జాతీయ మహాసభ ఇచ్చిన పిలుపులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.ఈశ్వరయ్య, కేవీవీ ప్రసాద్ స్పష్టం చేశారు. దాసరిభవన్‌లో శనివారం ప్రెస్‌మీట్‌లో వారు మాట్లాడారు. ఇటీవల తమిళనాడులోని నాగపట్నంలో ఏఐకేఎస్ జాతీయ మహాసభలు విజయవంతంగా జరిగాయన్నారు. దేశవ్యాప్తంగా రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలు, కేంద్రప్రభుత్వ రైతాంగ విధానాలు, రాష్ట్రాల పరిధిలో ఉండాల్సిన వ్యవసాయ రంగాన్ని స్వాధీనరచుకునే కేంద్రప్రభుత్వ ప్రయత్నాలను తిప్పికొట్టాలని మహాసభల్లో తీర్మానించామన్నారు. కేవీవీ ప్రసాద్ జాతీయ కార్యదర్శిగా, ఈశ్వరయ్య కార్యవర్గ సభ్యుడిగా, మరో ఎనిమిది మంది కౌన్సిల్ సభ్యులుగా రాష్ట్రం నుంచి ఎన్నికయ్యారన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

గాంధీనగర్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): 'భవన నిర్మాణ కార్మికుల నుంచి సెస్ కింద వసూలు చేసిన నిధులను కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వాలు వినియోగించాలి. సర్క్యులర్ 12, 14 రద్దు చేసి సంక్షేమ బోర్డును అమలు చేయాలి. పని చేస్తూ ప్రమాదవశాత్తు మృతి చెందిన కార్మికులకు రూ.10 లక్షలు, సహజ మరణం పొందిన కార్మికులకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి.' అని వక్తలు డిమాండ్ చేశారు. ఏపీ ప్రగతిశీల బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్(బీసీడబ్ల్యూయూ) ఐఎఫ్‌టీ యూ అనుబంధం కార్యవర్గ సమావేశం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగింది. ఎం.రామకృష్ణ, జి.హరికృష్ణారెడ్డి, షేక్ మీరావలి, కొప్పుల కుమార్, గనిరాజు, ప్రకాష్ పాల్గొన్నారు.

ఈ- వ్యర్థాలతో అనేక అనర్థాలు

- ఈ-వేస్ట్ సేకరణను ఉద్యమంగా చేపడదాం
- కలెక్టర్ లక్ష్మీశ, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పిలుపు



ఈ-వ్యర్థాల స్పెషల్ డ్రైవ్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

బెంజిసర్కిల్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ఈ-వేస్ట్(ఎలక్ట్రానిక్ వ్యర్థాల) వల్ల అనేక అనర్థాలు పొంచి ఉన్నాయని భవిష్యత్‌పై తీవ్ర దుష్ప్రభావం చూపుతాయని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ స్పష్టం చేశారు. ఈ-వ్యర్థాల సేకరణను ఉద్యమంగా చేపట్టి వ్యర్థాలను రీసైకిలింగ్ చేయడం ద్వారా విలువైన లోహాల వృథాను అరికట్టడంతోపాటు పర్యావరణాన్ని పరిరక్షించుకోవడంలో భాగస్వాములవ్వాలని ప్రజలకు వారు పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో శనివారం బెంజిసర్కిల్‌లోని నారా చంద్రబాబు నాయుడు కాలనీలో ఏర్పాటు చేసిన ఈ-వ్యర్థాల ప్రత్యేక నిర్వహణ(స్పెషల్ డ్రైవ్) కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, వీఎంసీ కమిషనర్ సీహెచ్ ధ్యానచంద్ర ప్రజల నుంచి ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సేకరించారు. నగరంలో రోజుకు 700 టన్నుల ఎలక్ట్రానిక్ వ్యర్థాలను ప్రజలు పారవేస్తున్నారని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. రసాయన పదార్థాలు భూవిం, నీరు, గాలిలో కలవడం వల్ల తీవ్ర కాలుష్యమవుతున్నాయని అన్నారు. తద్వారా ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపి క్యాన్సర్, గుండెజబ్బులు, ఊపిరితిత్తుల వంటి అనే వ్యాధులతోపాటు తల్లిపాలు కూడా కలుషితమయ్యే ప్రమాదం ఉందన్నారు. కాలుష్యరహిత జిల్లాగా ఎన్టీఆర్ జిల్లాను తీర్చిదిద్దుదామని, అందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కలెక్టర్ కోరారు. నగర ప్రాంతాల్లో ఎలక్ట్రానిక్ వస్తువుల వినియోగం అధికంగా ఉంటుందని, ఈ-వ్యర్థాలను రీసైకిలింగ్ చేయడం ద్వారా సేకరించిన మినరల్స్, కెమికల్స్ నుంచి కోట్లాది రూపాయల ఆదాయం సమకూర్చుకోవచ్చని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. ఈ-వ్యర్థాల ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా నగర వ్యాప్తంగా అన్ని వార్డుల పరిధిలో ఈవ్యర్థాలను సేకరించే ఏర్పాట్లు చేసినట్లు నగర పాలక సంస్థ కమిషనర్ సీహెచ్ ధ్యానచంద్ర వివరించారు. అడిషనల్ కమిషనర్ చంద్రశేఖర్, కార్పొరేటర్ చెన్నుపాటి క్రాంతిశ్రీ, నగర పాలక సంస్థ జోనల్ కమిషనర్ షమ్మీ, ఇన్‌చార్జి మెడికల్ ఆఫీసర్ గోపాలకృష్ణ నాయక్, స్థానిక నేతలు చెన్నుపాటి గాంధీ, నారా చంద్రబాబు నాయుడు కాలనీ వాసులు పాల్గొన్నారు. ఈ-వ్యర్థాల స్పెషల్ డ్రైవ్ ర్యాలీని కలెక్టర్ లక్ష్మీశ, ఎమ్మెల్యే గద్దె, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర జెండా ఊపి ప్రారంభించారు. స్థానికులతో ప్రతిజ్ఞ చేయించారు. కాలనీ వాసులు అధికారులు, నేతలకు కంప్యూటర్ వ్యర్థాలను అందజేశారు.



వెలగపూడిలో స్వచ్ఛ భారత్ మిషన్ కార్యక్రమంలో పాల్గొన్న సీఆర్డీయే కమిషనర్ కె.కన్నబాబు

రాజధాని గ్రామాల అభివృద్ధే లక్ష్యం

- అంతర్జాతీయ ప్రమాణాలతో అమరావతి అభివృద్ధి: సీఆర్డీయే కమిషనర్ కె.కన్నబాబు

విజయవాడ, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): అమరావతిని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేసే లక్ష్యంతో సీఆర్డీయే పనిచేస్తోందని, రాజధానిలో ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేసేలా డీపీఆర్ సిద్ధం చేస్తున్నామని, గ్రామాల్లో సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని సీఆర్డీయే కమిషనర్ కె.కన్నబాబు తెలిపారు. శనివారం రాజధాని ప్రాంతంలో అభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణ, స్వర్ణాంధ్ర -2047 సంకల్పంలో భాగంగా వెలగపూడిలో పారిశుధ్య కార్మికులు, గ్రామస్తులతో కలిసి నిర్వహించిన స్వచ్ఛ భారత్ మిషన్‌లో ఆయన పాల్గొన్నారు. పచ్చదనాన్ని పెంపొందించే లక్ష్యంతో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం ద్వారా ఈ-వ్యర్థాల సేకరణ, వాటిని సురక్షిత పద్ధతుల్లో రీసైకిల్ చేయడం అనే థీమ్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఈ నెలకు ఎంపిక చేసిందన్నారు. అందులో భాగంగా రాజధాని గ్రామాల్లో తడి, పొడిచెత్త సేకరణ, చెత్తను డంప్ చేసే విధానంపై గ్రామస్తులకు వివరించారు. సిటీస్ ప్రాజెక్ట్ కింద అమరావతిలో నిర్మించిన భవనాలను ముఖ్యమంత్రి చేతుల మీదగా ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామని, అందులో భాగంగా నిర్మాణంలో ఉన్న అంగన్వాడీ భవనాలను అందుబాటులోకి తేవాలని అధికారులను ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాలు, ఈ-హెల్త్ కేంద్రాలు, పాఠశాలల్లో కార్యక్రమాలు ప్రారంభమయ్యేలా చూసుకోవాలన్నారు. వీటిలో పనిచేసే సిబ్బంది నియామకాల్లో సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకోవాలని అధికారులకు సూచించారు. అమరావతిలో జరుగుతున్న నిర్మాణ పనులను కమిషనర్ పర్యవేక్షించి, పనులు చేస్తున్న నిర్మాణ సంస్థల ప్రతినిధులకు పలు సూచనలు చేశారు. మే 2న ప్రధాని పర్యటనకు సంబంధించిన సన్నాహాలను పరిశీలించారు. మండంలోని టిడ్కో గృహ సముదాయాలు, మల్కాపురం, రాయపూడి, తుళ్లూరు ప్రాంతాలను సందర్శించారు. అమరావతిలో నిర్మాణపనుల పురోగతిని సమీక్షించారు. అనంతరం రైతులు, అధికారులతో కలిసి రాజధాని అభివృద్ధి పనుల పురోగతి, గ్రామస్తులు వెల్లడించిన పలు సమస్యలపై చర్చించారు. అమరావతి అభివృద్ధి, స్వచ్ఛాంధ్ర లక్ష్యాల సాధనలో అందరూ భాగస్వాములవ్వాలని కమిషనర్ పిలుపునిచ్చారు. సీఆర్డీయేలోని వివిధ విభాగాల అధికారులు, స్థానిక నాయకులు, రైతులు, రాజధాని ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రోడ్డుపక్కన కూర్చున్న వారిపైకి దూసుకెళ్లిన కారు

- మహిళ మృతి, ముగ్గురికి స్వల్ప గాయాలు

విద్యాధరపురం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): రోడ్డు పక్కన చాపలు, గంపలు, బుట్టలు అల్లుకుంటూ కూర్చున్న వారిపైకి ఓ కారు దూసుకుపోవటంతో ఒక మహిళ చనిపోగా, ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి. ఈ ఘటన గుప్తా సెంటర్ వద్ద శనివారం సాయంత్రం జరిగింది. మృతురాలి బంధువు ఇచ్చిన ఫిర్యాదు మేరకు భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు. నాలుగు స్తంభాల సెంటర్, రామాలయం వద్ద పిల్లి యశోద కుటుంబ సభ్యులతో ఉంటుంది. ఆమెతో పాటు భర్త, అత్త, మామ, ఆడబిడ్డ, ఇంకా పలువురు గుప్తా సెంటర్ షాదీఖానా వద్ద రోడ్డు పక్కన ఎదురు కర్రలతో బుట్టలు, చాపలు, గంపలు అల్లుకుని, అమ్ముకుని జీవిస్తుంటారు. సాయంత్రం ఐదున్నర గంటలకు యశోద, ఆమె అత్తమామలు పిల్లి రాములమ్మ(50), లక్ష్మయ్య, ఆడబిడ్డ దుర్గ కూర్చుని బుట్టలు అల్లుకుంటుండగా కుమ్మరిపాలెం సెంటర్ వైపు నుంచి అతి వేగంగా వచ్చిన కారు వారి పైకి దూసుకెళ్లింది. లక్ష్మయ్య, యశోద, ఆమె ఆడబిడ్డ దుర్గ పక్కకు పడిపోయారు. వారి ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి. రాములమ్మ మీదుగా కారు వెళ్లడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. రాములమ్మను భవానీపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యులు పరీక్షించి అప్పటికే చనిపోయినట్లు నిర్ధారించారు. పిల్లి యశోద ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పాల ఫ్యాక్టరీ కార్మికుడి దుర్మరణం

- ఫ్యాక్టరీకి వచ్చిన లారీ ఢీకొని మృతి చెందాడని బంధువుల ఆరోపణ
- మృతుని కుటుంబానికి న్యాయం చేయాలంటూ గేటు ముందు నిరసన




రమేష్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై శ్రీనివాస్, మృతదేహాన్ని ఫ్యాక్టరీ గేటు ఎదుట ఉంచి ధర్నా చేస్తున్న మృతుని బంధువులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): వీరవల్లిలోని ప్రాజెక్ట్ కామధేను(పాల ఫ్యాక్టరీ)లో కార్మికుడిగా పని చేస్తున్న రేమల్లెకు చెందిన ఈడే రమేష్(24) విధులు ముగించుకుని వస్తుండగా డివైడర్‌ను ఢీకొని మృతి చెందాడని ఫ్యాక్టరీ ప్రతినిధులు చెబుతున్నారని, కానీ ఫ్యాక్టరీకి వచ్చిన లారీ ఢీకొని చనిపోయాడని బంధువులు ఆరోపించారు. ప్రమాదం జరిగిన సమయంలో మాత్రమే సీసీ ఫుటేజీ లేదనడంపై బంధువులు అనుమానం వ్యక్తం చేశారు. ఉదయం 12 గంటల సమయంలో ప్రమాదం జరిగి మృతి చెందితే ఫ్యాక్టరీ ప్రతినిధులెవరూ సాయంత్రం వరకూ పట్టించుకోలేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. మృతుని తరఫున కొందరు ప్రముఖులు అడిగినా ప్రమాదం జరిగిన 2నిమిషాల సమయంలోనే సీసీ కెమెరాలు ఎందుకు ఆగాయో యాజమాన్యం నుంచి సమాధానం రాలేదన్నారు. యాజమాన్యం తప్పులేక పోతే సీసీ కెమెరా ఫుటేజీని ఎందుకు దాస్తున్నారని మృతుని బంధువులు ప్రశ్నించారు. పాలఫ్యాక్టరీ గేటు ముందు మృతదేహాన్ని ఉంచి బైఠాయించి నిరసన తెలిపారు. తమకు న్యాయం జరిగే వరకూ కదిలేదిలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాత్రి 7గంటల సమయంలో ఫ్యాక్టరీ యాజమాన్యం మృతుని కుటుంబానికి తగు న్యాయం చేస్తామన్న హామీ ఇవ్వడంతో ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిమిత్తం గన్నవరం ఆస్పత్రికి తరలించారు.

డివైడర్‌ను ఢీకొని చనిపోయాడు: ఫ్యాక్టరీ ప్రతినిధులు

ద్విచక్రవాహనంపై వస్తున్న రమేష్ ఎదురుగా వస్తున్న లారీని, రోడ్డుపై అడ్డంగా పెట్టిన బల్లను తప్పించే క్రమంలో డివైడర్‌ను ఢీకొని ఆకస్మాత్తుగా కింద పడిపోయాడని, తలకు బలమైన గాయమై తీవ్ర రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడని ఫ్యాక్టరీ ప్రతినిధులు చెబుతున్నారు.

ఎల్ అండ్ టీ సంస్థకు ఎల్వోయే అందజేత



ఎల్అండ్‌టీ సంస్థ ప్రతినిధులకు ఎల్వోయే అందజేస్తున్న సీఆర్డీయే కమిషర్ కన్నబాబు

గవర్నర్‌పేట, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): రాజధాని నిర్మాణంలో అత్యంత ప్రాధాన్యత కలిగిన అమరావతి గవర్నమెంట్ కాంప్లెక్స్(ఏజీసీ)లో శాసనసభ భవన నిర్మాణ పనులను దక్కించుకున్న ఎల్ అండ్ టీ సంస్థకు శనివారం నగరంలోని ప్రధాన కార్యాలయంలో సీఆర్డీయే కమిషనర్ కె.కన్నబాబు లెటర్ ఆఫ్ అవార్డు(ఎల్వోయే) అందజేశారు. ఎల్ అండ్ టీ సంస్థ డిప్యూటీ జనరల్ మేనేజర్ వి.మణికండన్, ప్రాజెక్టు మేనేజర్ ఎల్.ప్రభాకర్ ఎల్వోయేను అందుకున్నారు. అమరావతిలో నిర్మిస్తున్న శాసనసభ భవనానికి సంబంధించి రూ.617.33 కోట్ల విలువ చేసే పనులకు ఎల్ అండ్ టీ సంస్థ ఎల్1గా నిలిచింది. ఈఎన్‌సీ ఆర్.గోపాలకృష్ణ రెడ్డి, సీఆర్డీయే హౌసిం గ్- బిల్డింగ్స్ విభాగ చీఫ్ ఇంజినీర్ జీవీ పళ్లంరాజు పాల్గొన్నారు.

రోడుపైనే ఇసుక డంపింగ్

- తరచూ ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు

(ఆంధ్రజ్యోతి-పెనమలూరు): కానూరు పంట కాల్వ రోడ్డులోని పెట్రోలు బంకు ఎదురుగా కొందరు వ్యక్తులు ఇసుకను రోడ్డు మధ్యలో డంపింగ్ చేస్తున్నారు. ఇసుక రోడ్డు మధ్యలోకి రావడంతో రోడ్డుపై రాకపోకలకు అంతరాయం కలిగి వాహనదారులు ఇబ్బంది. ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు తెలిపారు. పంట కాల్వ రోడ్డు వెంట ఉదయం, సాయంత్రం అత్యంత రద్దీగా ఉంటుంది. ద్విచక్రవాహనదారులు ఇసుక కుప్ప మీదకు వచ్చి స్కిడ్ అయి ప్రమాదాలు జరుగుతున్నాయని అంటున్నారు. ఈ రోడ్డుమీదుగా పదుల సంఖ్యలో ప్రభుత్వ అధికారులు నిత్యం ప్రయాణిస్తుంటారని, ఎవరూ పట్టించుకోవడం లేదని అంటున్నారు. అధికారులు వెంటనే ఇసుకను తొలగింపజేయాలని, వాహనదారుల ఇబ్బందులు తీర్చాలని స్థానికులు కోరుతున్నారు.



కానూరు పంటకాల్వ రోడ్డుపై డంపింగ్ చేసిన ఇసుక

ఉద్యోగాల్లో క్రీడాకారులకు 3% రిజర్వేషన్

- ఏపీపీఎస్సీతో సహా ఇతర నియామకాలకు వర్తింపు
- వివిధ పరిశీలనల తర్వాతే ఎంపిక
- మార్గదర్శకాలు విడుదల చేసిన ప్రభుత్వం

అమరావతి, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రతిభావంతులైన క్రీడాకారులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో 3 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ప్రభుత్వ శాఖలు, స్థానిక సంస్థలు, ప్రభుత్వ రంగ సంస్థలు, పోలీసు, ఎక్సైజ్, అటవీ శాఖతో సహా యూనిఫాం సర్వీసుల్లో ఈ రిజర్వేషన్లను అమలు చేయనుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 2024-29కి సంబంధించిన స్పోర్ట్స్ పాలసీని ప్రకటించింది. క్రీడాకారులకు 3 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని అందులో ప్రకటించింది. ఈ నేపథ్యంలో తాజాగా 3 శాతం రిజర్వేషన్లకు సంబంధించిన మార్గదర్శకాలు విడుదల చేసింది. ఏపీపీఎస్సీ ద్వారా లేదా శాఖల వారీగా, డిస్ట్రిక్ సెలక్షన్ కమిటీ ద్వారా చేపట్టే ప్రతీ నియామకాల్లో క్రీడాకారులకు రిజర్వేషన్లు అమలు చేయనున్నారు. క్రీడా కోటా కింద అందించే రిజర్వేషన్లకు పోటీ పరీక్షల అవసరం లేదు. ప్రత్యక్ష నియామకాల్లో అర్హత కలిగిన ప్రతిభావంతులైన క్రీడాకారులకు సమాంతర రిజర్వేషన్లు అమలు కానున్నాయి. ఈ మార్గదర్శకాలు స్పోర్ట్స్ పాలసీ ప్రకటించినప్పటి నుంచే ఐదేళ్ల అమల్లో ఉంటాయి.

వీరికి 'గ్రూప్స్' ఉద్యోగాలకు అర్హత

ఒలింపిక్స్, పారా ఒలింపిక్స్, ఆసియన్ గేమ్స్, ఆసియన్ పారా గేమ్స్, కామన్వెల్త్ గేమ్స్, కామన్వెల్త్ పారా గేమ్స్‌లో స్వర్ణం, రజతం పతకాలు సాధించిన వారికి మాత్రమే గ్రూప్- 1, 2 విభాగాల్లో నేరుగా ఉద్యోగాలు కల్పించే వెసులుబాటు కల్పించింది. కాంస్య పతకంతో పాటు క్రీడల్లో పాల్గొన్న సర్టిఫికెట్ ఉంటే గ్రూప్- 3 విభాగంలో ఉద్యోగాలకు ప్రభుత్వం అర్హత కల్పించింది. మిగతా క్రీడల్లో గ్రూప్- 3కి మాత్రమే అర్హత ఉంటుంది.

స్క్రీనింగ్ కమిటీ పని ఇదీ..

శాప్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌తో ప్రభుత్వం ఒక స్క్రీనింగ్ కమిటీని కూడా నియమించింది. ఇందులో ఇద్దరు సీనియర్ జిల్లా క్రీడా అధికారులు, గిరిజన క్రీడా అధికారి, శాప్‌లోని టెక్నికల్ అసిస్టెంట్ డైరెక్టర్లు సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ క్రీడాకారులు అందించిన సర్టిఫికెట్లను క్షుణ్ణంగా పరిశీలించడం, సదరు సర్టిఫికెట్లు వాస్తవికతను (జన్యూనిటీ) నిర్ధారించాల్సి ఉంటుంది. క్రీడాకారులు సాధించిన పతకాలు, సర్టిఫికెట్లను తనిఖీ చేయడంతో పాటు క్రీడాకారులు స్పోర్ట్స్‌లో పాల్గొన్న సమయంలో తీసుకున్న ఫోటోలు, అధికారిక ప్రకటనలు.. ఇలా ప్రతిదాన్ని పరిశీలించాలి.

రాష్ట్రస్థాయి కమిటీలో ఇలా..

రాష్ట్రస్థాయి కమిటీలో క్రీడాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి లేదా ముఖ్య కార్యదర్శి చైర్మన్‌గా ఉంటారు. సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి, నియామకాలు చేసే శాఖకు చెందిన ముఖ్య కార్యదర్శి సభ్యులుగా ఉంటారు. క్రీడాప్రాధికార సంస్థ (శాప్) ఎండీ మెంబర్ కన్వీనర్‌గా కమిటీలో ఉంటారు. శాప్ ఎండీ రాష్ట్రస్థాయి కమిటీ సమావేశానికి ఏర్పాట్లు చూసుకోవాల్సి ఉంటుంది. ఈ కమిటీ శాఖలు, కేడర్ వారీగా ఉద్యోగాలపై సమీక్ష నిర్వహించాలి. ప్రాథమిక మెరిట్ లిస్ట్‌ను సిద్ధం చేసి స్క్రీనింగ్ కమిటీకి పంపించాలి. ఈ కమిటీ 15 రోజుల వ్యవధిలో మెరిట్ లిస్ట్ సిద్ధం చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత అభ్యంతరాలు లేకపోతే రాష్ట్రస్థాయి కమిటీ తుది మెరిట్ లిస్ట్‌ను విడుదల చేయాల్సి ఉంటుంది. దీన్ని మెంబర్ కన్వీనర్ ఆయా శాఖలకు పంపించాల్సి ఉంటుంది. రాష్ట్ర స్థాయి కమిటీ ఆమోదించిన తుది జాబితా ఆధారంగా ఉద్యోగాలు కల్పిస్తారు.

మెగా డీఎస్సీ వచ్చేసింది

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటన వెలువడనుండటం విశేషం. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపల్ పాఠశాలల్లో 13,192 పోస్టులు భర్తీ చేయనున్నట్లు పాఠశాల విద్యా శాఖ పేర్కొంది. ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్‌తో పాటు 52 ప్రిన్సిపాల్, 273 పీజీటీ, 1718 టీజీటీ పోస్టులను రాష్ట్ర, జోన్ స్థాయి కోటాలో భర్తీ చేయనుంది. నోటిఫికేషన్ జారీ అయిన తర్వాత 45 రోజుల్లో రాత పరీక్షలు ప్రారంభమవుతాయి. జూన్ 6న ప్రారంభమయ్యే పరీక్షలు జూలై 6 వరకు కొనసాగుతాయి. పరీక్షలు ముగిసిన వెంటనే ఎప్పటికప్పుడు ప్రాథమిక 'కీ'ని విడుదల చేస్తారు. కాగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక డీఎస్సీ ఫైలుపైనే చంద్రబాబు తొలి సంతకం చేశారు. ఆ వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయాలని భావించారు. కానీ టెట్ నిర్వహణ కోసం కొంతకాలం వాయిదా వేశారు. ఈలోగా ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టులో అనుకూలమైన తీర్పు రావడంతో రెండోసారి వాయిదా పడింది. తాజాగా వర్గీకరణ ప్రక్రియ పూర్తికావడంతో మెగా డీఎస్సీ షెడ్యూల్ జారీ చేశారు.

ఎవరి హయాంలో ఎన్ని డీఎస్సీ లంటే...

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి మొత్తంగా తెలుగుదేశం ప్రభుత్వమే అత్యధిక డీఎస్సీలు ప్రకటించింది. టీడీపీ ప్రభుత్వాల్లోనే ఎక్కువమంది ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందారు. ఎన్టీఆర్ హయాంలో 1984, 1986, 1989ల్లో మూడు డీఎస్సీలు ఇచ్చారు. కోట్ల విజయభాస్కరరెడ్డి హయాంలో 1994లో ఒక్క నోటిఫికేషన్ ఇచ్చారు. చంద్రబాబు హయాంలో 1996, 1998, 2000, 2001, 2002, 2003 సంవత్సరాల్లో డీఎస్సీ నోటిఫికేషన్లు ఇచ్చారు. విభజిత రాష్ట్రంలో 2014, 2018ల్లో రెండు డీఎస్సీలు ప్రకటించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వంలో 2006, 2008ల్లో రెండు నోటిఫికేషన్లు, కిరణ్‌కుమార్ రెడ్డి హయాంలో 2012లో ఒక నోటిఫికేషన్ ఇచ్చారు. జగన్ హయాంలో ఒక్క టీచర్ పోస్టు భర్తీ చేయలేదు. ఎన్నికలకు ముందు హడావిడిగా 6,500 పోస్టులతో నోటిఫికేషన్ జారీ చేయగా, అది మధ్యలోనే ఆగిపోయింది. 2018లో రాష్ట్రంలో చివరిగా ఇచ్చిన డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా 7,729 పోస్టులు భర్తీ చేశారు.

మేనేజ్‌మెంట్ల వారీగా పోస్టుల వివరాలు

మేనేజ్‌మెంట్	పోస్టులు
ప్రభుత్వ, జడ్పీ, ఎంపీపీ, మున్సిపల్ పాఠశాలలు	13,192
గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు	881
జువైనల్ వెల్ఫేర్ శాఖ పాఠశాలలు	15
విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలు	31
ఏపీఆర్ఎస్, ఏపీఎంఎస్, ఏపీ సోషల్, బీసీ, గిరిజన సంక్షేమ పాఠశాలలు	2,228
మొత్తం	**16,347**

మెగా డీఎస్సీ షెడ్యూలు ఇలా...

నోటిఫికేషన్ ప్రచురణ	ఏప్రిల్ 20
ఫీజులు చెల్లింపు, దరఖాస్తుల గడువు	ఏప్రిల్ 20 - మే 15
నమూనా పరీక్షలు	ఏప్రిల్ 20 నుంచి
హాల్‌టికెట్లు డౌన్‌లోడ్	మే 30 నుంచి
పరీక్ష తేదీలు	జూన్ 6 - జూలై 6
ప్రాథమిక కీ విడుదల	పరీక్ష పూర్తయిన రెండో రోజు విడుదల చేస్తారు
అభ్యంతరాల స్వీకరణ	పరీక్ష పూర్తయిన తర్వాత 7 రోజుల పాటు స్వీకరిస్తారు
తుది కీ విడుదల	అభ్యంతరాల స్వీకరణ ముగిసిన 7 రోజుల్లో విడుదల చేస్తారు
ఫలితాల ప్రకటన	తుది కీ విడుదల చేసిన 7 రోజుల తర్వాత ప్రకటిస్తారు

జేఈఈ టాపర్లలో మనోళ్లు నలుగురు

(మొదటి పేజీ తరువాయి)

సాధించగా.. రెండో విడత ఫలితాల్లో ఈ సంఖ్య ముగ్గురికి చేరింది. వంద పర్సంటైల్ సాధించిన తెలంగాణ విద్యార్థుల్లో హర్ష్ ఎ.గుప్తా, వంగాల అజయ్‌రెడ్డి, బానిబ్రతా మాజీ ఉన్నారు. హైదరాబాద్‌కు చెందిన బానిబ్రతా మాజీ.. సెషన్-1లోనూ 100 పర్సంటైల్ సాధించారు. కాగా, హైదరాబాద్ విద్యార్థి వంగాల అజయ్‌రెడ్డి ఈడబ్ల్యూఎస్ విభాగంలో టాపర్‌గా నిలిచాడు. మొదటి విడతలో వంద పర్సంటైల్ సాధించిన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సాయిమనోజ్ఞ గుత్తికొండ రెండో విడతలోనూ అదే స్థాయిలో సత్తా చాటింది. మొత్తంగా వంద పర్సంటైల్ సాధించిన 24 మందిలో ఏడుగురితో రాజస్థాన్ రాష్ట్రంమొదటి స్థానంలో నిలవగా, తెలంగాణ, మహారాష్ట్ర చెరో మూడు ర్యాంకులు సాధించి రెండో స్థానంలో నిలిచాయి. ఇక.. జేఈఈ మొదటి, రెండోవిడతలో వచ్చిన పర్సంటైల్ ఆధారంగా జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష అర్హతకు కటాఫ్ మార్కులను ఎన్టీఏ ప్రకటించింది. అడ్వాన్స్‌డ్‌కు మొత్తం 2,50,236 మంది అర్హత సాధించినట్లు పేర్కొంది. అన్‌రిజర్వుడ్ క్యాటగిరీలో 100 నుంచి 93.10 పర్సంటైల్ సాధించిన 97,321 విద్యార్థులను అర్హులుగా ప్రకటించింది. అలాగే ఓబీసీలో 93.09 నుంచి 79.43 పర్సంటైల్ సాధించిన 67,614 మంది విద్యార్థులు అర్హత సాధించినట్లు తెలిపింది. ఎస్సీ విభాగంలో 93.09 నుంచి 61.15 పర్సంటైల్ సాధించిన 37,519 మంది విద్యార్థులు అర్హులుగా పేర్కొంది. ఈడబ్ల్యూఎస్‌లో 93.09 నుంచి 80.38 పర్సంటైల్ సాధించిన 25,009 మంది, ఎస్టీలో 93.09 నుంచి 47.90 సాధించిన 18,823 మంది తదుపరి పరీక్షకు అర్హత సాధించారు.

3,950 మంది వికలాంగులకు అవకాశం..

ఈసారి జేఈఈ మెయిన్ పరీక్షలకు హాజరైన వికలాంగుల్లో 91.56 శాతం మంది అడ్వాన్స్‌డ్‌కు అర్హత పొందారు. మొత్తం 4,314 మంది హాజరుకాగా.. వీరిలో 3,950 మంది జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించారు. జేఈఈ పరీక్షలో వికలాంగ విద్యార్థులకూ అవకాశాలు కల్పించాలన్న ఉద్దేశంతో ఈసారి కనీస కటాఫ్ స్కోర్‌ను 0.0079349కి తగ్గించామని ఎన్టీఏ తెలిపింది. కాగా, జేఈఈ రెండో విడతలో మొత్తం 133 మంది విద్యార్థుల ఫలితాలను ప్రకటించలేదు. వీరిలో 110 మంది పరీక్షలో అనైతిక పద్ధతులు పాటించినందుకు, మరో 23 మంది ఫొటోలు, బయోమెట్రిక్‌లో సమస్యలు ఉండటంతో తాత్కాలికంగా (విత్‌హెల్డ్) నిలిపివేశారు. తాము కోరిన వివరాలు నిర్దిష్ట కాల పరిమితిలో సమర్పిస్తే ఫలితాలు విడుదల చేస్తామని ఎన్టీఏ తెలిపింది.

ముంబై ఐఐటీలో సీట్లు సాధించడమే లక్ష్యమంటున్న టాపర్లు

రాజేంద్రనగర్‌లోని తెలంగాణ గిరిజన ఐఐటీ స్టడీ సెంటర్‌కు చెందిన 41 మంది విద్యార్థులు జేఈఈ మెయిన్‌లో ఉత్తమ పర్సంటైల్ సాధించి అడ్వాన్స్‌డ్‌కు అర్హత పొందారు. మెయిన్ ఫలితాల్లో ఏడుగురు 90 నుంచి 96 పర్సంటైల్ సాధించగా, 13 మంది 80 నుంచి 90 లోపు పర్సంటైల్ సాధించారు. మాదాపూర్‌లోని గౌలిదొడ్డి తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో శిక్షణ పొందిన విద్యార్థుల్లో 15 మంది 90 పర్సంటైల్, 67 మంది 70 నుంచి 80 పర్సంటైల్ సాధించినట్లు అధికారులు తెలిపారు. అక్కడే శిక్షణ పొందిన బాలికల్లో 62 మంది క్వాలిఫై కాగా, అక్షర అనే విద్యార్థిని 95.74, భవ్యశ్రీ 95.75 పర్సంటైల్‌తో ప్రతిభ కనబరిచారని వెల్లడించారు.

ముంబై ఐఐటీలో సీటే లక్ష్యం: అజయ్‌రెడ్డి

ముంబై ఐఐటీలో సీఎస్ఈ సీటు సాధించడమే తన లక్ష్యమని వంగా అజయ్‌రెడ్డి తెలిపారు. జేఈఈ మొదటి సెషన్‌లో 99.996 పర్సంటైల్ రాగా, రెండవ సెషన్‌లో 100 పర్సంటైల్ లభించిందని తెలిపాడు. కళాశాల నిర్వహించే మాక్ టెస్ట్‌లకు నిరంతరం హాజరవుతూనే, రోజుకు దాదాపు 10 గంటలు చదివానని చెప్పాడు. తన ప్రిపరేషన్‌కు కళాశాల అధ్యాపకులు సంపూర్ణంగా తోడ్పాటునందించారని పేర్కొన్నాడు. ఖరగ్‌పూర్ ఐఐటీలో చదువుతున్న సోదరుడే తనకు స్ఫూర్తి అని, అతను అందించిన ప్రిపరేషన్ చిట్కాలు ఫస్ట్ ర్యాంకు సాధనకు బాగా ఉపయోగపడ్డాయని తెలిపాడు. సెలవు రోజుల్లో మినహా ఇతర వ్యాపకాల జోలికి పోలేదన్నాడు. తన తండ్రి వెంకట రమణారెడ్డి కర్నూలులో కిచెన్ అప్లయెన్సెస్ వ్యాపారం చేస్తున్నట్లు తెలిపాడు. కాగా, మరో టాపర్ బనిబ్రత మాజీ కూడా ముంబై లేదా ఢిల్లీ ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ లేదా ఏరోనాటికల్ ఇంజనీరింగ్ సీటు సాధించడమే లక్ష్యమని చెప్పాడు. స్వరాష్ట్రం పశ్చిమ బెంగాల్ కాగా, తండ్రి కోల్‌కతాలోని డీఆర్‌డీవోలో సైంటిస్ట్‌గా పనిచేస్తున్నారని, తల్లి గృహిణి అని వెల్లడించారు.

అత్యుత్తమ ఐఐటీలో సీటే లక్ష్యం..

జేఈఈ అడ్వాన్స్‌లోనూ మెరుగైన ర్యాంకు సాధించి అత్యుత్తమ ఐఐటీలో ఈసీఈ సీటు సాధించడమే లక్ష్యం. ప్రణాళిక ప్రకారం రోజుకు 12 గంటలకుపైగా చదువుతూ పరీక్షకు సిద్ధమయ్యా. అధ్యాపకులు ఇచ్చిన మార్గదర్శకాలు పాటిస్తూ లక్ష్యం కోసం కృషి చేశా. పదవ తరగతిలో 588, ఇంటర్‌లో 987 మార్కులు సాధించా. తల్లి గుత్తికొండ పద్మజ ప్రైవేటు ఆస్పత్రిలో ఏవోగా పనిచేస్తున్నారు. తండ్రి కిశోర్ ఇంజనీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్.

- గుత్తికొండ సాయిమనోజ్ఞ, 18వ ర్యాంకర్

బాంబే ఐఐటీలో సీటు సాధిస్తా

జేఈఈ అడ్వాన్స్ ద్వారా ఐఐటీ బాంబేలో సీఎస్ఈ సీటు సాధించడమే లక్ష్యం. ఒత్తిడిని అధిగమించి జేఈఈ పరీక్ష కోసం ప్రతిరోజు సగటున 14 గంటలు చదివాను. తండ్రి శ్రీనివాసరెడ్డి ల్యాబ్ అసిస్టెంట్, తల్లి లక్ష్మీనరసమ్మ గృహిణి.

-కె.సాయి షణ్ముఖ రెడ్డి, 52వ ర్యాంకు

ఎస్టీ క్యాటగిరీలో ఖమ్మం విద్యార్థికి 5వ ర్యాంక్



ఖమ్మం ఖానాపురం హవేలి: ఏఈఈ మెయిన్ ఫలితాల్లో ఖమ్మం నగరానికి చెందిన అజ్మీరా రోషిక్ మణిదీప్ ఎస్టీ క్యాటగిరీలో ఆలిండియా 5వ ర్యాంకు సాధించాడు. ఓపెన్ క్యాటగిరిలో 1765వ ర్యాంకు సాధించాడు. రోషిక్ మణిదీప్ దండ్రి అజ్మీర బాలాజీ అసిస్టెంట్ ఇంజనీర్‌గా పని చేస్తుండగా, తల్లి నీలాబాయి గృహిణిగా ఉన్నారు.

టీజీ09ఎఫ్0001 @ 7.75 లక్షలు

ఫ్యాన్సీ నంబర్ దక్కించుకున్న బాలకృష్ణ

ఖైరతాబాద్ ఆర్టీఏకు 37.15 లక్షల ఆదాయం

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ప్రముఖ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ రూ.7.75 లక్షలు చెల్లించి కారు ఫ్యాన్సీ నంబరు టీజీ09ఎఫ్0001ను దక్కించుకున్నారు. శనివారం కొత్త సిరీస్ ప్రారంభం కావడంతో హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయంలో ఫ్యాన్సీ నంబర్ల కోసం బిడ్డింగ్ నిర్వహించారు. ఈ బిడ్డింగ్‌లో తెలంగాణ రవాణా శాఖకు రూ.37.15 లక్షల ఆదాయం వచ్చినట్లు అధికారులు ఓ ప్రకటనలో వెల్లడించారు. టీజీ09ఎఫ్0009 నంబరును రూ.6.70 లక్షలకు కమలయ్యహిస్ కంపెనీ దక్కించుకుంది. టీజీ 09ఈ9999 నంబరును రూ.99,999కు ఎకో డిజైన్ స్టూడియో, టీజీ 09ఎఫ్0005 నంబరును రూ.1,49,999కు మెసర్స్ జెట్టి ఇన్ ఫ్రా ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సొంతం చేసుకున్నాయి. టీజీ09ఎఫ్0007 నంబరును రూ.1,37,779కు శ్రీనివాస్ నాయుడు, టీజీ09 ఎఫ్0019 నంబరును రూ.60 వేలకు బాలగప్ప శివలింగప్ప దక్కించుకున్నారు.

బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన విధించండి: మిథున్ చక్రవర్తి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 19: పశ్చిమ బెంగాల్‌లో శాంతిభద్రతలను పరిరక్షించడానికి రాష్ట్రపతి పాలన విధించాలని ప్రముఖ సినీ నటుడు, బీజేపీ ఎంపీ మిథున్ చక్రవర్తి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ముర్షిదాబాద్ జిల్లాలోని షంషేర్‌గంజ్, సుతి, ధూలియాన్, జంగీపూర్‌లలో ఏప్రిల్ 8 నుంచి 12 వరకూ హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయి. ఈ క్రమంలో ముగ్గురు చనిపోయారు. వందల మంది అరెస్టు అయ్యారు. వేలాది మంది నిరాశ్రయులయ్యారు. పరిస్థితిని అదుపులోకి తేవడానికి రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర సంస్థలు జోక్యం చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో ఎంపీ మిథున్ చక్రవర్తి స్పందించారు. 'కేంద్ర హోం మంత్రిని నేను ఇప్పటికే చాలా సార్లు అభ్యర్థించాను. మళ్లీ మళ్లీ అభ్యర్థిస్తున్నా. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన పెట్టండి. లేకుంటే కనీసం ఎన్నికలకు రెండు నెలల ముందు ఆర్మీని దించండి. స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకుంటారు' అని ఆయన పేర్కొన్నారు. మరోవైపు సీఎం మమతా బెనర్జీ అభ్యర్థనను తోసిరాజని ఆ రాష్ట్ర గవర్నర్ సీవీ ఆనంద్ బోస్ శుక్రవారం మాల్దా చేరుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన సహాయక శిబిరాలను సందర్శించారు. బాధితులు, ప్రత్యేకించి మహిళలతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, 'తామంతా భయాందోళనలకు గురయ్యామని వారు చెప్పారు. దుష్కరులు తమ ఇళ్లలోకి చొరబడి, భౌతికంగా దాడి చేశారన్నారు. నోటికి పట్టని తిట్లతో దూషించారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు రక్షణ కావాలని వారంతా ముక్త కంఠంతో కోరారు. తమ ఇళ్లు తమకు కావాలని, కూలిన వాటి స్థానంలో కొత్తవి నిర్మించాలని, జీవనోపాధి చూపించాలని వారు కోరారు' అని తెలిపారు. వారి ఆవేదనను అర్థం చేసుకున్నానని, వారి దీనస్థితిని తెలుసుకొని చలించిపోయానని అన్న గవర్నర్... తప్పనిసరిగా తగు చర్యలు తీసుకుంటానని స్పష్టం చేశారు. మరోవైపు జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ విజయ రహత్కర్ నేతృత్వంలోని బృందం శిబిరాలను సందర్శించింది.

వైసీపీలా 'చెత్త' ప్రభుత్వం కాదు!

- పురపాలక మంత్రి నారాయణ వెల్లడి
- రాష్ట్ర వ్యాప్తంగా 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'
- పాలకొల్లులో మంత్రి నిమ్మల శ్రమదానం

నెల్లూరు(సిటీ)/పాలకొల్లు అర్బన్/గుంటూరు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): సమాజానికి మేలు చేయాలన్న లక్ష్యంతో సీఎం చంద్రబాబు సారథ్యంలో రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఆవిర్భవించిందని పురపాలక మంత్రి నారాయణ అన్నారు. వైసీపీ ప్రభుత్వం మాదిరిగా చెత్తపై పన్నువేసి ప్రజలను పీడించుకుతినే చెత్త ఆలోచనలు తమ ప్రభుత్వానికి లేవన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి నెలా మూడో శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఈ నెల ఈ-చెక్ పేరుతో ఎలక్ట్రానిక్ వ్యర్థాల నిర్వహణ, వాటిని ఆదాయంగా మార్చుకునే విధానాలపై అవగాహన కల్పించారు. నెల్లూరులో జరిగిన కార్యక్రమంలో మంత్రి నారాయణ పాల్గొన్నారు. నగరంలోని వీఆర్సీ కూడలి నుంచి నర్తకి సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. నర్తకి సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి మంత్రి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి నారాయణ మాట్లాడుతూ.. గత వైసీపీ సర్కారు రూ.లక్షల కోట్ల అప్పులతోపాటు 85 లక్షల టన్నుల చెత్తను మిగిల్చిందని, దానిని బయోమైనింగ్ ద్వారా శాస్త్రీయ పద్ధతుల్లో నిర్వీర్యం చేస్తున్నట్లు చెప్పారు. ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ కృష్ణయ్య, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ అనిల్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మట్టిని తలపై పెట్టుకుని మోస్తున్న మంత్రి నిమ్మల

పలుగు, పార పట్టిన మంత్రి నిమ్మల

పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో నిర్వహించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు పారిశుధ్య కార్మికులతో కలిసి శ్రమదానం చేశారు. స్థానిక 30వ వార్డులోని మావుళ్లమ్మ పేటలో ఉన్న బాక్స్‌కెనాల్, చుట్టుపక్కల పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలను స్వయంగా పారతో తవ్వి, తట్టలతో తలపై పెట్టుకుని ట్రాక్టర్‌లో వేశారు. మంత్రి మాట్లాడుతూ.. గత వైసీపీ హయాంలో జగన్ ప్రభుత్వం రాష్ట్రాన్ని మురుగు ఆంధ్రప్రదేశ్‌గా మార్చడంతోపాటు 85 లక్షల టన్నుల చెత్తను వారసత్వంగా ఇచ్చిందన్నారు. ఆనాడు చెత్తపై పన్ను విధించారని, తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే చెత్తపై పన్ను రద్దు చేశామని తెలిపారు.

త్వరలో ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాలు: విజయానంద్

ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్ ఉపకరణాల వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో ప్రాసెస్ చేయడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని, అదేవిధంగా ఆర్థికంగా కూడా వృద్ధి చెందవచ్చని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) కె. విజయానంద్ తెలిపారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ-వ్యర్థాల నిర్వహణపై శనివారం గుంటూరులో వర్క్‌షాపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్వచ్ఛంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, సీఎస్ విజయానంద్ పాల్గొన్నారు. సీఎస్ మాట్లాడుతూ.. ఈ-వ్యర్థాల సేకరణకు రాష్ట్ర వ్యాప్తంగా త్వరలో రెడ్యూస్, రీయూజ్, రీసైక్లింగ్(ఆర్‌ఆర్‌ఆర్) సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ-వ్యర్థాలను ఆదాయ మార్గంగా మలుచుకునే ప్రత్యేక విధానాన్ని సీఎం చంద్రబాబు త్వరలో తీసుకురానున్నారన్నారు. కొమ్మారెడ్డి పట్టాభిరామ్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం చెత్తపై పన్ను వేస్తే, ప్రస్తుత ప్రభుత్వం వ్యర్థాలను సైతం ఆదాయంగా మార్చుతోందని చెప్పారు. రానున్న బడ్జెట్‌లో వ్యర్థాల నుంచి వచ్చిన రెవెన్యూను కూడా ప్రకటించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

గోవుల గడ్డీ తిన్నారు

- గోశాలలోని ఆవులను ఒంగోలులో అమ్మారు
- మాజీ డైరెక్టర్ హరినాథరెడ్డి అక్రమాలు ఎన్నో
- టీటీడీ, గోశాలలోని అవినీతిపై ఏసీబీ విచారణకు సీఎంను కోరుతాం: టీటీడీ చైర్మన్

తిరుపతి(టీటీడీ), ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో తిరుపతిలోని ఎస్వీ గోశాలలో గోవులకు పెట్టే గడ్డిని సైతం తినేశారని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు అన్నారు. వారం రోజులుగా కొందరు మీడియాలో, సోషల్ మీడియాలో గోశాలపై పనిగట్టుకొని అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. శనివారం గోశాలను ఆయన సందర్శించారు. గోవులను పరిశీలించి వాటికి అందిస్తున్న దాణా, నీరు తదితర విషయాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. 2022-2024 నడుమ రెండేళ్ల పాటు టీటీడీ గోసంరక్షణ సభ్యుడిగా ఉన్న కోటి శ్రీధర్‌ను సంప్రదించామని, ఆయన చెప్పిన విషయాలు విస్తుపోయేలా ఉన్నాయని అన్నారు. గోశాలలోని గోవులను ఒంగోలులో అమ్మారని, అడగడానికి శ్రీధర్ వస్తే అప్పటి గోశాల డైరెక్టర్ హరినాథరెడ్డి కనీసం అనుమతి కూడా ఇవ్వలేదని చెప్పారు. కోర్టులో పిల్ దాఖలు చేస్తామని బెదిరింపులు వస్తున్నాయని, దీనితో పాటు గత ఐదేళ్ల కాలంలో స్వామివారి నిధుల అవకతవకలపై కూడా పిల్ వేయాలన్నారు. గతంలో పింక్ డైమండ్‌పై కోర్టులో కేసు వేశారని, ఆ కేసు పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఈ 10 నెలల కాలంలో టీటీడీలో ఎలాంటి అవినీతి జరగలేదని హామీ ఇస్తానన్నారు. గోశాల డైరెక్టర్‌గా పనిచేసిన హరినాథరెడ్డి అనేక అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. టీటీడీ, గోశాలలో జరిగిన అవినీతి, అక్రమాలపై సీఎంను కలిసి ఏసీబీ విచారణ చేయాలని కోరనున్నట్లు వెల్లడించారు. జనతా పార్టీ నాయకుడు సుబ్రహ్మణ్యస్వామి వ్యాఖ్యలపై స్పందిస్తూ.. టీటీడీ అంటే ఒంటికాలుపై వచ్చే ఆయన కేసు వేస్తామంటున్నారని, గత ఐదేళ్లలో టీటీడీలో జరిగిన అవినీతిపై కూడా కేసు వేయాలని డిమాండ్ చేశారు. టీటీడీలో మొదటి విడత అన్యమతస్థులపై చర్యలు ప్రారంభించామని, త్వరలో మరి కొందరిపై చర్యలుంటాయని తెలిపారు. ఆలిండియా గో రక్షక్ దళ్ వ్యవస్థాపకుడు కోటి శ్రీధర్ మాట్లాడుతూ.. టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తనను గోశాల గోసంరక్షణ కోసం రెండేళ్ల వ్యవధితో నియమించారన్నారు. అప్పట్లోనే హరినాథరెడ్డి గోశాలలోకి ఎవరినీ రానివ్వకుండా చేశారన్నారు. రూ.5 కోట్ల విలువైన గడ్డి కొని రూ.8 కోట్ల వరకూ బిల్లులు పెట్టారని, మందులతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కొనుగోలు చేసిన గోవుల్లో భారీ అవినీతి చేశారని, ఈ విషయాన్ని వైవీ సుబ్బారెడ్డికి కూడా చెప్పినట్లు వివరించారు. గోశాలలో దూడలకు లెక్కలు లేవని ఆరోపించారు. గోవులు రకరకాల కారణాలతో మరణిస్తుంటాయని, దానిని రాజకీయం చేయడం మంచిది కాదన్నారు. టీటీడీ బోర్డు సభ్యులు భానుప్రకాశ్ రెడ్డి, శాంతారాం, నరేష్ కుమార్, గో రక్షక్ దళ్ అధ్యక్షుడు కాలు సింగ్, గోశాల ఇన్‌చార్జి డైరెక్టర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



తిరుపతిలోని ఎస్వీ గోశాలలో గోవులను పరిశీలిస్తున్న టీటీడీ చైర్మన్, బోర్డు సభ్యులు

ఫౌండేషన్ పాఠశాలలు వద్దు: ఏపీటీఎఫ్

అమరావతి, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ఒకటి, రెండు తరగతులతో ఫౌండేషన్ పాఠశాలల ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహంచుకోవాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ ఫౌండేషన్ స్కూల్స్ పేరుతో గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను ఎత్తివేయడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించింది. గత వైసీపీ ప్రభుత్వం సంస్కరణల పేరుతో విద్యారంగాన్ని విధ్వంసం చేయగా.. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా గంటకొక విధానం చొప్పున నిర్ణయాలు తీసుకుంటూ ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులను గందరగోళానికి గురి చేస్తోందని మండిపడింది. గత ప్రభుత్వం 6 రకాల పాఠశాలలను ఏర్పాటు చేస్తే.. ప్రస్తుత ప్రభుత్వం 8 రకాల పాఠశాలలను ఏర్పాటు చేయడం అశాస్త్రీయమని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చెన్నుపాటి మంజుల, కె.భానుమూర్తిలు శనివారం ఒక ప్రకటనలో ఖండించారు. అన్ని ప్రాథమిక పాఠశాల్లోనూ ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి ఒకే విధంగా ఉండాలని వారు డిమాండ్ చేశారు. ప్రాథమికోన్నత పాఠశాలలన్నింటిలోనూ అవసరమైనంతమంది సెకండరీగ్రేడ్ టీచర్స్‌ను నియమించాలని కోరారు.

రాఘవాచారి సంపాదకీయాల సంపుటి ఆవిష్కరణ



పుస్తకావిష్కరణ చేస్తున్న సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, కూనంనేని సాంబశివరావు, వి.శ్రీనివాసరావు, కె. రామకృష్ణ తదితరులు

విజయవాడ(మొగల్రాజపురం), ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): దేశంలో రాజ్యాంగ వ్యవస్థను గుప్పెట్లో పెట్టుకుని పరిపాలన చేస్తున్నారని, దీనివల్ల మళ్లీ వేర్పాటు వాదం మొదలవుతోందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ చెప్పారు. విశాలాంధ్ర పూర్వ సంపాదకులు సి.రాఘవాచారి సంపాదకీయాల నాలుగో సంపుటి ఆవిష్కరణ కార్యక్రమం శనివారం మొగల్రాజపురం పీబీ సిద్ధార్థ ఆడిటోరియంలో జరిగింది. నారాయణ మాట్లాడుతూ ఫెడరల్ వ్యవస్థను నాశనం చేస్తున్నారని, రాబోయే రోజుల్లో ఉత్తర, దక్షిణ భారతంగా విడిపోవడానికి ప్రస్తుత ఫాసిస్టు పాలన దోహదం చేస్తుందని వ్యాఖ్యానించారు. సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ, రాఘవాచారి ట్రస్టు సభ్యుడు ప్రొఫెసర్ బుడ్డిగ జమిందార్, సీపీఐ జాతీయ కార్యదర్శి వర్గ సభ్యులు అక్కినేని వనజ, సి.రాఘవాచారి భార్య జ్యోత్స్న, కుమార్తె డాక్టర్ అనుపమ తదితరులు పాల్గొన్నారు.

విద్యావికాసానికి 'సమగ్ర' కృషి భేష్

- 'సమగ్ర శిక్ష' 25 ఏళ్ల ప్రస్థానంపై మంత్రి నారా లోకేశ్ స్పందన



అమరావతి, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల శారీరక, మానసిక, విద్యావికాసానికి 25 ఏళ్లుగా సమగ్ర శిక్ష చేస్తున్న కృషి ప్రశంసనీయమని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఎక్స్‌లో పేర్కొన్నారు. 'సమగ్ర విద్య' ప్రయాణంలో భాగమైన ప్రభుత్వాలు, అధికార యంత్రాంగం, సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, వివిధ సంస్థలు, సంఘాలకు అభినందనలు తెలిపారు. 25 ఏళ్ల ప్రస్థానంలో ఎన్నో అవార్డులు, రివార్డులు సాధించిన సమగ్ర శిక్ష మరిన్ని లక్ష్యాలు చేరుకోవాలని ఆకాంక్షించారు. సమగ్ర శిక్ష పాతికేళ్ల ప్రస్థానాన్ని 'మన బడి' మాసపత్రికలో చక్కగా వివరించారని, ప్రభుత్వం చేపట్టిన విద్యా సంస్కరణలు, పథకాలు, కార్యక్రమాలను ప్రచారం కల్పిస్తున్న సంపాదక బృందానికి అభినందనలు తెలిపారు.

'నారా వారి' కుర్రోడు! చిన్న పల్లెలో పుట్టాడు! ఇంతింతై ఎదిగాడు! ఇతరులు అందుకోలేనంత ఎత్తున నిలిచాడు! 'ఒక సామాన్యుడు ఇంత స్థాయికి రాగలడు' అనేందుకు నిదర్శనంగా నిలిచాడు. ఆయనే... నారా చంద్రబాబు నాయుడు! ఉమ్మడి రాష్ట్రానికి రెండు సార్లు, విభజిత రాష్ట్రానికి రెండు సార్లు ఆయన ముఖ్యమంత్రి! అందరూ 1996లో ఉన్నప్పుడు ఆయన '2020' గురించి కలగన్నారు.. ఇప్పుడు 2025లో ఉంటూ... '2047'ను దర్శిస్తున్నారు. ఆయనొక స్వాప్నికుడు! రాజకీయాల్లో సాహసికుడు! లోతైన ఆలోచనల అపర 'చాణక్యుడు'! ఎవరికీ లొంగని మొండివాడు! అంతటి చంద్రబాబు నాయుడు నేడు తన జీవితంలో 'వజ్రోత్సవం'లో అడుగు పెడుతున్నారు. పైకి కనిపించే చంద్రబాబు వేరు! లోపల ఉండే చంద్రబాబు వేరు! బాల్యం, విద్యార్థి దశతో మొదలుకుని ఇప్పటిదాకా చంద్రబాబు జీవితంలో అనేక ఆసక్తికరమైన అంశాలున్నాయి! చంద్రబాబు స్నేహితులు, బంధువులు, ఆయనను సన్నిహితంగా చూసిన వారెందరినో పలకరించి, నాటి జ్ఞాపకాలను కదిలించి 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక కథనం...

పట్టిసీమను ప్రారంభిస్తూ...



పోలవరం భూమి పూజలో..





అమరావతికి అండగా...



ఒక సంకల్పానికి వజ్రోత్సవం!

నేడు చంద్రబాబు 75వ పుట్టిన రోజు.. నారావారిపల్లె నుంచి నాయకుడై ఎదిగి.. తండ్రి మొండితనం.. తల్లి శ్రమతత్వం. రెండూ కలిపితే నారా చంద్రబాబు..

రోజూ ఆరు కిలోమీటర్లు నడిచి బడికి.. విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు... సరైన వేదికగా మారిన ఎస్వీ యూనివర్సిటీ..

నిత్యం పదిమంది చుట్టూ ఉండాల్సిందే... పీజీలో ఉండగానే రాజకీయ అరంగేట్రం... ఎన్నికల ప్రచారంలో కొత్త ఒరవడి

అమరావతి శంకుస్థాపనలో...





1950 ఏప్రిల్ 20వ తేదీ.. అంటే, డెబ్బై అయిదేళ్ల కిందట... ఇదే రోజు! ఖర్జూరనాయుడు, అమ్మణ్ణమ్మ దంపతులకు నారా చంద్రబాబు నాయుడు జన్మించారు. ఖర్జూర నాయుడు మహా మొండిఘటం! ఏదైనా అనుకుంటే.. అది అయ్యేదాకా విడవని లక్షణం! అమ్మణ్ణమ్మ విపరీతమైన కష్టజీవి! ఈ రెండు లక్షణాలను పుణికిపుచ్చుకున్న సంతానం... చంద్రబాబు నాయుడు. చంద్రబాబు తండ్రి ఖర్జూర నాయుడిది నారావారిపల్లి. తల్లిది... కందులవారిపల్లి. ఇవి రెండూ పక్కపక్క ఊళ్లే. మధ్యలో రెండు ఫర్లాంగుల దూరం అంతే! దీంతో చంద్రబాబు బాల్యమంతా ఈ రెండు గ్రామాల మధ్య తిరిగింది. తోట బావుల్లో ఈతలు, చుట్టు పక్కల ఊళ్లలో జల్లికట్టు పోటీలు, అల్లరి ఆటలు.. చంద్రబాబు బాల్యమంతా సందడిగానే గడిచింది. అమ్మమ్మ ఇంటికి అదే పరుగున వెళ్లడం.. పొద్దుగూకే సరికి నారావారిపల్లికి చేరడం! ఇదో నిత్యకృత్యం. అప్పట్లో ఖర్జూరనాయుడు ఇల్లు పిల్లలు, బంధువులతోపాటు గొడ్డూగోదతో కళకళలాడేది. పది ఆవులు, గేదెలు, గొర్రెలు, పొట్టేళ్లూ ఉండేవి. 'రెండెకరాలు... రెండెకరాలు' అని రాజకీయ ప్రత్యర్థులు చంద్రబాబును ఒక దశలో ఎద్దేవా చేసిన సంగతి తెలిసిందే. కానీ... అప్పట్లోనే ఖర్జూర నాయుడుకు 15 ఎకరాల పెద్ద సేద్యం. ఇరుగుపొరుగు రైతులు అవసరానికి అడిగితే అప్పు కూడా ఇచ్చేవారు. పొలం పనుల్లోనూ చంద్రబాబు చురుగ్గా పాల్గొనేవారు. చెరకు సాగుకు మడక దున్నడం, కోతలయ్యాక వాది కట్టడం, చెరకు గానుగా ఆడటం ఇలాంటి పనులు ఇష్టంగా చేసేవారు. నారావారిపల్లి దగ్గర్లోనే ఉన్న శేషాపురం బడిలో చంద్రబాబు 1 నుంచి 5వ తరగతి వరకు చదువుకున్నారు. హైస్కూలు... చంద్రగిరిలో! అప్పట్లో ఆరు కిలోమీటర్లు నడిచి.. చంద్రగిరి హైస్కూలుకు వెళ్లేవాడు. ఆ తర్వాత తిరుపతిలోని టీపీపీఎం హైస్కూలులో చేరారు. అప్పుడే.. వాళ్ల నాన్న ఆయనకు సైకిల్ కొనిచ్చారు.

1995లో తొలిసారి సీఎంగా..



2024లో సీఎంగా..



యువకుడు: కొత్తతరం నాయకుడు

'నాయకత్వ లక్షణాలు' పుట్టుకతో వస్తాయా? లేక... నేర్చుకుంటే వస్తాయా? చంద్రబాబు విషయానికి వస్తే... పుట్టుకతో వచ్చిన లక్షణాలకు పెరిగి పెద్దయ్యే కొద్దీ మరింత పదును పెట్టారని చెప్పవచ్చు. చంద్రబాబు ఎక్కడుంటే అక్కడ సందడే! బాల్యంలో బడి నుంచి యూనివర్సిటీలో పీజీ విద్యార్థి దాకా ఇదే జోష్! పీయూసీ రోజుల్లోనే చంద్రబాబు వెయ్యి కోళ్లతో నారావారిపల్లిలో ఫారం పెట్టారు. ఆ వ్యాపారంలో వచ్చిన డబ్బునంతా స్నేహితుల కోసమే ఖర్చు పెట్టేవారు. వారంలో రెండు రోజులైనా స్నేహితులతో కలిసి 'శీనయ్య మెస్'కు వెళ్లాల్సిందే. ఎక్కువ సందర్భాల్లో బిల్లు చంద్రబాబుదే! ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రవేశపెట్టిన 'శ్రమదానం' ఎంత పేరు తెచ్చుకుందో అందరికీ తెలిసిందే. నిజానికి... పీయూసీలోనే ఆయన తన మిత్రులతో కలిసి 'శ్రమదానం' మొదలుపెట్టారు. కొంటి కాలువ, బాపన కాలువలో పూడికలు తొలగించారు. డిగ్రీలో తిరుపతిలోని పొర్ల వీధిలో క్లాస్‌మేట్స్‌తో కలిసి రూమ్‌లో ఉండేవారు. పరీక్షలకు రెండు నెలల ముందు మాత్రం తిరుపతి ఆకుతోట వీధిలో రూమ్ తీసుకుని ఒక్కడే చదువుకునేవారు. చదివేది రెండు నెలలే! కానీ, మార్కులు 50శాతానికి తగ్గేవి కావు. చంద్రబాబులోని అసలైన 'నాయకుడు' ఎస్వీ యూనివర్సిటీలో బయటికొచ్చాడు. 1973-74లో 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనమిక్స్' స్టూడెంట్ ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. యూనివర్సిటీ హాస్టల్, మెస్ జనరల్ సెక్రటరీగా కూడా ఎన్నికయ్యారు. అప్పట్లోనే సాగునీటి ప్రాజెక్టులు, పరిశ్రమల సందర్శనలకు సహ విద్యార్థులను తీసుకెళ్లేవారు. అప్పట్లో ఎ.రంగంపేటలో అప్పర్ ప్రైమరీ స్కూలు మాత్రమే ఉండేది. దానిని హైస్కూలుగా అప్‌గ్రేడ్ చేయాలని జనం కోరితే... రూ.8వేలు కార్పస్ ఫండ్ కడితే చేస్తామని అధికారులు చెప్పారు. దీంతో... చంద్రబాబు చుట్టుపక్కల ఊళ్లలో తన మిత్రులతో కలిసి తిరిగి రూ.5వేల చందాలు పోగేసి... జడ్పీకి చెల్లించారు. దీంతో ఆ బడి హైస్కూలుగా మారింది. తనకు తెలిసిన వారి మధ్య గొడవలు జరిగితే పోలీసు స్టేషన్ దాకా వెళ్లకుండా ఇరుపక్షాలకు ఆమోదయోగ్యంగా రాజీ కుదిర్చేవారు. ఆయన పీజీ చేస్తున్నప్పుడు ఎప్పుడు చూసినా వెంట పదీ ఇరవైమంది ఉండేవాళ్లు. 'నలుగురిలో నా కొడుకు దర్జాగా ఉండాలి' అంటూ అప్పట్లోనే చంద్రబాబుకు ఆయన తండ్రి ఎజ్డీ డబుల్ ఇంజిన్ బైక్ కొనిచ్చారు.

రాజకీయాల్లో కొత్త ఒరవడి

చంద్రబాబు 1977లో పీహెచ్‌డీ చేస్తుండగానే రాజకీయాల్లో అడుగు పెట్టారు. పులిచర్ల సమితికి యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడయ్యారు. అదే సమయంలో దివిసీమ ఉప్పెన విధ్వంసం సృష్టించింది. చంద్రబాబు, తన మిత్రబృందంతో చిత్తూరు జిల్లా వ్యాప్తంగా పర్యటించి... నగదును, సహాయ సామగ్రిని సేకరించి నేరుగా దివిసీమకు వెళ్లి బాధితులకు అందించారు. 'వరకట్న నిషేధిత ప్రతిజ్ఞ'లు చేయించి... ఆ ప్రతులను నాటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావుకు అందించారు. 1978లో చంద్రబాబు తొలిసారి ఎన్నికల బరిలో నిలిచినప్పుడు... వర్సిటీలోని తన మిత్ర బృందమే ప్రచారానికి నేతృత్వం వహించింది. ఎస్వీ యూనివర్సిటీకి చెందిన వందలాదిమంది విద్యార్థులు చంద్రగిరి నియోజకవర్గంలో చంద్రబాబు కోసం ప్రచారం చేసి... గెలిపించారు. చంద్రబాబు తొలిసారి ఎన్నికల్లో పోటీ చేసినప్పుడు ఆయన తండ్రి పొట్టేళ్లు అమ్మిన సొమ్ము రూ.60 వేలు ఇచ్చి... 'ఎన్నికల్లో ఖర్చు పెట్టుకో' అని ఇచ్చారట! అప్పటిదాకా అభ్యర్థులు ఇలా ప్రతి ఊరికీ, ప్రతి ఇంటికీ వెళ్లి ఓట్లు అడిగే సంప్రదాయం ఉండేది కాదు. ఊరి పెద్దలను మాత్రం కలిసి వెళ్లేవారు. తొలిసారిగా చంద్రబాబు... ప్రతి ఇంటి గడపా తొక్కి ఓట్లు అడిగారు.

వాజపేయితో...



బిల్ గేట్స్‌తో...



హుద్‌హుద్ విపత్తులో అండగా..



చేసిన సాయం... చెప్పాలా?

'చంద్రబాబు ఎవరికీ సహాయం చేయడు'... అని చాలామందిలో ఒక అభిప్రాయం ఉంది. అదే సమయంలో... వైఎస్ రాజశేఖర్ రెడ్డి 'దాన కర్ణుడు' అనే ప్రచారం కూడా జరుగుతుంది. అయితే... వైఎస్ చేసే సహాయం బయటికి తెలుస్తుంది. చంద్రబాబు కుడిచేత్తో ఇచ్చేది ఎడమ చేతికి కూడా తెలియదు. ఆయన తెలియనివ్వడు. విద్యా సంస్థల్లో సీట్లు, ఆస్పత్రి ఖర్చులు, చదువుల కోసం డబ్బులు... ఇలా చంద్రబాబు నుంచి రకరకాలుగా సహాయం పొందిన వారు ఎందరో! విచిత్రం ఏమిటంటే... చంద్రబాబు నుంచి వ్యక్తిగతంగా సహాయం పొందిన వాళ్లు కూడా ఆ విషయాన్ని గట్టిగా చెప్పుకోరు. చెప్పాలని ఆయన కూడా ఆశించరు. ఇక... సీఎంఆర్ఎఫ్ నిధులను వైఎస్‌తో పోల్చితే అనేకరెట్లు ఎక్కువగా చంద్రబాబు మంజూరు చేశారు, చేస్తున్నారు. చివరికి... తనకు వ్యతిరేకంగా ప్రచారం చేసిన వ్యక్తులు సాయం కోరి వచ్చినా, ఇచ్చిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఎన్టీఆర్ ట్రస్టు నడిపే విద్యా సంస్థల్లో కార్యకర్తలకు ఉచిత విద్య నుంచి... బసవతారకం ఆస్పత్రిలో ఉచితంగా చికిత్సలు అందించడం వరకు చంద్రబాబు నుంచి సహాయం పొందిన వారు వేలల్లోనే ఉంటారు. అధికార దుర్వినియోగమవుతుందని, తనకు చెడ్డ పేరు వస్తుందని ఏమాత్రం అనిపించినా... సాయం చేయరు.

భువనేశ్వరితో వివాహం...



మనవడితో సరదాగా...



అందరి వాడు...

చంద్రబాబు ఏ వర్గాన్నీ దూరం చేసుకోరు. తాను అందరికీ చెందినవాడిగా ఉండటమే కాదు... అది ప్రజలందరికీ తెలిసేలా కూడా చేస్తారు. ఆయన మంత్రివర్గ కూర్పు, పదవుల పంపిణీ దీనికి నిదర్శనం. చివరికి... ఆయన మీడియాతో మాట్లాడుతున్నప్పుడు కూడా అటూ ఇటూ వేర్వేరు సామాజిక వర్గాలకు చెందిన నేతలను కూర్చోబెట్టుకుంటారు. ఇది ఉద్దేశపూర్వకం కాదని చెప్పవచ్చు. ఎందుకంటే... చదువుకునేటప్పటి నుంచీ ఆయనకు ఇదే అలవాటు. ఆయన యూనివర్సిటీలో ఉన్నప్పుడు చంద్రబాబు సన్నిహిత మిత్ర బృందంలో తొండవాడ గిరిధర్ రెడ్డి, రంగంపేట సుబ్బరామిరెడ్డి, విక్టర్, పీఎస్ మునిరత్నం, షరీఫ్, కరీం... ఇలా అన్ని వర్గాలకు చెందినవారు ఉండేవారు. అందరూ మిత్రులు కాకపోవచ్చు. కానీ... శత్రువులు మాత్రం ఉండొద్దని, వీలైనంత వరకు తనవాళ్లుగా చేసుకోవాలన్నది చంద్రబాబు విధానం. ఎప్పుడు, ఎవరితో ఎలాంటి అవసరం వస్తుందో తెలియదు కదా! అందుకే... అందరితో బాగుండాలని భావిస్తారు. అప్పుడూ అంతే, ఇప్పుడూ అంతే! కఠినమైన నిర్ణయాలు తీసుకునేందుకు ఒకటికి పదిసార్లు ఆలోచిస్తారు. చిన్నస్థాయి వ్యక్తే అయినా, అమెరికా అధ్యక్షుడే అయినా... ఎవరినీ నిర్లక్ష్యం చేయరు. బ్యూరోక్రాట్ల విషయంలో ఇంకా జాగ్రత్తగా, లెక్కప్రకారం వెళతారు. 'ఫలానా అధికారికి అనవసరమైన ప్రాధాన్యం ఇచ్చారు' అని పైకి అనిపించినప్పటికీ... లోపల మరేదైనా కారణం ఉండే ఉంటుంది. విపక్షంలో ఉన్నప్పుడు కూడా ఢిల్లీకి వెళ్లినప్పుడు ఆయన కేంద్ర అధికారులతో మాట్లాడేవారు. ఏదో ఒక సమయంలో రాష్ట్రం కోసం పనికిరాకపోతారా... అనేదే ఆయన ఉద్దేశం.

అన్న క్యాంటీన్‌తో ఆకలి తీరుస్తూ...



అలిపిరిలో గాయపడి...



అసెంబ్లీలో భంగపడి...



ఏడుకొండల వాడా...

చంద్రబాబు ఇష్టదైవం తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామి! ఇది కొత్తగా వచ్చిన భక్తి కాదు. ఆయన బాల్యం తిరుమల కొండతో ముడిపడింది. శనివారం వచ్చిందంటే చాలు... నారావారి పల్లి నుంచి అడవి మార్గంలో 'గోవిందలు' పెడుతూ బంధువులు స్నేహితులతో కొండకు నడిచి వెళ్లేవాళ్లు.

- ఆంధ్రజ్యోతి, తిరుపతి/అమరావతి

గండాలు దాటుతూ...

చంద్రబాబు ఉమ్మడి రాష్ట్ర సీఎంగా ఉండగా జరిగిన 'అలిపిరి పేలుడు' ఘటన గురించి అందరికీ తెలుసు! వేంకటేశ్వర స్వామి దయవల్లే బతికానని ఆయన ఎప్పుడూ చెప్పుకొంటూ ఉంటారు. అయితే... బాల్యంలోనూ ఆయన పలు గండాలు దాటి బయటపడ్డారు. ఊహతెలియని వయసులో అమ్మమ్మ గారి ఇంట్లో చాపమీద పడుకుని ఉండగా... ఇంట్లోకి నాగుపాము వచ్చింది. రెండేళ్ల వయసులో చంద్రబాబు నీళ్ల తొట్టిలో పడిపోతే వాళ్ల చిన్నాన్న చూసి బయటికి లాగారు. కొబ్బరి చిప్ప తగిలి ఆయన నొసటన గాయమైన మచ్చ ఇప్పటికీ కనిపిస్తుంది.

అరెస్టు సమయంలో...





ఆహారం... ఆరోగ్యం!

75 ఏళ్ల వయసులోనూ చంద్రబాబులో ఏమాత్రం ఉత్సాహం తగ్గకపోవడానికి కారణం... క్రమశిక్షణతో కూడిన జీవన శైలి! తెల్లవారుజామునే నిద్ర లేస్తారు. యోగా చేస్తారు. ఆహారం విషయంలో అత్యంత కఠినంగా ఉంటారు. వైద్యులు ఎంత సూచిస్తారో అంతే తింటారు. ఈ వయసులోనూ ఎంతసేపైనా నిల్చుని పనిచేయగలగడం ఆయన ప్రత్యేకత. జనంలోకి వెళ్లినప్పుడు, కార్యకర్తలను కలిసినప్పుడు అలా నిలబడే అందరితో ఓపిగ్గా ఫొటోలు దిగడం ఆయనకు అలవాటు. ఆమధ్య తిరుమల కొండకు చకచకా నడిచి వెళ్లారు. 'చంద్రబాబుకు అనారోగ్యం, అస్వస్థత' అన్న వార్తలు విన్న సందర్భాలు అత్యంత అరుదు! ఇతర రాజకీయ నాయకుల్లాగా తరచూ పర్యటనలకు వెళ్లే అలవాటు లేదు. ఏడాదికోసారి మాత్రమే కుటుంబ సభ్యులతో కలిసి ఎటైనా వెళ్లేవారు. మనవడు దేవాన్ష్ పుట్టాక ఆయన కుటుంబ సభ్యులతో కలిసి విహార యాత్రలకు వెళ్లడం కాస్త ఎక్కువైందని చెప్పవచ్చు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.